తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
RNI NO.APTEL / 2013 /50370
బుధవారం 20.03.2024 | సంపుటి : 10 సంచిక : 250 | పేజీలు : 12 వెల: రూ. 4/-
Follow :
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి 9848328698

సామాన్యుని స్వరం
జనం గోసల గొంతుక జనంసాక్షి ఇది ప్రజల ఛానల్
JANAMSAKSHI TV



# గులాబీ గుభాళింపు సాధ్యమేనా?



## మళ్లీ ఉద్యమకాలంనాటి ఆదరణ లభించేనా!

ప్రజల్ని ఎంత కాదనుకున్నా తెలంగాణను సాధించి పెట్టిన బీ(టీ)ఆర్ఎస్ వెంటే జనం నడిచారు. ఉద్యమ పార్టీతోనే తెలంగాణవాదం వినబడగలదని బలంగా విశ్వసించి ఆదరించారు. అధికారం మాటున నచ్చని పనులు చేసినా నాడు రాష్ట్రం కోసం వాళ్లతో ర్యాలీ కాక తప్పలేదు. పదేళ్లు అధికారం ఇచ్చినప్పటికీ పాలనలో ప్రజల్ని భాగస్వామ్యం చేయలేదు సరికదా ప్రజాక్షేత్రానికి మరింత దూరమయ్యారు. ఈ పరిణామాలే నేడు ఒక్కొక్కటిగా వెంటాడి పార్టీని ఒంటరి చేశాయి. రెండు జాతీయ పార్టీల మధ్య అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోయేలా చేస్తున్నాయి. ప్రత్యర్థుల ను ఎలా ఎదుర్కోవాలో తెలియక ప్రజల్లో పట్టుకోల్పోయే స్థితికి పార్టీని చేరుస్తున్నాయి. నిండు ఉద్యమ సమయంలో అంగబలం, అర్థబలం లేక ఇంతకంటే గడ్డు పరిస్థితులను ఛేదించుకుంటూ వచ్చిన పార్టీ.. నేడు ప్రత్యర్థుల చేతుల్లో చిత్తుచిత్తవుతుండటం చూసి నిఖార్సైన 'ఉద్యమకారులు' నిశ్చేష్టులవుతున్నారు.

- రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత బీఆర్ఎస్‌తో ప్రజలకు అవసరం తీరినట్టేనా..?
- సీమాంధ్ర పార్టీలను ఎదుర్కొన్నంత సులువుగా తెలంగాణ పార్టీలను ఢీకొట్టేనా?
- బాబు, వైఎస్ మీద ఒంటికాలిపై లేచినట్టు రేవంత్‌రెడ్డిని ఇరకాటంలో పెట్టగలరా?

స్పెషల్ కరస్పాండెంట్ (జనంసాక్షి)
తెలంగాణను ఇచ్చి, పదేళ్ల పాటు అధికారానికి దూరమైన 'హస్తం' మళ్లీ కళకళలాడుతుండగా.. అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నామని చెప్పుకొచ్చిన బీఆర్ఎస్ మాత్రం విలవిలలాడుతోంది. అధికారం కోసం అర్రులుచాస్తూ చేరినవారు ఇప్పుడు అదే 'అధికారానికై' అంగలారుస్తున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలు అధికార పార్టీ కాంగ్రెస్‌లో చేరిపోతుండటం భారాసా అధిష్టానాన్ని, శ్రేణుల్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఓవైపు అసెంబ్లీ ఫలితాల ప్రభావం, మరోవైపు ఢిల్లీ లిక్కర్ స్కాం, ఇంకోవైపు పార్లమెంట్ ఎన్నికల గండం కంటికి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఉద్యమకాలంలో గెలుపోటములు అత్యంత సహజంగా తీసుకున్న పార్టీ.. పద్నాలుగేండ్ల స్వరాష్ట్ర పోరాటంలో ఎన్నో ఢక్కామొక్కీలు ఎదుర్కొంది. నాడు గెలుపోటములను సమానంగానే భావించి, నేడు మాత్రం గతంలో ఎన్నడూ లేనంతగా బీఆర్ఎస్ షేకవుతోంది. అసెంబ్లీ గెలిచిన ఎమ్మెల్యేలు కొందరు పక్కచూపులు చూస్తుండటం, మరికొందరు ఎమ్మెల్యేలు పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండటం అధిష్టానాన్ని ఆత్మరక్షణలో పడేసింది. త్వరలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సైతం నేతలెవరూ ముందుకు రానివైనం 'అధినేత'ను మరింత కుంగదీసింది. ఇటీవల కీలక నేతలు కొందరు పార్లమెంట్ నియోజకవర్గాలకు పోటీచేసేందుకు వెనుకాడారు. ముగ్గురు సిట్టింగ్ ఎంపీలు పార్టీలు మారారు. ఈ నేపథ్యంలో సీనియర్ నేతలను సముదాయించి ఎంపీ అభ్యర్థులుగా ఖరారుచేయడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది.




### సెంటిమెంటు మటుమాయం..!

2014, 2018లో తెలంగాణ సెంటిమెంట్ ఆధారంగా అధికారం చేజిక్కించుకున్న బీఆర్ఎస్ పార్టీకి

మిగతా 2లో..

## తెలంగాణ నూతన గవర్నర్‌గా
# రాధాకృష్ణన్

### జార్ఖండ్ గవర్నర్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్రపతి కార్యాలయం ఉత్తర్వులు

**పుదుచ్చేరి లేజీగా కూడా.. • నేడు బాధ్యతలు స్వీకరణ**



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ నూతన గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. తమిళిసై సౌందర రాజన్ రాజీనామాతో ఝూర్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు రాష్ట్ర బాధ్యతలు అదనంగా అప్పగించారు. పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా కూడా ఆయనకే అదనపు బాధ్యతలు అప్పగించారు. బుధవారం ఉదయం 11.15 గంటలకు రాధాకృష్ణన్ బాధ్యతలు స్వీకరించనున్నారు. రాజ్‌భవన్ వేదికగా కార్యక్రమం జరగనుంది. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ప్రమాణం చేయించనున్నారు.తెలంగాణ గవర్నర్ పదవికి తమిళి సై రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆమె రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదించారు. తెలంగాణ గవర్నర్‌గా ఝూర్ఖండ్ గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా కూడా ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్రపతి కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

## సివిల్స్ ప్రిలిమినరీ వాయిదా

**లోక్‌సభ ఎన్నికల కారణంగా రీషెడ్యూల్ • జూన్ 16న నిర్వహణ**




ఢిల్లీ(జనంసాక్షి): యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్, ఫారెస్ట్ సర్వీస్ ఉద్యోగాలకు దర ఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ముఖ్య గమ నిక. అఖిల భారత సర్వీసుల్లో ఉద్యోగాల భర్తీకి

మిగతా 2లో..

## హిందు మతమే లక్ష్యంగా ఇండియా కూటమి పనిచేస్తోంది

**సేలం సభలో ప్రధాని మోదీ**



చెన్నై(జనంసాక్షి): లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ వరుసగా వేర్వేరు రాష్ట్రాల్లో బహిరంగ సభల్లో పాల్గొంటున్నారు. మంగళవారం తమిళనాడు లోని సేలం జిల్లాలో నిర్వహించిన సభలో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. పదేళ్ల క్రితం సేలం జిల్లాలో హత్యకు గురైన భాజపా నాయకుడు వి.రమేశ్‌ను గుర్తుచేసుకుంటూ ఉద్వేగానికి లోనయ్యారు. దీంతో కొద్దిసేపు తన ప్రసంగాన్ని నిలిపి తిరిగి ప్రారంభించారు. "ఆడిటర్ రమేశ్‌ను ఎప్పటికీ మర్చిపోలేను. ప్రస్తుతం ఆయన మనతో లేరు. ఆయనో గొప్ప వక్త. రాత్రింబవళ్లు పార్టీ కోసం ఎంతో కష్టపడి పనిచేశారు. కానీ, ఆయన హత్యకు గురయ్యారు. సభాముఖంగా నేను ఆయనకు నివాళి అర్పిస్తున్నా" అని ప్రధాని

మిగతా 9లో..

## ఈడీ ప్రకటనపై ఆప్ తీవ్ర అభ్యంతరం

న్యూఢిల్లీ(జనంసాక్షి): దిల్లీ మద్యం విధానంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విడుదల చేసిన పత్రికా ప్రకటనపై ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. లోక్‌సభ ఎన్నికల ముందు తమ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఇలాంటి ఆరోపణలు చేస్తోందని దుయ్యబట్టింది. ఈ దర్యాప్తు సంస్థ భాజపా పొలిటికల్ వింగ్‌లా పనిచేస్తోందని మండిపడింది. 2021-22 దిల్లీ మద్యం విధాన రూపకల్పన, అమలు ద్వారా ప్రయోజనాలు




మిగతా 9లో..

## మేనిఫెస్టోకు ఇండియా కూటమి కసరత్తు

### దేశ ప్రజలు మార్పును కోరుకుంటున్నారు
### 2004 ఫలితమే పునారావృతమవుతుంది: ఖర్గే



ఢిల్లీ(జనంసాక్షి): దేశప్రజలుమార్పును కోరుకుంటున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. లోక్‌సభ ఎన్నికల కోసం మేనిఫెస్టోపై చర్చించేందుకు మంగళవారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా మేనిఫెస్టోలో ప్రస్తావించిన ప్రతి అంశాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు దేశంలోని అన్ని గ్రామాల్లో, నగరాల్లో ప్రచారం చేయాలని ఆయన పిలుపునిచ్చారు."దేశం మార్పును కోరుకుంటోంది. భారత్ వెలిగిపోతోందంటూ 2004లో భాజపా ప్రచారం చేసింది. అప్పుడు ఏం జరిగిందో.. ఇప్పుడు అవే ఫలితాలు వస్తాయి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలకు అప్పటి గతే పడుతుంది. పార్టీ మేనిఫెస్టోకు విస్తృత ప్రచారం కల్పించడం మన బాధ్యత. దేశంలో ప్రతి ఇంటికి కాంగ్రెస్ మేనిఫెస్టో చేరువకావాలి. ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ అమలు చేస్తుంది" అని ఖర్గే తెలిపారు.రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్రతో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలు

మిగతా 2లో..

## అమ్మను కలిసేందుకు అనుమతించండి

### ఢిల్లీ కోర్టులో కవిత పిటిషన్
### సుప్రీంలో కేసు ఉపసంహరించుకున్న ఎమ్మెల్సీ



న్యూఢిల్లీ(జనంసాక్షి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్ట్ అయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ప్రస్తుతం ఈడీ కస్టడీలో ఉన్నారు. ఈ క్రమంలో మా అమ్మను కలిసేందుకు అనుమతించండి అంటూ న్యాయస్థానాన్ని కవిత అభ్యర్థించారు. తల్లితో పాటు కుమారులను కలుసుకునేందుకు కూడా అనుమతించాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ మేరకు రౌస్ అవెన్యూ కోర్టులో కవిత తరపు న్యాయవాదులు మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. కవిత అభ్యర్థనకు

మిగతా 2లో..

**తప్పుదోవ పట్టించే ప్రకటనల కేసు..**

## రామ్‌దేవ్‌బాబాకు సుప్రీం సమన్లు

ఢిల్లీ(జనంసాక్షి): యోగా గురువు రామ్‌దేవ్ బాబాకు మంగళవారం సుప్రీంకోర్టు సమన్లు జారీచేసింది. పతంజలి ఆయుర్వేద సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఆయనతో పాటు మేనేజింగ్ డైరెక్టర్ ఆచార్య బాలకృష్ణ కోర్టు ఎదుట హాజరుకావాలని ఆదేశించింది.తప్పుదోవ పట్టించే ప్రకటనల కేసులో ధిక్కార పిటిషన్‌పై సమాధానం

మిగతా 2లో..

## అన్నదాతలను ఆదుకోండి

### అకాల వర్ష బాధిత రైతులకు నష్టం పరిహారం చెల్లించండి: హరీశ్ రావు



హైదరాబాద్(జనంసాక్షి): అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఆదిలాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట, రంగారెడ్డి తదితర జిల్లాల్లో ఈదురుగాలులతోకూడిన వడగండ్ల వాన అన్నదాతను అతలాకుతలం

మిగతా 2లో..

## ఉపరితలద్రోణి ప్రభావం

**తెలంగాణలో పలుచోట్ల వర్షాలు • ఎల్లో అలర్ట్ జారీ**



హైదరాబాద్(జనంసాక్షి): పశ్చిమ విదర్భ, దాని పరిసర ప్రాంతాలలో సగటు సముద్ర మట్టానికి 1.5 కిలో మీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఒకటి కేంద్రీకృమై ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు

మిగతా 2లో..



## గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్

**నలుగురు మావోయిస్టులు మృతి**

ముంబయి(జనంసాక్షి): మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టులు-భద్రతా బలగాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోలు చనిపోయారు. తెలంగాణ సరిహద్దు నుంచి మహారాష్ట్రలోనికి మావోయిస్టులు ప్రవేశిస్తుండగా వారిని భద్రత బలగాలు చుట్టుముట్టాయి. పోలీసుల అలికిడి విన్న మావోలు కాల్పులు జరపడంతో

మిగతా 2లో..

సీఏఏపై స్టే పిటిషన్లు..

## మూడు వారాల్లోగా సమాధానమివ్వండి

**కేంద్రానికి సుప్రీం ఆదేశాలు • విచారణ ఏప్రిల్ 9కి వాయిదా**

ఢిల్లీ(జనంసాక్షి): లోక్‌సభ ఎన్నికలకు ముందు పౌరసత్వ సవరణ చట్టాన్ని కేంద్రం అమల్లోకి తీసుకురావడం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టు లో పలు పిటిషన్లు దాఖలయ్యాయి.వీటిపై మంగళవారం విచారణ జరిపిన న్యాయస్థానం కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. ఈ చట్టం అమలుపై స్టే విధించాలని పిటిషనర్లు కోరగా.. కోర్టు ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు.2019లో పార్లమెంట్ ఆమోదం పొందిన సీఏఏను సవాల్ చేస్తూ అప్పట్లోనే సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. నిబంధనలు ఇంకా నోటిపై

మిగతా 9లో..



## మానవతాసాయంపై కుట్రలు

### అన్నార్థులకు ఆహారం అందకుండా ఇజ్రాయెల్ ఆంక్షలు
### నిజమైతే యుద్ధ నేరమే.. ఐరాస ఆగ్రహం • గాజాలో పరిస్థితులపై ఆందోళన

జెనీవా(జనంసాక్షి): యుద్ధంతో ఛిద్రమవుతోన్న గాజాలో మానవతాసాయం అందించేలా చూసేందుకు ఇజ్రాయెల్ ఆంక్షలు అడ్డంకిగా మారాయని ఐరాస తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పరిణామాలు చూస్తుంటే..ఆకలి మంటల్ని ఆ దేశం యుద్ధతంత్రంగా వాడుతున్నట్లు అనిపిస్తోందని వ్యాఖ్యలు చేసింది. అదే గనుక నిజమైతే యుద్ధ నేరం కింద పరిగణించాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేసింది. అక్టోబర్ 7న హమాస్ జరిపిన ఉగ్ర దాడితో గాజాలో ఇజ్రాయెల్ ప్రతిదాడులు మొదలుపెట్టింది. అప్పటినుంచి ఆ ప్రాంతం పరిస్థితి దారుణంగా మారింది. స్థానికుల ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. ఇక్కడి జనాభాలో 70 శాతం మంది తీవ్ర ఆహార కొరతను ఎదుర్కొంటున్నట్లు తాజాగా అంచనా వేసింది. స్థానికంగా ప్రతిఒక్కరూ ఆహారం కోసం ఇబ్బందులు పడుతున్నారని, ఉత్తర ప్రాంతంలో దాదాపు 2 లక్షల మంది విపత్కర



మిగతా 2లో..

# మేనిఫెస్టోకు ఇండియా కూటమి కసరత్తు

వెలుగులోకి వచ్చాయన్నారు. "రాహుల్ చేసింది కేవలం రాజకీయ యాత్ర కాదు. ఇలాంటిది ఇంతకముందు ఏ నాయకుడు చేయలేదు. రెండు యాత్రలతో దేశవ్యాప్తంగా ప్రజల సమస్యలు అందరి దృష్టిని ఆకర్షించాయి" అని సీడబ్ల్యూసీ భేటీలో అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్‌తోపాటు ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు. మహిళల కోసం కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే 'నారీ న్యాయ్' పేరుతో ఐదు హామీలను ప్రకటించింది. మరోవైపు అధికారం లోకి రాగానే పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేస్తామని హామీ ఇచ్చింది. ఇదే కాకుండా 'కిసాన్ న్యాయ్' పేరిట ఐదు హామీలు ప్రకటించింది.

# శరద్ పవార్‌కు సుప్రీంలో ఊరట

### బూర ఊదుతున్న గుర్తుకు అనుమతి

**న్యూఢిల్లీ,మార్చి19(జనంసాక్షి):**లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు 'ఎన్‌సీపీ-ఎస్‌సీపీ' పేరుతో పాటు 'మనిషి ఊదుతున్న తుర్రా' చిహ్నాన్ని ఉపయోగించుకోవచ్చని.. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీకి చెందిన శరద్ పవార్ వర్గానికి సుప్రీంకోర్టు మంగళవారం అనుమతి ఇచ్చింది. ఆ చిహ్నాన్ని శరద్ పవార్ వర్గానికి చెందిన ఎన్నికల చిహ్నంగా రిజర్వ్ చేయాలని భారత ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఆ గుర్తును ఏ ఇతర పార్టీకి లేదా అభ్యర్థికి కేటాయించరాదని స్పష్టం చేసింది. ఇదే సమయంలో.. ఎన్‌సీపీ వ్యవస్థాపకుడు శరద్ పవార్ పేరుని గానీ, ఫోటోలను గానీ ఎన్నికల ప్రచారంలో ఉపయోగించకుండా అజిత్ పవార్ వర్గాన్ని అత్యున్నత న్యాయస్థానం నిషేధించింది. అలాగే, గడియారం గుర్తుకు సంబంధించిన వివాదాస్పద అంశాన్ని ప్రస్తావిస్తూ.. ఈ గడియారం గుర్తు 'కోర్టులో పరిశీలనలో ఉందని' పబ్లిక్ నోటీసు జారీ చేయాలని అజిత్ పవార్ వర్గాన్ని కోర్టు చెప్పింది. ఇంగ్లీష్, హిందీ, మరాఠీ భాషల్లో ఈ నోటీసులు ఇవ్వాలని.. అన్ని ప్రచార ప్రకటనల్లో కూడా ఆ అంశాన్ని ప్రస్తావించాలని సూచించింది. అంతకుముందు.. అజిత్ పవార్ వర్గాన్ని నిజమైన ఎన్‌సీపీగా ప్రకటిస్తూ ఎన్నికల కమిషన్ ఇచ్చిన నిర్ణయంపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇదిలావుండగా.. రాజకీయ ప్రయోజనాల కోసం పేరు, ఫోటోలను దుర్వినియోగం చేస్తున్నారంటూ శరద్ పవార్ వర్గం గతవారం పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీకి సుప్రీంకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. ప్రత్యేకంగా పార్టీ ఉన్నప్పుడు శరద్ పవార్ ఫోటోను ఎందుకు వినియోగిస్తున్నారని అజిత్ వర్గాన్ని కోర్టు ప్రశ్నించింది. సొంత పార్టీ గుర్తింపుతో ముందుకు వెళ్లాలని సూచించింది. శరద్ పవార్ పేరు, చిత్రాలను ఉపయోగించబోమని హామీ ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసు విచారణలో భాగంగానే తాజాగా శరద్ పవార్ వర్గానికి సుప్రీంకోర్టు కొత్త చిహ్నాన్ని జారీ చేసింది.

### కెసిఆర్ లక్ష్యంగా

# రాజకీయ కుట్రలు

### కవిత అరెస్ట్ ఉద్దేశ్యం ఇదే కనిపిస్తోంది

### బీఆర్ఎస్ మాజీ మంత్రుల విమర్శలు

**హైదరాబాద్,మార్చి19(జనంసాక్షి):**బ్యాంక్‌లకు లక్షల కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన వారిని వదిలి కేవలం రాజకీయ కక్షతో కెసిఆర్‌ను అణచివేయాలన్న కుట్రతోనే కవితను అరెస్ట్ చేశారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ టార్గెట్‌గానే ఇవన్నీ జరుగుతున్నాయన్నారు. అధికారంలో ఉన్నామని భయ భ్రాంతులకు గురిచేసి పార్టీలో చేర్చుకుంటామంటే కుదరదన్నారు. అసమానతలు, అణిచివేత ఉన్నందునే నక్సల్‌బరి నుంచి తెలంగాణ ఉద్యమం వరకు పుట్టుకొచ్చాయని చెప్పుకొచ్చారు. ఈ గడ్డపై మరో ఉద్యమం పుట్టడం ఖాయమన్నారు. అన్ని వర్గాలను కడుపులో పెట్టుకుని కాపాడుకుంది కేసీఆర్ మాత్రమే అని శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి విర్రవీగే మాటలు మానుకోవాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వ్యాఖ్యలు చేశారు. గత సీఎం కేసీఆర్ తప్పు చేసినట్లు చెప్పడం మూర్ఖత్వమన్నారు. ఎంక్వైరీల పేరుతో గత పథకాలు ఎగ్గొడుతున్నారన్నారు. దళిత బంధు, గొర్రెల పంపిణీ ఆపేశారని మండిపడ్డారు. ఇస్తరో ఇవ్వరో ఆ వర్గాలకు సమాధానం చెప్పాలన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా సీఎం చిల్లరగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి భాషపై క్రిమినల్ కేసుపెట్టి జైల్‌కు పంపాలని కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు.

# ప్రాజావాణికి తాత్కాలిక బ్రేక్

### ఎన్నికల ఫలితాల తరవాత తిరిగి ప్రారంభం

**హైదరాబాద్,మార్చి19(జనంసాక్షి):**తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తరువాత తీసుకున్న నిర్ణయాలలో ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా నిలిపివేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్ లోని ప్రజాభవన్ లో ప్రజావాణి కార్యక్రమానికి డిసెంబర్ శ్రీకారం చుట్టారు. అయితే ప్రజావాణి కార్యక్రమాన్ని కొన్ని రోజులపాటు నిలిపివేశారు. దేశ వ్యాప్తంగా ఎన్నికల కోడ్ కారణంగా ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారులు వెల్లడించారు.మే 13న రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలతో పాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరగనున్నాది. జూన్ 4న ఓట్లు లెక్కించి, ఫలితాలు ప్రకటించనున్నారు. ఈసీ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జూన్ 6న ఎన్నికల పక్రియ అధికారికంగా ముగుస్తుంది. దాంతో జూన్ 7 నుంచి తిరిగి ప్రజావాణి కార్యక్రమం యథాతథంగా కొనసాగించనున్నట్లు నోడల్ అధికారి వెల్లడించారు. తమ సమస్యలు చెప్పుకునేందుకు ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చేవారు. ఈ కార్యక్రమంలో ఎక్కువగా భూముల సంబంధిత సమ్యలు, ధరణి, ఆరోగ్యం,నిరుద్యోగం అంశాలపైనే ప్రజలు ప్రభుత్వానికి ఎక్కువ వినతిపత్రాలు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. వారానికి రెండు రోజులు రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తోంది. మంగళవారం, శుక్రవారాల్లో కచ్చితంగా ప్రజావాణి నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలోనే నిర్ణయించారు. ఆ రెండు రోజుల్లో జ్యోతిరావ్ పూలే ప్రజాభవన్‌కు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి తమ సమస్యలు చెప్పుకునేవారు.

# గులాబీ గుభాళింపు సాధ్యమేనా?

ఇటీవల ఆ పాచిక పారకుండా పోయింది. తెలంగాణ ఆవిర్భావానికి ముందు, తర్వాత చంద్రబాబు, వైఎస్‌ఆర్ మీద ఒంటి కాలితో లేచిన కేసీఆర్.. సీమాంధ్ర పార్టీలొస్తే రాష్ట్రం మళ్లీ అంధకారమవుతుందని ప్రజలకు నొక్కిచెప్పారు. నీళ్లు, నిధులు, నియామకాల్లో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరించి విజయవంతమయ్యారు. తదనంతరం 2014 ఎన్నికల తర్వాత టీడీపీ ఎమ్మెల్యేలను స్వాగతించి ఆ పార్టీని మటుమాయం చేశారు. రెండు పర్యాయాలు ప్రధాన ప్రతిపక్షం లేకుండా కాంగ్రెస్‌ను కూడా దెబ్బతీశారు. ముందస్తు ఎన్నికల్లో 88 సీట్లు సాధించినా ఇతర పార్టీ ఎమ్మెల్యేలను ఆకర్షించడాన్ని ఎవరూ స్వాగతించలేదు. బీఆర్‌ఎస్‌తోనే ఊపిరిపోసుకున్న తెలంగాణ ఉద్యమం ఎన్నో సందర్భాల్లో లేచినప్పుడు లేచింది. కొన్ని సందర్భాల్లో మూగబోయింది. కానీ 2014, జూన్ 2 తర్వాత పాలన విషయంలోనూ బీఆర్‌ఎస్ సర్కారు, ఎమ్మెల్యేల ఏకచత్రా ధిపత్యం, సంక్షేమ పథకాల్లో మితిమీరిన జోక్యం, పార్టీ కార్యకర్తలకే కేటాయించడం వంటి అంశాల్లో విమర్శల పాలైంది. ఎవరి అభిప్రా యాలకు తావివ్వకుండా పాలన కొన సాగించింది. ఈ నేపథ్యంలో గత రెండుమూడేళ్లుగా ప్రజలకు దూరమవుతూ వచ్చింది. ఇదే పార్టీ ఓటమికి కారణభూతంగా మారింది.

### బీఆర్ఎస్ తట్టుకోగలదా..?

మొన్నటిదాకా మందీమార్బలంతో కళకళలాడిన బీఆర్‌ఎస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో గడ్డుపరిస్థితులు ఎదురుకానున్నట్టు తెలుస్తోంది. అభ్యర్థులను ఎంపిక చేయడం ఆ పార్టీకి తలకుమించిన భారమైంది. పోటీకి సై అన్నవారే తర్వాత నై.. నై అంటూ స్వరం వినిపించారు. 'గులాబీ'లో సీ(చో)టిస్తే చాలనుకునేవారు నేడు పార్టీలో ఉండేందుకే జంకుతున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ గేట్లెత్తినట్టు ప్రకటించడం 'గులాబీ'లో గుబులు రేపుతోంది. సొంత ఇలాకాల నుంచి కూడా కండువాలు మారిపోతుండటం కేసీఆర్‌ను కలవరపాటుకు చేస్తుండగా.. రాబోయే రోజుల్లో కలలో కూడా ఊహించని సమీకరణాలు చవిచూడాల్సి వస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రతిపక్ష పార్టీలపై తోకతొక్కిన పాములా కస్సుబుస్సులాడిన కేసీఆర్.. సీఎం రేవంత్‌రెడ్డిని అదే రీతిలో ఎదుర్కోవడం సాధ్యమేనా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారం కోల్పోయినా బీఆర్‌ఎస్ వైఖరిలో మార్పు రాకపోవడం, ఓటములను విశ్లేషించుకుని ప్రజలకు దగ్గరయ్యే మార్గాలు అన్వేషించకపోవడం మరింత నష్టం చేస్తుందనే వాదనలు కూడా వినబడుతున్నాయి. ప్రజల్లోనూ బీఆర్‌ఎస్ పట్ల వ్యతిరేకత తగ్గినట్టు లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపంలో ఉన్న తరుణంలో రెండు జాతీయ పార్టీల మధ్య నలిగిపోతున్న బీఆర్‌ఎస్.. 'గులాబీ' రెక్కలను కాపాడుకుంటుందా? ప్రధాన ప్రతిపక్షంగా ఉంటూ ప్రజల్లో తిరిగి పట్టు సాధిస్తుందా? ఉద్యమకాలం నాటి ఆదరణ పొందుతుందా? అన్నది వేచిచూడాలి.

# మానవతాసాయంపై కుట్రలు

పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నట్లు తెలిపింది. ఒకవేళ ఇజ్రాయెల్ తన దాడులను రఫాకు విస్తరిస్తే.. మొత్తం 23 లక్షల మంది జనాభాలో సగం మంది క్షుద్బాధకు లోనవుతారని హెచ్చరించింది.దాదాపు 1.3 మిలియన్ల మంది పాలస్తీనీయులు ఆశ్రయం పొందుతున్న రఫా ప్రాంతాన్నీ ఇజ్రాయెల్ ఆక్రమించే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. దీనిపై మరోసారి ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో, అమెరికా అధ్యక్షుడు బైడెన్ మాట్లాడుతూ ఆందోళన వ్యక్తంచేశారు. 'తాజా పరిణామాలపై నెతన్యాహుతో మాట్లాడాను. హమాస్‌ను అడ్డుకునే హక్కు ఇజ్రాయెల్‌కు ఉందని పునరుద్ఘాటించాను. అలాగే బందీలను విడిపించుకునే ఒప్పందంలో భాగంగా కాల్పుల విరమణ అవసరాన్ని మరోసారి స్పష్టంచేశాను. రఫాలో గ్రౌండ్ ఆపరేషన్ లేకుండా హమాస్‌ను ఎదుర్కొనే మార్గాలపై చర్చించేందుకు ఓ బృందాన్ని వాషింగ్టన్ కు పంపాలని ఆయనకు సూచించాను' అని బైడెన్ సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించారు.హమాస్‌పై పోరు విషయంలో ఇజ్రాయెల్ ప్రధాని అనుసరిస్తున్నహమాస్‌పై పోరు విషయంలో ఇజ్రాయెల్ ప్రధాని అనుసరిస్తున్న తీరుపై కొద్దిరోజుల క్రితం బైడెన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. బెంజమిన్ వైఖరి ఆయన సొంత దేశాన్నే గాయపరుస్తోందని వ్యాఖ్యానించారు. ఆ నేపథ్యంలో ఇరువురు నేతల మధ్య దూరం పెరిగినట్లు వార్తలు వచ్చాయి. అయితే నెల రోజుల తర్వాత తాజాగా వీరిద్దరూ మాట్లాడుకోవడం గమనార్హం.

# గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్

భద్రతా బలగాలు ఎదురుకాల్పులు జరిపారు. హతమైన మావోయిస్టులు తెలంగాణ కమిటీకి చెందిన వారిగా గుర్తించారు. మృతి చెందిన మావోలలో ఇద్దరిపై రూ.36 లక్షల రివార్డు ఉన్నట్టు సమాచారం. ఘటనా స్థలంలో నుంచి ఎకె 47 తుపాకులు, మందుగుండు సామాగ్రి, సాహిత్య పుస్తకాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతులలో మంచిర్యాల డివిజన్ కమిటీ సెక్రటరీ వర్గీస్, చెన్నూరు ఏరియా కమిటీ సెక్రటరీ మగ్తూ, కుర్సంగ్ రాజు, కుడిమెట్ట వెంకటేశ్‌లుగా గుర్తించారు.

# అన్నదాతకు అండగా నిలవండి

చేసిందన్నారు. పంటలు చేతికి రానున్న సమయంలో కురిసిన వడగండ్ల వాన రైతులకు కన్నీరు మిగిల్చిందని చెప్పారు. రెండు, మూడు రోజులుగా అకాల వర్షాలు కురుస్తున్నప్పటికీ ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని విమర్శించారు. వెంటనే ఎకరాకు రూ.10 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. 'ఆదిలాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట, రంగారెడ్డి తదితర జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన అన్నదాతను అతలాకుతలం చేసింది. పంటలు చేతికి రానున్న సమయంలో కురిసిన వడగండ్ల వాన రైతులకు కన్నీరు మిగిల్చింది. వరి, మొక్కజొన్న, జొన్న పంటలతోపాటు బొప్పాయి, మామిడి సహా ఇతర ఉద్యాన పంటలు దెబ్బతినడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. గతంలో అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోతే, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు స్వయంగా వెళ్లి రైతులను పరామర్శించి భరోసా కల్పించారు. అక్కడికక్కడే ఎకరాకు రూ. 10 వేల నష్టపరిహారం ప్రకటించి అమలు చేశారు. రెండు, మూడు రోజులుగా అకాల వర్షాలు కురుస్తున్నప్పటికీ, ప్రభుత్వం కనీసం స్పందించడం లేదు. రాజకీయాలు తప్ప, రైతు ప్రయోజనాలు పట్టని కాంగ్రెస్.. ఇప్పటికైనా మేల్కొని అన్నదాతకు అండగా నిలవాలి. జరిగిన పంట నష్టాన్ని తక్షణమే అచనా వేయడంతో పాటు, ఎకరాకు రూ. 10 వేల నష్ట పరిహారం చెల్లించాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం.' అని హరీశ్ రావు ట్వీట్ చేశారు.

# సివిల్స్ ప్రిలిమినరీ వాయిదా..

నిర్వహించే యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష, ఫారెస్ట్ సర్వీస్ స్క్రీనింగ్ పరీక్షలు వాయిదా పడ్డాయి.గతంలో వేర్వేరుగా ప్రకటించిన రెండు నోటిఫికేషన్ల ప్రకారం.. ప్రిలిమినరీ పరీక్ష మే 26న జరగాల్సిఉంది. అయితే, లోకసభ ఎన్నికల కారణంగా ఈ పరీక్షల్ని రీషెడ్యూల్ చేస్తూ యూపీఎస్సీ నిర్ణయం తీసుకుంది. అలాగే, ఈ రెండు పరీక్షలను జూన్ 16న ఈ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించినట్లు యూపీఎస్సీ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది.సివిల్ సర్వీసెస్‌లో 1,056 ఉద్యోగాలు; ఫారెస్ట్ సర్వీసుల్లో 150 పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 14న యూపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. దరఖాస్తుల గడువు మార్చి 6తో ముగిసింది. యూపీఎస్సీ మెయిన్స్ అక్టోబర్ 19న నిర్వహించనున్నారు. డిగ్రీ ఉత్తీర్ణులైన లక్షల మంది అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నారు.

# రామ్‌దేవ్‌బాబాకు సుప్రీం సమన్లు

ఇవ్వకపోవడంతో ఈ సమన్లు ఇచ్చింది.ఆధునిక వైద్యవిధానాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ పతంజలి ఆయుర్వేద సంస్థపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం గతేడాది నవంబర్‌లో ఆ సంస్థను మందలించింది. తమ ఉత్పత్తులు వివిధ రకాల వ్యాధులను నయం చేస్తాయంటూ 'అసత్య', 'తప్పుదోవ' పట్టించే ప్రకటనలు ఇవ్వొద్దని సూచించింది. లేదంటే కోర్టు తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఇకపై ఎలాంటి ఉల్లంఘనలూ జరగవంటూ అప్పట్లో సంస్థ తరఫున న్యాయవాది కోర్టుకు వెల్లడించారు.అయితే, ఆ ఆ హామీని ఉల్లంఘించడంపై గత నెల కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వారిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో తెలపాలంటూ రామ్‌దేవ్ బాబాకు, ఆచార్య బాలకృష్ణకు నోటీసులు జారీ చేసింది. ప్రకటనల విషయంలోనూ కొన్ని సూచనలు చేసింది. ఇతర వైద్య విధానాలపై ప్రభావం చూపేలా ప్రింట్ లేదా ఎలక్ట్రానిక్ మాధ్యమాల్లో ఎలాంటి ప్రచారం చేయొద్దని మరోసారి సూచించింది. అయితే, ఆ నోటీసులకు పతంజలి సమాధానం ఇవ్వడంలో విఫలమైంది. 'మీ ప్రతిస్పందన ఎందుకు దాఖలు చేయలేదు..?' అని జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ అమనుల్లాతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. తదుపరి విచారణ సమయంలో వారిద్దరు కోర్టు ఎదుట హాజరుకావాలని ఆదేశించింది.



# 2026 నాటికి దేశంలో తొలి బుల్లెట్ రైలు

### కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**అహ్మదాబాద్-ముంబయి మధ్య 2026 నాటికి దేశంలోనే తొలి బుల్లెట్ రైలు సర్వీసును ప్రారంభిస్తామని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. రైజింగ్ భారత్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన ఈ మేరకు ప్రకటన చేశారు. భారతదేశపు మొదటి బుల్లెట్ రైలు 2026లో సిద్ధంగా ఉంటుందని కేంద్ర మంత్రి తెలిపారు. అహ్మదాబాద్-ముంబయి హైస్పీడ్ రైలు ప్రాజెక్టు నిర్మాణం పొడవు 508 కిలోమీటర్లుగా ఉంది. 2028లో పూర్తిస్థాయి విస్తరణ పూర్తవుతుందని ఆయన అన్నారు. తద్వారా ఈ ప్రాజెక్టు మార్గంలోని పట్టణాలు, నగరాల రూపురేఖలు మారిపోతాయని చెప్పారు. జపాన్ కు చెందిన షింకన్‌సెన్ టెక్నాలజీ సహాయంతో రూ. 1.10 లక్షల కోట్ల అంచనా వ్యయంతో బుల్లెట్ రైలు ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. 2026 నాటికి సేవలు ప్రారంభమవుతాయని కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పారు. థానే నుంచి ముంబయి చేరుకోవడానికి ఈ మార్గం సముద్ర సొరంగం గుండా సాగుతుంది. ఈ మేరకు సముద్ర సొరంగం పనులు ప్రారంభమయ్యాయి. ముంబయి, అహ్మదాబాద్ మధ్య మొదటి హై-స్పీడ్ రైలు కారిడార్ 320 కిమీ వేగంతో బు÷-లలెట్ రైళ్లను నడుపుతుందని కేంద్రం 2017లోనే ప్రకటించింది. రైల్వేల ద్వారా అధునాతన ప్రణాళికకు అన్ని స్థాయిల్లో కృషి, కమ్యూనికేషన్ అవసరమని రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్ స్పష్టం చేశారు.

# ఉపరితల ద్రోణి ప్రభావం



తెలిపారు. ద్రోణిదక్షిణ తమిళనాడు నుంచి అంతర్గత కర్ణాటక మీదుగా పశ్చిమ విదర్భ, దాని పరిసర ప్రాంతాలలో కేంద్రీకృతమైన ఉపరితల ఆవర్తనం వరకు సముద్ర మట్టానికి 0.9 కిలో మీటర్ల ఎత్తులో కొనసాగుతుందని తెలిపారు. దీని ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు అక్కడ అక్కడ ఎల్లుండి కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో కొన్ని జిల్లాలలో ఉరుములు, మెరుపులు, వడగళ్ళతో పాటు గంటకు 30 నుండి 40 కి. మీ వేగంతో వీచే ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు, ఎల్లుండి ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుండి 40 కి. మీ వేగంతో వీచే ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు అక్కడ అక్కడ కురిసే అవకాశం ఉంది. 19న తెలంగాణలోని నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లోని ఏకాంత ప్రదేశాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్లవాన పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. హైదరాబాద్ లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంది. నగరంలో తేలికపాటి చినుకులు కురిసే అవకాశం ఉంది. ఉదయం వేళల్లో పొగమంచు పరిస్థితులు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు వరుసగా 35 డిగ్రీలు, 23 డిగ్రీలుగా ఉండే అవకాశం ఉంది. ఉపరితల గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయ దిశగా ఉండే అవకాశం ఉంది. నిన్న గరిష్ఠ ఉష్ణోగ్రత 33.6 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 24.3 డిగ్రీలుగా నమోదైంది. 71 శాతంగా గాలిలో తేమ శాతం నమోదైంది. ఉపరితల గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయ దిశగా ఉండే అవకాశం ఉంది. నిన్న గరిష్ఠ ఉష్ణోగ్రత 33.6 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 24.3 డిగ్రీలుగా నమోదైంది. 71 శాతంగా గాలిలో తేమ శాతం నమోదైంది. జార్ఖండ్ నుంచి ఒడిశా మీదుగా ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ వరకు సగటు సముద్ర మట్టానికి సగటున 0.9 కిలో మీటర్ల ఎత్తులో ద్రోణి వ్యాపించి ఉందని తెలిపారు. ఈ ప్రభావంతో దక్షిణ కోస్తా ఆంధ్రలో వాతావరణం పొడిగానే ఉంటుందని అమరావతి వాతావరణ అధికారులు తెలిపారు. ఉత్తర కోస్తాంధ్రలో తేలికపాటి వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశం ఉందని తెలిపారు. రాయలసీమలో ఎక్కువగా వాతావరణం పొడిగా ఉంటుందని చెప్పారు. వేడి, తేమ, అసౌకర్యమైన వాతావరణం ఒకటి లేదా రెండు చోట్ల ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు.

# అమ్మను కలిసేందుకు అనుమతించండి

న్యాయస్థానం అంగీకారం తెలిపింది. తల్లి శోభ, కుమారులు ఆదిత్య, ఆర్య.. సోదరీమణులు అఖిల, సౌమ్య, వినుత.. సోదరుడు ప్రశాంత్ రెడ్డిలను కలుసుకునేందుకు న్యాయస్థానాన్ని కవిత అనుమతి కోరారు. ఈ క్రమంలో తల్లీ, కుమారులు, కుటుంబ సభ్యులను కలిసేందుకు కవితను న్యాయస్థానం అనువతించింది.అయితే.. ఈడీ కస్టడీకి అనుమతించిన శనివారం రోజు భర్త అనిల్, సోదరుడు కేటీఆర్, బావ హరీష్ రావు, కజిన్ బ్రదర్స్ పి శ్రీధర్, ప్రణీత్ కుమార్, పీఏ శరత్ చంద్రలను కలుసుకునేందుకు కోర్టు అంగీకరించిన విషయం తెలిసిందే. కస్టడీలో ఉన్న ఏడు రోజుల్లో ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల మధ్య బంధువులను కలుసుకునేందుకు కవితకు న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే ఎక్కువ మందిని కలవడం వల్ల దర్యాప్తుకు ఆటంకం కలుగుతుందని ఈరోజు కవిత తాజా పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది. దీంతో ముందుగా అనుమతించిన వారిలో కేటీఆర్ పేరుతో పాటు తల్లి, కుమారులు, సోదరీమణులు అఖిల, సౌమ్య, వినుత, సోదరుడు ప్రశాంత్ రెడ్డి కలిసేందుకు అనుమతించాలని కవిత తరపు న్యాయవాదులు తెలిపారు. దీంతో ఆ మేరకు న్యాయస్థానం అంగీకారం



తెలిపింది. ఢిల్లీ మద్యం కేసులో తనను అక్రమంగా అరెస్టు చేశారంటూ కవిత సోమవారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సర్వోన్నత న్యాయస్థానంలో కేసు విచారణ జరుగుతుండగానే అరెస్ట్ చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. గతంలో విచారణ సందర్భంగా సమన్లు జారీ చేయబోమని కోర్టుకు ఈడీ తరఫు న్యాయవాది చెప్పారని గుర్తు చేశారు. కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు భావించి, ఈడీపై తగిన చర్యలు తీసుకోవాలని కవిత తరఫున న్యాయవాది ఆన్‌లైన్ పిటిషన్ దాఖలు చేశారు.

### సుప్రీంలో కేసు ఉపసంహరించుకున్న కవిత

ఈడీ కేసులో మహిళలను విచారించేందుకు మార్గదర్శకాలను జారీ చేయాలని, అంత వరకూ ఢిల్లీ లిక్కర్ కేసులో తనను అరెస్ట్ చేయవద్దంటూ దాఖలైన పిటిషన్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తరపు న్యాయవాది ఉపసంహరించుకున్నారు. పిటిషన్ ఉపసంహరణకు జస్టిస్ బేలా ఎం త్రివేది ధర్మాసనం అనుమతి ఇచ్చింది. ఢిల్లీ లిక్కర్ కేసులో కవితను అరెస్ట్ చేసినందున గతంలో ఆమె దాఖలు చేసిన పిటిషన్ నిరర్ధకం అయినట్లు ఆమె తరుపు న్యాయవాది విక్రమ్ చౌదరి పేర్కొన్నారు. కవిత పిటిషన్ ఉపసంహరణకు ఈడీ తరపు న్యాయవాది ఎస్వీ రాజు అభ్యంతరం తెలపలేదు. కాగా.. తన అరెస్ట్ అక్రమమంటూ దాఖలు చేసిన ఎమ్మెల్సీ కవిత పిటిషన్‌పై సుప్రీంకోర్టులో నేడు విచారణ జరిగింది. కవిత తరపున వాదించాల్సిన సీనియర్ కౌన్సిల్ కపిల్ సిబల్ వేరే కోర్టులో బిజీగా ఉన్నందున 11 గంటలకు విచారణను ధర్మాసనం వాయిదా వేసింది. ఈ క్రమంలోనే తన అరెస్ట్‌పై కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై 11 గంటలకు సుప్రీంకోర్టులో విచారణ జరగాల్సి ఉంది.

# ఖైదీల ఆగడాలు ఇక సాగవ్..

### తిహాడ్ జైలులో 15 కొత్త మొబైల్ జామర్లు!

**ఢిల్లీ(జనంసాక్షి):**ఆసియాలోనే అతిపెద్దదైన తిహాడ్ జైలులో ఖైదీల ఆగడాలకు అడ్డుకట్ట వేసేలా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఖైదీలు జైలు లోపల ఫోన్ల వినియోగాన్ని నిరోధించేందుకు ఆరు చోట్ల 15 జామర్లను పెడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.ఫోన్‌లు, బేస్ టవర్ల మధ్య సిగ్నల్ ప్రసారాలు నిలిపివేసే ఈ జామర్లను రూ.11.5 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల జైలు లోపల ఇకపై 2జీ, 3జీ, 4జీ నెట్‌వర్కులు పనిచేయవు. ఇప్పటికే కాల్ బ్లాకింగ్ కోసం టవర్స్ ఆఫ్ హార్మోనియస్ కాల్ బ్లాకింగ్ వ్యవస్థ ఉండగా.. దీనికి ఈ 15 జామర్లు అదనమని పేర్కొన్నారు. ఈ జామర్ల ఏర్పాటు రెండు నెలల క్రితమే ప్రారంభం కాగా.. ఈ నెలఖరుకు పనులు పూర్తికానున్నాయని తెలిపారు. ఈ వివరాలను తిహాడ్ జైలు డీజీ సంజయ్ బానీవాల్ ధ్రువీకరించారు.తిహాడ్ జైలులోని తొమ్మిది జైళ్లలో హైసెక్యూరిటీ ఉండే ఆరు జైళ్లలో ఈ జామర్లను ఏర్పాటు చేస్తున్నట్లు మరో అధికారి తెలిపారు. ఢిల్లీలో ప్రస్తుతం 19వేల మంది ఖైదీలు ఉండగా.. తిహాడ్, మండోలి, రోహిణి.. ఈ మూడు జైళ్లలో 10వేల మంది ఖైదీల సామర్థ్యంతో ఉన్నాయి. తిహాడ్‌లో ఎంట్రీ పాయింట్ల వద్ద అనేక స్థాయిల్లో తనిఖీలు చేసినప్పటికీ ఖైదీలు తరచూ ఫోన్లను ఉపయోగిస్తున్నారు. అంతేకాకుండా జైలు గోడల వెలుపల నుంచి మొబైల్‌ఫోన్లు తరచూ విసిరేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. గత కొన్నేళ్లలో జైలు లోపల ఉన్న గ్యాంగ్‌స్టర్లు వీడియో కాల్స్ చేయడం, వారి సెల్‌ఫోన్లో వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో పాటు బయటి వారికి బెదిరింపు కాల్స్ చేయడం వంటి ఘటనలు వెలుగు చూశాయి. ఈ నేపథ్యంలో ఖైదీల ఆగడాలు ఇకపై సాగకుండా మొబైల్ సిగ్నల్స్‌ను నియంత్రించేలా జామర్లను ఏర్పాటు చేస్తున్నారు.

# ఖమ్మంలో రాజకీయ నిస్తేజం!

- అసెంబ్లీ ఎన్నికల తర్వాత జిల్లాలో నాయకుల నైరాశ్యం
- పార్లమెంటు ఎన్నికల ముంగిట నేతలు, కార్యకర్తల్లో కనిపించని ఉత్సాహం
- అటు కాంగ్రెస్, ఇటు బీజేపీలో ఇంకా తేల్చని అభ్యర్థిత్వం

**అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఉరకలేసిన ఉత్సాహం నీరుగారిపోయింది. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్నాయన్న ఉత్సాహం కూడా లేకుండా పోయింది. రాజకీయ పార్టీల తీరుతో నేతలు, కార్యకర్తల్లో అంతులేని నైరాశ్యం అలుముకుంది. బీఆర్ఎస్ పార్టీ మినహా అధికార కాంగ్రెస్‌తో పాటు కేంద్రంలో అధికారం వెలగబెడుతున్న బిజెపి సైతం అభ్యర్థులను ప్రకటించక పోవడంతో నేతల్లో నిరాశ, నిస్పృహలు అలముకున్నాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకటితమై కోడ్ అమల్లోకి వచ్చినప్పటికీ ఖమ్మం జిల్లాలో రాజకీయ పార్టీలు ఎన్నికల దిశగా కసరత్తు చేస్తున్నట్లు కనిపించడం లేదు. దీంతో అందరిలోనూ నైరాశ్యం అలుముకుంది.**


**– ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి, మార్చి 19 (జనంసాక్షి) :**

అసెంబ్లీ ఎన్నికలు ముగిసి మూడు నెలలు దాటిపోయింది. ఆ ఎన్నికల్లో జిల్లాలో సత్తా చాటిన కాంగ్రెస్ శ్రేణులు పార్లమెంటు ఎన్నికల ముంగిట చతికలపడ్డాయి. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో పదికి 9 స్థానాలను గెలుచుకున్న కాంగ్రెస్ పార్టీలో ఎంపీ ఎన్నికల ముంగిట ఆ కథనోత్సాహం కనిపించడం లేదు. దీనికి పార్లమెంటు స్థానంలో పోటీ చేసే అభ్యర్థులను ఖరారు చేయకపోవడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. అధికార కాంగ్రెస్ పార్టీలో విపరీతమైన పోటీ నెలకొన్న విషయం తెలిసిందే. రాష్ట్ర క్యాబినెట్లో ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు ఉద్దండలు సైతం తమ కుటుంబ సభ్యులకు ఎంపీ టిక్కెట్ ఇప్పించుకునేందుకు సర్వశక్తుల పోరాడుతున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన సతీమణి నందినిని పోటీలో నిలపాలని తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. అలాగే రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రిగా ఉన్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సైతం తన సోదరుడు ప్రసాద్ రెడ్డికి టికెట్ ఇప్పించుకునే ప్రయత్నంలో వెనకాడడం లేదు. అలాగే వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ ను పోటీలో నిలపాలనే ఉత్సుకతతో ఉన్నారు. వీరితో పాటు రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేతలు వి హనుమంతరావు కుసుమ కుమార్ సైతం ఖమ్మం ఎంపీ బరిలో నిలిచేందుకు పోటీ పడుతున్నారు. కేంద్ర మాజీ మంత్రి, ఖమ్మం మాజీ ఎంపీ రేణుక చౌదరికి రాజ్యసభ దక్కడంతో ఆమె పోటీ నుంచి తప్పుకున్నట్లయింది.

**ఎటూ తేల్చని అధిష్టానం..**

ఖమ్మం జిల్లాలో ఘన విజయం సాధించి రాష్ట్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్య వహిస్తున్న ముగ్గురు మంత్రులు పోటీ పడుతుండడంతో అధిష్టానానికి ఈ వ్యవహారం తలనొప్పిగా మారింది. ఎవరికి వారు తీవ్రమైన ప్రయత్నాలు చేస్తూనే అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటామని ప్రకటనలు చేయడం విస్మయం కలిగిస్తోంది. ఇలాంటి పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ పెద్దలు ఢిల్లీలో కసరత్తు మొదలుపెట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ఢిల్లీ వెళ్లి అక్కడి పెద్దలతో సంప్రదింపులు జరుపుతూ టికెట్ల కేటాయింపు పై స్పష్టత కోసం ప్రయత్నిస్తున్నారు. తొలి దశలో ప్రకటించిన స్థానాల్లో ఖమ్మం నుండి ఎవరిని అభ్యర్థిగా దింపుతారనే అంశంపై స్పష్టత రాలేదు. మరో విడతగా అధిష్టానం ప్రకటించనున్న జాబితాలోనూఖమ్మం అభ్యర్థి పేరు ఖరారు అవుతుందని గ్యారెంటీ లేకుండా పోయింది. దీంతో కాంగ్రెస్ శ్రేణుల్లో వల్లమాలిన నైరాశ్యం అలముకుంది.



**బీజెపిలోను తీవ్రమవుతున్న పోటీ**

ఖమ్మం జిల్లాలో కనీస ఉనికి కూడా లేని బిజెపి పార్టీలో సైతం ఖమ్మం ఎంపీ టికెట్ పై పోటా పోటీ ప్రయత్నాలు సాగుతున్నాయి. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన జలగం వెంకట్రావు ఖమ్మం ఎంపీ టికెట్ ఆశించే బిజెపి తీర్థం పుచ్చుకున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఈయనకు పార్టీలోని సీనియర్ నాయకుడు పొంగులేటి సుధాకర్ రెడ్డి వెన్నుదన్నుగా నిలుస్తున్నారని చర్చ సాగుతోంది. అలాగే ఖమ్మం బీజేపీ టికెట్ కోసం సుమారు పది మంది ఆశావహులు రేసులో ఉండటం గమనార్హం. అయితే మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు పార్టీలో చేరాక దాదాపు అందరూ ఆశలు వదిలేసుకున్నారు. తీరా హైకమాండ్ ఆయన పేరును ప్రకటించకపోవడంతో ఆశావహులంతా మళ్లీ ప్రయత్నాలు మొదలుపెట్టారు. హైదరాబాద్ కేంద్రంగా కులాల వారీగా తమ గాడ్ ఫాదర్లను ప్రసన్నం చేసుకోవడం, ఆయా నాయకులు కూడా హామీ ఇస్తుండడం ఆసక్తి రేపుతోంది. ఖమ్మం టికెట్ ఆశిస్తున్న వారిలో ఖమ్మం జిల్లా బీజేపీ అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్, ఖమ్మం నగరానికి చెందిన డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, వెలమ సామాజికవర్గానికి చెందిన తాండ్ర వినోద్ రావుకు, బీజేపీ సీనియర్ నేత, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈవీ రమేశ్ పోటీ పడుతున్నారు. అసలే పెద్దగా ప్రాబల్యం లేని బీజేపీలో కూడా టిక్కెట్ పోరు సాగుతుండటంతో అభ్యర్థిత్వంపై సందిగ్ధత నెలకొంది. ఎటూ తేల్చని ఈ వ్యవహారంతో జిల్లాలో రాజకీయ నైరాశ్యం అలుముకుంది. కాగా బీఆర్ఎస్ మాత్రం సిట్టింగ్ ఎంపీ నామ నాగేశ్వరరావునే బరిలో దించుతున్నట్లు ఇప్పటికే ప్రకటించింది.

# దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం

- రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లు గెలుచుకుంటాం
- వంద రోజుల రాష్ట్ర ప్రభుత్వ పాలనకు ప్రజల నీరాజనం
- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ.చిన్నారెడ్డి



**హైదరాబాద్, మార్చి 19 (జనంసాక్షి) :** దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం వీస్తోందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. మంగళవారం గాంధీ భవన్ లో రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మజ్లిస్ పార్టీ అభ్యర్థిగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి శాసన సభకుకు పోటీ చేసిన గౌంటి విక్రమ్ యాదవ్ ఆధ్వర్యంలో మజ్లిస్ పార్టీ నాయకులు, బీ ఆర్ ఎస్ నాయకులు పెద్ద ఎత్తున చిన్నారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ లోకి చిన్నారెడ్డి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి తిరుగు లేదని కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ న్యాయ్ జోడో యాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని ఆయన అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 14 ఎంపీ సీట్లు గెలుచుకోవడం ఖాయమని చిన్నారెడ్డి వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ముందుకు దూసుకుని పోతోందని చిన్నారెడ్డి తెలిపారు. వంద రోజుల రాష్ట్ర ప్రభుత్వ పాలనకు ప్రజలు నీరాజనం పలుకుతున్నారని చిన్నారెడ్డి పేర్కొన్నారు. రానున్న పదేళ్ల పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు కృషి చేసి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలు పించు కోవాలని చిన్నారెడ్డి పిలునిచ్చారు. గాంధీ భవన్ లో మజ్లిస్ పార్టీ నాయకులు విక్రమ్ యాదవ్ తో పాటు ఎం. శ్రీశైలం యాదవ్, బైకని శ్రీశైలం యాదవ్, గౌంటి రాహుల్ యాదవ్, సాల్మాన్ రాజ్, ప్రేమ్, పద్మారావు, ప్రసాద్, జగన్నాథం, వినయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విక్రమ్ యాదవ్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కృషి చేస్తామని తెలిపారు.

# ప్రజావాణికి తాత్కాలిక బ్రేక్

- ఎన్నికల ఫలితాల తరవాత తిరిగి ప్రారంభం

**హైదరాబాద్, మార్చి 19 (జనంసాక్షి) :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తరువాత తీసుకున్న నిర్ణయాలలో ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా నిలిపివేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్ లోని ప్రజాభవన్ లో ప్రజావాణి కార్యక్రమానికి డిసెంబర్ శ్రీకారం చుట్టారు. అయితే ప్రజావాణి కార్యక్రమాన్ని కొన్ని రోజులపాటు నిలిపివేశారు. దేశ వ్యాప్తంగా ఎన్నికల కోడ్ కారణంగా ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారులు వెల్లడించారు. మే 13న రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలతో పాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరగనున్నాది. జూన్ 4న ఓట్లు లెక్కించి, ఫలితాలు ప్రకటించనున్నారు. ఈసీ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జూన్ 6న ఎన్నికల పక్రియ అధికారికంగా ముగుస్తుంది. దాంతో జూన్ 7 నుంచి తిరిగి ప్రజావాణి కార్యక్రమం యథాతథంగా కొనసాగించనున్నట్లు నోడల్ అధికారి వెల్లడించారు. తమ సమస్యలు చెప్పుకునేందుకు ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చేవారు. ఈ కార్యక్రమంలో ఎక్కువగా భూముల సంబంధిత సమ్యలు, ధరణి, ఆరోగ్యం,నిరుద్యోగం అంశాలపైనే ప్రజలు ప్రభుత్వానికి ఎక్కువ వినతిపత్రాలు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. వారానికి రెండు రోజులు రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తోంది. మంగళవారం, శుక్రవారాల్లో కచ్చితంగా ప్రజావాణి నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలోనే నిర్ణయించారు. ఆ రెండు రోజుల్లో జ్యోతిరావ్ పూలే ప్రజాభవన్‌కు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి తమ సమస్యలు చెప్పుకునేవారు.

# దమ్ముంటే లోకల్ అభ్యర్థిని నిలబెట్టాలి

- సిఎం రేవంత్‌కు ఈటల సవాల్



**హైదరాబాద్, మార్చి 19 (జనంసాక్షి) :** సిఎం రేవంత్ రెడ్డికి నిజంగా దమ్ముంటే మల్కాజిగిరి ప్రాంతం వాడినే ఎంపీ అభ్యర్థిగా నిలబెట్టాలని, బయటివాడిని నిలబెడితే నీ సంగతి చెప్తా అని బిజెపి ఎంపి అభ్యర్థి ఈటల రాజేందర్ హెచ్చరించారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. మల్కాజ్‌గిరితో ఈటలకు ఏం సంబంధం అని రేవంత్ అంటుండు. మరి నీకేం సంబంధం రేవంత్. ఒక ఛాలెంజ్ వేస్తున్నా.. నీకు దమ్ముంటే ఈ ప్రాంతం వాడిని మల్కాజ్‌గిరిలో పోటీ చేయించు. ఈ ప్రాంతంతో సంబంధం ఏంటని అంటున్నావు కదా.. నీకు నిజంగా దమ్ముంటే ఈ ప్రాంతం నుంచి ఒక ఎంపీ అభ్యర్థిని నిలబెట్టు. బయటి వ్యక్తిని నిలబెడితే నీ సంగతి చెప్తాం. రేవంత్‌కు దమ్ము లేదు. అభ్యర్థి కోసం వెతుకుతుండు. రూ. 200 కోట్లు ఖర్చు పెట్టేటోడు కావాలట. ఈటల రాజేందర్‌ను తట్టుకోవాలంటే రూ. 400 కోట్లు ఖర్చు పెట్టేతోడు కావాలి అని ఈటల పేర్కొన్నారు.

# లక్ష్మీ నృసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

- జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ దివాకర్



ధర్మపురి, మార్చ్ 19,(జనం సాక్షి) శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి ధర్మపురి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి అధికార యంత్రాంగం కేటాయించిన విధులను సమన్వయంతో నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర అన్నారు. మంగళవారం ఐడిఓసిలోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి అధికారులు విధులు నిర్వహించాలని అన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. ముఖ్యంగా స్వామివారి కళ్యాణోత్సవం, రథోత్సవం, డోలోత్సవం కార్యక్రమాలు జరిగే రోజులలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొననున్నారని, భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడానికి అధికార యంత్రాంగాన్ని నియమిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖులు, ముఖ్యులు దర్శనానికి వచ్చే సమయంలో ప్రోటోకాల్ పాటిస్తూ ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి విధులు నిర్వహించాలని సూచించారు. ముఖ్య దేవాలయం, శివాలయంలలోకి వెళ్ళే భక్తులను క్యూలైన్ నిర్వహణకు అవసరమైన పోలీస్, వాలంటీర్లను నియమించడం జరుగుతుందని, వాహనాల పార్కింగ్‌నకు బ్రాహ్మణ సంఘం, హరిత హెూటల్ ప్రక్కన గల ప్రాంతాలలో పార్కింగ్ చేయవలసి ఉంటుందని తెలిపారు. ఎమర్జెన్సీ పార్కింగ్ కు జూనియర్ కళాశాల, నక్కల పేటలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేవాలయం, మంగళ్ గడ్డ, కమ్యూనిటి హెల్త్ సెంటర్, నిఫ్ కాలేజి, బస్టాండ్ ప్రాంతాలలో మెడికల్ క్యాంపు లను నిరంతరంగా ఏర్పాటు చేయాలని అన్నారు. అవసరమైన కొన్ని ప్రాంతాలలో చలి వెంద్రాలు ఏర్పాటు చేయాలని, తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా అన్ని ప్రాంతాలలో త్రాగునీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. తెప్పోత్సవం, డోలోత్సవం జరిగే కోనేరు ప్రాంతంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా బారికేడింగ్ చేపట్టాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని అన్నారు. అన్నదాన కార్యక్రమాలు జరిగే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలని, క్యూ లైన్ మెయింటేన్ చేయాలని అన్నారు. ఆపదలో ఆదుకునేందుకు, విద్యుత్ షాట్ సర్క్యూట్ ను అదుపు చేయడానికి అగ్నిమాపక వాహనాలను సిద్దంగా ఉంచాలని అన్నారు. జాతర సమయాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా నిరంతర విద్యుత్ సరఫరా అయ్యే విధంగా ఏర్పాట్లు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. పట్టణంలో శానిటేషన్ కార్యక్రమాలను, మున్సిపల్, పంచాయతీ అధికారుల నేతృత్వంలో నిర్వహించాలని అన్నారు. ఆయా విధుల నిర్వహణకు నియమించిన అధికారులకు అవసరమైన కింది స్థాయి ఉద్యోగులను కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో డిఎస్పి రఘు చందర్, జగిత్యాల ఆర్డిఒ మధు సుధన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, దేవాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గోడకూలి బాలుడు మృతి

**జగిత్యాల, మార్చి 19 (జనంసాక్షి) :** జగిత్యాల జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. గోడకూలి నాలుగేళ్ల బాలుడు మృతి చెందాడు. అ విషాదకర సంఘటన మేడిపల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..మేడిపల్లిలోని పౌల్టీ ఫాం నిర్మాణ పనులు జరుగుతుండగా కాంక్రిట్ మిక్సర్ వాహనం ఢీకొనడంతో గోడ కూలిపోయింది. అయితే గోడకు అవతలి వైపు ఆడుకుంటున్న బాలుడిపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బాలుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మోడీవన్నీ చిల్లర రాజకీయాలు

- గల్లీ లీడర్‌లా వ్యవహరిస్తున్నారు
- కవితపై ఆరోపణలను ఖండించిన గొంగిడి సునీత

**హైదరాబాద్, మార్చి 19 (జనంసాక్షి) :** ప్రధాని దేశ నాయకుడిగా కాకుండా గల్లీ నేతగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ నేత గొంగిడి సునీత అన్నారు. ఎలాంటి సాక్షాధారాలు లేకుండా ఎమమెల్సీ కవితపై నింద వేయడం సరికాదని సూచించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం గొంగిడి సునీత మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీపై విరుచుకుపడ్డారు. దేశాన్ని దోచుకున్నోళ్లకు చేయూత నిచ్చిందే మోదీ అని గొంగిడి సునీత అన్నారు. రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూల్చడం మోదీకి అలవాటు అని విమర్శించారు. వందల ప్రాణాలను బలి తీసుకున్న మోదీకి కవితను జైలుకు పంపించడం చిన్న విషయమని అన్నారు. వ్యతిరేకించిన వారిని ఇబ్బంది పెట్టడమే మోదీ నైజమని ఆరోపించారు. బీజేపీలో చేరిన వారు పవిత్రులైపోతున్నారని అన్నారు. ప్రాంతీయ పార్టీలను కబలించే కుట్ర జరుగుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ వచ్చే ముందు ఈడీ, సీబీఐ వస్తాయని విమర్శించారు. మోదీ పాలన దేశం భ్రష్టు పట్టిందని అన్నారు.

# రిజర్వాయర్లలో సరిపడా నీటినిల్వలు

- తాగునీటికి ధోకా లేకుండా చర్యలు
- అవసరమైన చోట్ల మరమ్మత్తులు చేపట్టాలి
- అధికారులను ఆదేశించిన సిఎస్ శాంతికుమారి
- పకడ్బందీగా పది పరీక్షల నిర్వహణకు సూచనలు



**హైదరాబాద్, మార్చి 19 (జనంసాక్షి) :** రాష్ట్రంలోని రిజర్వాయర్లలో సరిపడా నీరు ఉన్నందున ప్రస్తుత వేసవి కాలంలో తాగునీటి అవసరాలకు ఏవిధమైన ఇబ్బందులు లేవని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి స్పష్టం చేశారు. రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితులపై సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిషోర్, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, పంచాయతీ రాజ్ కమిషనర్ అనితా రామచంద్రన్, జీ.హెచ్.ఎం.సి కమిషనర్ రోనాల్డ్ రోస్, మున్సిపల్ శాఖ డైరెక్టర్ దివ్య, మిషన్ భగీరథ ఈ.ఎన్.సి. కృపాకర్ రెడ్డి తదితర అధికారులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, యుద్ధప్రాతిపదికన మరమత్తులు చేపట్టి తాగునీటి సరఫరాను నిర్విరామంగా కొనసాగించాలని ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్ లోనూ సరిపడా నీటిని అందిస్తున్నామని, ఎవరైనా అదనపు వాటర్ ట్యాంకులు కోరితే వాటిని కూడా అందిస్తున్నామని స్పష్టం చేశారు. మంచినీటి సరఫరా విషయంలో ఏవిధమైన ఆందోళనలు అవసరం లేదని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లలో నీటి లభ్యత, వేసవి కాలంలో తాగునీటి సరఫరాకు తీసుకున్నచర్యలపై సంబంధిత శాఖల కార్యదర్శులతో సమీక్షించారు. ఇటీవల ముగిసిన ఇంటర్ పరీక్షల స్ఫూర్తితో ప్రస్తుతం జరుగుతున్న పదవ తరగతి పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలని సి.ఎస్. తెలిపారు పదవ తరగతి పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. డీజీపీ రవీ గుప్తా, విద్య శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, విద్య శాఖ కమిషనర్ దేవసేనలు ఈ టెలికాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, ఎస్.ఎస్.సి పరీక్షలు మొదలై రెండు రోజులు అయ్యాయని, మిగిలిన పరీక్షలను కూడా ఏ విధమైన ఇబ్బందులు కలుగ కుండా నిర్వహించాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు ఎట్టి పరిస్థితుల్లో ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు అనుమతించేది లేదని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడం తోపాటు ప్రతీ కేంద్రం వద్ద కనీసం ఒక కానిస్టేబుల్ లేదా హోమ్-గార్డును నియమించినట్టు తెలిపారు. పరీక్ష పేపర్లను తేవడం తిరిగి పోస్టాపీసీలు తీసుకెళ్లేటప్పుడు తగు బందోబస్తు ఉండాలని పేర్కొన్నారు. ఈవిషయంలో విద్యా శాఖ, పోలీస్ అధికారులు తగు సమన్వయంతో పని చేయాలని అన్నారు. ఇటీవల ముగిసిన ఇంటర్ పరీక్షలను విజయ వంతంగా నిర్వహించడం పట్ల జిల్లా కలెక్టర్లను, అధికారులను సి.ఎస్ అభినందించారు.

# ఆర్టీసీ ఉద్యోగుల హెచ్ఆర్ఏ సవరణ

**హైదరాబాద్, మార్చి 19 (జనంసాక్షి) :** తమ ఉద్యోగుల ఇంటి అద్దె భత్యం(హెచ్ఆర్ఏ)ను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) యాజమాన్యం ఇటీవల సవరించింది. జీవో నంబర్ 53 ప్రకారం హెచ్ఆర్ఏ సవరణ చేయాలని 2020లో యాజమాన్యాన్ని ప్రభుత్వం ఆదేశించింది. అప్పుడు ఆర్టీసీ ఉద్యోగుల పే రివిజన్ చేయకపోవడంతో హెచ్ఆర్ఏ సవరణను తాత్కాలికంగా సంస్థ నిలుపుదల చేసింది. తాజాగా 2017 పే స్కేల్ ను రివిజన్ చేసి ఉద్యోగులకు 21 శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే జీవో నంబర్ 53 ప్రకారం ఉద్యోగుల హెచ్ఆర్ఏను యాజమాన్యం సవరించింది. హెచ్ఆర్ఏ సవరణపై జరుగుతున్న అసత్య ప్రచారం నేపథ్యంలో ఈ వివరణను టీఎస్ఆర్టీసీ యాజమాన్యం ఇచ్చారు.

# చట్నీస్ హోటళ్లపై ఐటీ దాడులు

**హైదరాబాద్, మార్చి 19 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లో ఐటీ దాడులు కలకలం రేపాయి. ప్రముఖ అల్పాహార ఫ్రాంచైజీ చట్నీస్ హోటల్స్‌లో ఐటీ సోదాలు జరుగుతున్నాయి. హోటళ్లతోపాటు వాటి యజమాని ఇండ్లలోనూ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. సంస్థ యజమామని అట్లూరి పద్మ.. ఆంధ్రప్రదేశ్ పీసీసీ చీఫ్ షర్మిలకు వియ్యంకురాలు కావడం గమనార్హం. ఇటీవలే షర్మిల కుమారుడు రాజారెడ్డితో అట్లూరి పద్మ కుమార్తెకు వివాహం జరిగిన విషయం తెలిసిందే. అదేవిధంగా హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న మేఘనా ఫుడ్స్ ఈటరీస్‌లోనూ ఐటీ అధికారులు సోదాలు చేస్తున్నట్లు సమాచారం. నగరంతోపాటు బెంగళూరులోనూ ఈ ఫ్రాంచైజీలు ఉన్నాయి. అయితే ఈ దాడులకు సంబంధించి హోటళ్ల యజమానులతోపాటు ఐటీ అధికారులు ఎలాంటి ప్రకటనా చేయలేదు.

# మూసీ నదిని పర్యాటక, ఆర్థిక, ఉపాధి కేంద్రంగా అభివృద్ధి చేయాలి

హైదరాబాద్ నగరం మధ్యలోంచి వెళ్ళే మూసీనది సుందరీకరణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కన్సల్టెంట్ల నుండి బిడ్లను సైతం ఆహ్వానిస్తుంది. మూసీ సుందరీకరణ నగర అభివృద్ధికి దోహదప డుతుందని సామాజిక ' ఆర్థిక వేత్తలు విశ్వసిస్తున్నారు. ఇందుకోసం మూసీ నది కారిడార్ వెంట రోడ్ కమ్ మెట్రో రైల్ నిర్మించాలని ప్రభుత్వ నిర్ణయించింది.దీని వల్ల ఈ ప్రాంత ప్రజలకు ప్రజా రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి.



మూసీ నదీ పునర్జీవనం, మూసీ నది పరీ వాహక ప్రాంత అభివృద్ధికి తాజాగాతెలంగాణ నూతన ప్రభుత్వం అడుగులు వేయడం వల్ల మూసీ నది పునరుజ్జీవన ప్రక్రియ ఊపందుకుంది. మూసీ పరిసరాలను లండన్ థీమ్స్ రివర్ ఫ్రంట్ తరహా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారు సంకల్పించడం అభినంద నీయం.మూసీనది అభివృద్ధి సహజవనరుల 'మానవ వనరుల వికాసానికి దోహదపడే చర్యగా అభివర్ణించ వచ్చు. మూసీ నది పునర్జీవన ప్రక్రియలో ప్రభుత్వ ' పెట్టుబడులను ఆకర్షిం చేందుకు ప్రభుత్వం మూసీ అభివృద్ధి పాలనానిర్వహణకు స్వతంత్ర ప్రతిపత్తితో ప్రత్యేక పాలనా విభాగాన్ని ఏర్పాటు చేయాలి.

### ఆదునిక డిజిటల్ సాంకేతికత -సుందరీకరణ

ప్రజా భాగస్వామ్యంతో మూసీ సుందరీకరణ జరగాలి. ఆదునిక డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మూసీ నది సహజత్వాన్ని రక్షించాలి. మూసీ వెంబడి ప్రకృతి పర్యావరణ రక్షణ ఉద్యాన వనాలు 'ఆహ్లాదాన్ని ఇచ్చే పార్కులు పిల్లలకు ప్రత్యేకంగా జల క్రీడలు' ఆట ప్రదేశాలు' పౌరులకు రిక్రియేషన్ కేంద్రాలు 'వాకింగ్ జాగింగ్' సైక్లింగ్' ట్రాక్స్ ' బోటింగ్ సౌకర్యం మెట్రోలో 25 కిలోమీటర్ల వరకు భూమార్గం నిర్మాణం 'ఆహ్లాదాన్ని వినోదాన్ని అందించే కేంద్రాలను 9 వేలకోట్ల రూ"ల అంచనాతో పనులు చేపట్టనుంది. మూసీ పరిసర ప్రాంతాల్లో వ్యాపార 'వాణిజ్య కేంద్రాలుఏర్పడుతాయి. ప్రత్యక్ష' పరోక్ష 'ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయి.యువత పనుల్లో నిమగ్నం కావడం వల్ల హింసాత్మక కార్యక్రమాలు తగ్గుతాయి. శాంతి యుత వాతవరణం నెలకొంటుంది. షాపింగ్ మాల్స్' హెూటల్స్ రెస్టారెంట్స్ 'వ్యాపార' వాణిజ్య కేంద్రాలు ఏర్పడతాయి. ఉద్యమిత్వ నైపుణ్యాలు మెరుగు పడతాయి. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పారిశ్రామిక అభివృద్ధికి పాటుపడం వల్ల నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయి.

### పర్యాటకం- ప్రయాణం

మూసి వెంట రహదారిని అభివృద్ధి పరచడం.మెట్రోతో పాటు నదీ గర్భంలో ఎల్లవేళలా నీరు ఉండేలా చేసి బోట్ ప్రయాణాన్ని నగరవాసులకు అందుబాటు లోకి తీసుకురావాలనే ప్రణాళికల రూపకల్పన జరగడం శుభ సూచకం. కృష్ణ' గోదావరి జలాలను జంట జలాశయాలకు తరలించి అక్కడి నుంచి మూసీ లోకి నీటిని వదిలి శుభ్రం చేస్తారు. పర్యాటక, బోటింగ్తోపాటు రవాణాను ప్రోత్సాహిస్తారు. ఒక ఒడ్డు నుంచి మరో ఒడ్డుకు బోటులో రాకపోకలు సాగించవచ్చు. మూసీ వెంబడి మూసీకి ఆనుకొని ఉన్న చారిత్రిక ప్రదేశాలను చార్మినార్' తారామతి' బారదారి మొన్నగు చారిత్రిక సాంస్కృతిక వారసత్వ ప్రదేశాలను కలుపుతూ పర్యటక వలయాన్ని రూపొందిస్తే పర్యాటకులను ఆకర్షించే అవకాశం వుంటుంది.

### మూసీ ప్రక్షాళన

అక్రమ నిర్మాణాలతో కుంచించుకు పోయి మూసీ మురుగు కాలువగా మారింది. మూసిలో పడేసే వ్యర్థాలతో అధిక శాతం విషపూరిత రసాయనాలు వుండడం వల్ల వీటిని శుద్ధి చేయడం పెద్ద సవాల్ గా పరిణమించింది. కాల కుట విషంలా మారిన మూసీ నదిని సమూలంగా ప్రక్షాళన చేయాలి. విషపూరిత పారిశ్రామిక వ్యర్థాలు కలపకుండా కఠిన చట్టాలు అమలు చేయాలి. అధునాతన "సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్స్" ఏర్పాటు చేయాలి. అభివృధి చెందిన దేశాలు వాడుతున్న పరిజ్ఞానాన్ని పరిశీలించాలి. మూసీ నది కాలుష్యంతో జల జీవాలు అంతరించి పోయాయి. పశు సంపద క్రమేపీ కనుమరు గవుతుంది .మూసి నది నీళ్లు తాగిన పశువులకు సూడి నిలువక వట్టి పోతున్నాయి. పశువులను సాకలేక పాడి రైతులు దళారులకు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. మూసీ దోమలకు నిలయంగా మారి కాలుష్యం పెరిగి ప్రజా రోగ్యం దెబ్బతింటుంది. బిల్డింగ్ నిర్మాణాల వ్యర్థ పదార్థాలను మూసీలో వదలడం వల్ల నీరు ప్రవహించకుండ అడ్డుకుంటుంది. రాజకీయాలకు అతీతంగా మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ఆక్రమణలు తొలిగించి సహజ ప్రవాహ మార్గాన్ని పునరు ద్ధరించాలి. మూసీ అభివృద్ధిలో బాగంగా మూసీ నదికి ఆనుకొని ఉన్న చారిత్రిక ప్రదేశాలను దేవాలయాలు దెబ్బతినకుండా చూడాలి. మూసీ నదిలోకి మురుగు నీరు రాకుండా ప్రత్యేక కాలువ నిర్మాణం జరగాలి. శుద్ధ జలం పారే విధంగా నిర్మాణాలు చేపట్టాలి. మూసీ ఎగువ ప్రాంతాల నుండి మంచి నీరు మూసిలోకి వచ్చేట్లు అనుసంధాన ప్రాజెక్టుపై దృష్టి పెట్టాలి. మూసీ అభివృద్ధిలో వృక్ష జాతులు 'జీవ వైవిధ్యానికి నష్టం కలుగ కుండ ప్రాజెక్టులు రూపొందించాలి.ఆరోగ్యానికి హాని కలిగించే విష రసాయ నాలు తగ్గించాలి. ప్రభుత్వం మూసీ ప్రక్షాళనకు యుద్ధ ప్రాతిపదికన నడుం బిగిస్తేనే రాబోయే తరాలకు మేలు చేసిన వారమౌతాం. మూసీ నదీ పరివాహక ప్రాంతంలో నివాసం వుండే నివాసితులు ' అసోసియేషన్స్ ను మూసీ ప్రక్షాళనలో భాగస్వాములను చేయాలి. ప్రభుత్వం సమగ్ర పట్టణ ప్రణాళికల రూపకల్పనతో మూసీనదినిహైదరాబాద్ ప్రజలకు మంచి నీటిని అందించే నదిగా తీర్చిదిద్దాలి.



**నేదునూరి కనకయ్య**
**రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణ ఎకానమిక్ ఫోరమ్**
**9440245771**

# పిచ్చుకను చూసి నేర్చుకుందాం!

పిచ్చుకలను చూసి నేర్చుకుందాం! కూత మాత్రమే కాదు, దాని బుద్ది కూడా ఘనమే!పిచ్చుక ఏం నేర్పుతుంది? మనకు చాలా,చాలా నేర్పుతుంది! మనిషి తనాన్ని నేర్పుతుంది! జీవితం అంటే ఒక పోరాటం అని దారి చూపుతుంది! జీవితాన్ని ఎలా చక్క దిద్దుకోవాలో నేర్పుతుంది! ఎస్ ఇది నేల మీది నిజం! పిచ్చుకలు ఇంటిలోకి వస్తే లక్ష్మి కటాక్షం అంటారు.రెండు పిచ్చుకలు వస్తే వివాహం లాంటి శుభకార్యం జరుగుందనే నమ్మకం ఉంటుంది.పిచ్చుక అంటేనే శుభ సూచిక అంటారు.



అన్నింటికీ మించి పిచ్చుకల కిచ కిచలు చెవులకు వినసొంపుగా ఉంటాయి.మంచి సంగీతాన్ని వింటున్న ఫీలింగ్ ఉంటుంది.పిచ్చుకలు ఒకనాడు పంట చేలల్లో, పల్లె ముంగిళ్లలో, ధాన్యపు రాశుల్లో కిలకిలమంటూ సందడి చేసేవి. నాడు గ్రామాల లోని ఇళ్ల ముంగిట ఇవి గుంపులుగా వాలడం ఏదో అలికిడి అవగానే తుర్రుమని ఎగరడం వంటి దృశ్యాలు సందడిగా చూడముచ్చటగా కనువిందు చేసేవి.ఇప్పుడు కూడ ఈ దృశ్యాలు కని పిస్తాయి.కాని అభివృద్ధి పేరిట జరుగుతున్న పల్లెలు,జీవన విధ్వంసం కారణంగా అంతా కాలుష్య మయం అయి తగ్గాయి.

ఇవి దిగుడు బావులలోకి వేలాడుతున్న చెట్లపై కట్టుకున్న గూళు చాలా అద్భుతంగా ఉండేవి. ఇవి పూరిళ్ల చూరులలో గూళ్లు కట్టుకొని జనావాసాలతో కలిసిపోయి ఉండేవి. మానవుడు పెంచుకుంటున్న సాంకేతిక పరిజ్ఞానం,అభివృద్ధి నమూనాలు,వీటి మనుగడకు శాపంగా మారాయి. సెల్ ఫోన్ తరంగాల రేడియేషన్, కాలుష్యం కారణంగా ఇవి ప్రకృతి నుంచి కనుమరుగవుతున్నాయి. జనావాసాలతో మమేకమై జీవిస్తున్న వీటి విషయాలలో ఇవి మెత్తని పీచు వంటి వాటితో గూడు కట్టడం, గుడ్లను పొదగడం, నోటితో ఆహారాన్ని తెచ్చి పిల్లలకు అందించటం, ఆ పిల్లలు రెక్కలొచ్చి ఎగిరెంత వరకు జాగ్రతగా కాపాడటం మనకు తరచూ కనిపించే , ఈ దృశ్యాలు మనం చూస్తూ ఉంటాము!తల్లి ఎవరికైనా తల్లే!ప్రేమకు,ఆప్యాయత కు ఈ దృశ్యాలు ప్రతీక గా పేర్కొనవచ్చు! మనిషిలో మానవత్వం రోజు రోజుకు లేకుండా పోతున్న నేపథ్యంలో ఈ పిచ్చుకలను చూసి నేర్చువాల్సింది చాలా ఉంది.

### బతికే విధానం నేర్పుతుంది!

ఎలా బతుకు తారో మమ్మల్ని చూసి నేర్చుకోండి,జీవించే స్టైల్ మాది ఒక సారి చూడండి! అనే విధంగా మనిషిని హెచ్చరిస్తున్నట్లు కనిపిస్తుంది!అందుకే పిట్ట బతుకు నాకు నచ్చుతుంది! పిచ్చుక లు అన్యోన్యతను,ప్రేమను నేర్పుతాయి! ఒక్కసారి వాటి గూళ్ళను,వాటి పిల్లలను చూడండి! వాటి కూత లను వినండి! ఆస్వాదించండి! మిమ్మల్ని మీరు తీర్చి దిద్దుకుంటారు! మార్చుకుంటారు! ఇదంతా పలు రీసెర్చ్ ల ద్వారా గుర్తించిన ప్రపంచ దేశాలు ప్రతి సంవత్సరం మార్చి 20 న ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి. ఈ పిచ్చుకల ప్రాధాన్యతను గుర్తించిన భారత ప్రభుత్వం తపాలా బిళ్లను కూడా విడుదల చేసింది. జనావాసాల మధ్య నివసిస్తున్న పిచ్చుకల మనుగడకు ప్రమాదం ఏర్పడితే అది మానవ మనుగడకు కూడ ఇబ్బంది గానే పరిగనించాలి.



**ఎండి.మునీర్**
**సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు**
**9951865223**

### పర్యావరణ పరిరక్షణ కోసం!

ప్రపంచ దేశాలు "ప్రపంచ పిచ్చుకల దినోత్సవము" సందర్భంగా పర్యావరణ పరి రక్షణకు పిచ్చుకలు ఎంత అవసరమో పలు సెమినార్లు పెట్టి వివరిస్తూ ఉంటాయి! మన దేశంలోని పల్లెల్లో,పట్టణాల్లో ఎక్కడ చూసినా పిచ్చుకలు,వాటి కూతలు,కిచ కిచ అంటూ వినిపిస్తూంటాయి.మా ఇంటి లోనే మేము వాటికీ ప్రత్యేకంగా పిచ్చుక గూడులు ఏర్పాటు చేసాము,మా ఇంటి ఆవరణలో పిచ్చుకల కిచ కిచలు నిరంతరం వినిపిస్తుంటాయి.నేను స్వయంగా అమెరికా లోనూ ఈ పిచ్చుక లను చూసాను,అక్కడ మందలకు,మందలే ఇవి కనిపిస్తాయి! పిచ్చుకల కోసం ఒక ప్రత్యేక దినం ఉంది,సరే కాని వీటి సంరక్షణ నిరంతరం ఒక యజ్ఞంలా సాగాలి! ఖాన్ చుడి కో బచాలెంగే! (ఉర్దూలో పిచ్చుకను ఖాన్ చుడీ అంటారు) మన కోసం,మన నేల భవిష్యత్తు పరి రక్షణ కోసం

### పిచ్చుక జీవితం చూడండి

పిచ్చుకలను రక్షించు కుందాం!పిచ్చుక నేర్పే జీవితం ను ఒక్క సారి మనుషులు స్టడీ చేయాలి! తన పిల్లల్ని గూడును నిర్మించుకుని కాపాడుకునే తీరు ను ఒక్క సారి గమనిస్తే ఎందుకు పనికి రాని క్రికెట్ చూస్తూ దినం అంతా ఇంటిలో కూర్చుని కేరింతలు కొడుతూ తమ కర్తవ్యాన్ని మరిచి పోయే కోట్ల మంది యువతకు స్వయం కృషి విలువను తెలుసుకుని, తమని తాము జాగృతం చేసుకునే అవకాశం యువత కు వస్తుంది. అందుకే క్రికెట్ చోడో దేశం దుస్థిని సరిదిద్దే అవకాశం వచ్చింది!ఆ దిశన యోచించండి! సమయం వృధా వద్దు! మందిర్, మస్జీద్ రాజకీయాలతో, హిందూ, ముస్లిం, సిక్కు, ఈసాయి అంటు విభజన రాజకీయాలు చేసే వారికి బుద్ది చెప్పే సమయం వచ్చింది! జాగో!

(నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా..)

# చిన్నారి పిట్టల పండుగ

చిన్న చిన్న పిచ్చుకలు, చెట్ల చుట్టూ తిరుగుతూ, చిలిపి ఆటలు ఆడుతూ, పొలం పైకి ఎగిరిపోతాయి. పంట గింజలు తింటూ, కలిసి కలిసి ఆడుతాయి. చిన్న గూడు కట్టుకుంటూ, చిన్నారి పిచ్చుకలు మనకు ఎన్నో నేర్పుతాయి. కష్టపడి పనిచేయటం, ప్రేమతో జీవించటం, కుటుంబాన్ని జాగ్రత్తగా చూసుకోవటం. ఇలాంటి చిన్న పిచ్చుకల నుంచి మనం నేర్చుకోవాల్సింది చాలా ఉంది. ఈ పిచ్చుకలను కాపాడుకోవాల్సిన అవసరం మనపై ఉంది.ప్రతి సంవత్సరం మార్చి 20న జరుపుకునే ప్రపంచ పిచ్చుకల దినోత్సవం చిన్నారి పిట్టల పండుగ లాంటిది.



ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం పిచ్చుకల ప్రాముఖ్యతను గుర్తించడం, వాటి మనుగడకు ముప్పు గురించి అవగాహన కల్పించడం. ఒకప్పుడు మన ఇళ్లల్లో, పొలాల్లో, చెట్లపై ఎంతో సందడిగా కనిపించే పిచ్చుకలు ఈ రోజుల్లో అంతరించిపోతున్న జాబితాలో చేరుతున్నాయి. పిచ్చుకలు మన పర్యావరణానికి ఎంతో మేలు చేస్తాయి. పంటల్లో పురుగులను తినడం ద్వారా పంటలను రక్షిస్తాయి. అంతేకాకుండా, విత్తనాలను చెదరగొట్టడం ద్వారా చెట్ల పునరుత్పత్తికి సహాయపడతాయి. పిచ్చుకల చిలిపి శబ్దాలు మనకు ఎంతో ఆనందాన్ని ఇస్తాయి. పిచ్చుకల సంఖ్య తగ్గడానికి అనేక కారణాలు ఉన్నాయి. పెరుగుతున్న కాలుష్యం, వ్యవసాయంలో పురుగుమందుల వాడకం, సెల్ టవర్ల నుండి వెలువడే రేడియేషన్, చెట్ల సంఖ్య తగ్గడం వంటివి పిచ్చుకల మనుగడకు ముప్పుగా మారాయి.పిచ్చుకలను కాపాడుకోవడానికి మనం చాలా చర్యలు తీసుకోవచ్చు.మన ఇళ్లల్లో, పాఠశాలల్లో, కార్యాలయాల్లో పిచ్చుకలకు ఆశ్రయం కల్పించే కృత్రిమ గూళ్లను ఏర్పాటు చేయవచ్చు. పిచ్చుకలకు ఆహారం కోసం ధాన్యాలను, నీటిని ఏర్పాటు చేయవచ్చు. పురుగుమందుల వాడకాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చు. పిచ్చుకలను కాపాడటం మనందరి బాధ్యత. పిచ్చుకలు మన పర్యావరణంలో ఒక ముఖ్య భాగం వాటిని కాపాడుకోవడం మనం పర్యావరణాన్ని కాపాడినట్లు అవుతుంది. పిచ్చుకలు ఆహార గొలుసులో ఒక ముఖ్యమైన భాగం ఇతర జంతువులకు ఆహారాన్ని అందిస్తాయి. మానవ ఆరోగ్యానికి పిచ్చుకలు మార్గం చూపుతున్నాయి. దోమల వంటి హానికరమైన కీటకాలను తినేసి వివిధ రకాలైన వ్యాధులు వ్యాప్తి కాకుండా మనుషులను కాపాడుతూ ఉంటాయి. ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా పిచ్చుకలను కాపాడుకోవడానికి మనం ఒకరికొకరు చేయి కలిపి పనిచేద్దాం.పిచ్చుకల చిలిపి శబ్దాలు మన జీవితంలో ఎప్పటికీ మిన్నంటి ఉండేలా చూసుకుందాం. మన ఇంటి పరిసర ప్రాంతాలలో చెట్టు నాటడం వల్ల పిచ్చుకలకు ఆశ్రయం కల్పించినట్లు అవుతుంది. పాఠశాలలు, పార్కులలో చెట్లను నాటి కలకు ఆశ్రయాన్ని కల్పించాల్సిన అవసరం అందరి మీద ఉంది. పురుగు మందుల వాడకం తగ్గించి వివిధ రకాల పక్షులకు పిచుకులకు ప్రకృతి కి ప్రాణం పోద్దాం. కృత్రిమ గోళ్ల ఏర్పాటు చేసి పిచ్చుకలకు పక్షులకు కావలసిన నివాస స్థానాలను కల్పించాల్సిన అవసరం మానవ సమాజం మీద ఆధారపడి ఉంది. మన ఇంటి ముందు గింజలు నీరు పెట్టడం ద్వారా పిచ్చుకలకు ఆహారం అందించే ఏర్పాటు చేయాలి.


పిచ్చుకలను కాపాడుకోవడం మనందరి బాధ్యత.ఈ చిన్నారి పిట్టల పండుగ సందర్భంగా వాటిని కాపాడుకోవడానికి ఒకరికొకరు చేయి కలిపి పనిచేద్దాం. చిన్న చిన్న జీవులు చిన్నచిన్న పక్షులు అయినప్పటికీ ప్రకృతి పరిరక్షణలో పిచ్చుకలు కీలకపాత్ర పోషిస్తున్న సందర్భంగా ప్రకృతి పరిరక్షణలో పిచ్చుకల రక్షణ ఒక ముఖ్య భావంగా భావించి వాటిని రక్షించడానికి మన వంతు కృషి చేద్దాం. పెరుగుతున్న కాలుష్యం, వ్యవసాయంలో పురుగుమందుల వాడకం, సెల్ టవర్ల నుండి వెలువడే రేడియేషన్, చెట్ల సంఖ్య తగ్గటం వంటివి పిచ్చుకల మనుగడకు ముప్పుగా మారాయి. వాతావరణ మార్పుల వలన వర్షపాతం ఉష్ణోగ్రతలలో మార్పులు జీవన చక్రాన్ని ప్రభావితం చేస్తాయి. పిచ్చుకలు మన సంస్కృతిలో శాంతిలో మన సంతోషంలో మన శ్రేయస్సులో ముఖ్య భాగం కాబట్టి ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా వాటిని కాపాడుకుంటూ వాటి పరిరక్షణకు మానవ ప్రయత్నంగా మనందరం కృషి పక్షులకు పర్యావరణ పరిరక్షణకు అవసరము. పసుపు కుంకుమలు పడుచుకు అందం. పశు వులు పక్షులు, ప్రకృతికి అందం. మొక్కలను నాటుకున్నాము, వృక్షాలను పెంచుకుందాము, పిచ్చుకలను పక్షులను, కాపాడుకుందాం ప్రకృతి వైపు పయనిద్దాం.



**పూసపాటి వేదాద్రి**
**కవి, సాహితీ విశ్లేషకులు**
**9912197694**

# నవచరిత్రను సృష్టించనున్న వ్లాదిమిర్ పుతిన్

రష్యాలో మార్చి 15 నుంచి 17 వరకు జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ 87 శాతం ఓట్లతో మరోసారి అధ్యక్షుడుగా ఎన్నిక కావడం చారిత్రాత్మకం. ప్రపంచం అంతా వ్లాదిమిర్ పుతిన్ ని 'నియంత' అని కోడై కుసిననూ కూడా ఆయన మరోసారి ఘనవిజయం సాధించడం అద్వీతీయం అని చెప్పవచ్చు. నిజానికి వ్లాదిమిర్ పుతిన్ ని ప్రపంచం నియంతగా భావించిననూ 'అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని నిలువరించే ధీరుడు'గా పేర్కొనడంలో ఏమాత్రం సందేహం లేదు. వ్లాదిమిర్ పుతిన్ 2018 లో సాధించిన 76.7% ఓట్లను మించి ఈసారి ఓట్లను సాధించడం గమనార్హం. ఒక రకంగా ఉక్రెయిన్ పై మూడవ సంవత్సరంలోకి ప్రవేశించిన రష్యా యుద్ధానికి ప్రజామోదం లభించినట్లుగా భావించవచ్చు.



వ్లాదిమిర్ పుతిన్ అభ్యర్థిత్వానికి ఏడు కోట్ల 50 లక్షలకు పైగా ఓటర్లు మద్దతు పలకడం విశేషం. వ్లాదిమిర్ పుతిన్ సమీప ప్రత్యర్థి కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ రష్యన్ ఫెడరేషన్కు చెందిన అభ్యర్థి నికోలాయ్ ఖరిటోనోవ్ 4.31% ఓట్లను గెలుచుకున్ననూ ఈ ఓట్లకు పెద్దగా ప్రాధాన్యం ఏమి లేదు. సోవియట్ యూనియన్ లోనూ మరియు తూర్పు యూరప్ లోనూ సోషలిజం పతనం తర్వాత లాటిన్ అమెరికా సహా అనేక దేశాలలో సోషలిస్ట్ ప్రభుత్వాలు కొలువుదీరుతూనే ఉన్ననూ రష్యాలో నానాటికి అక్కడ కమ్యూనిస్ట్ పార్టీ ఓట్లు దిగజారుతుండడం విచారకరం. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్ట్ మరియు కమ్యూనిస్ట్ యేతరులు పుతిన్ విజయంపై ప్రశంసలు వెలువెత్తిస్తుంటే అమెరికా మాత్రం రష్యా ఎన్నికలను 'అప్రజాస్వామ్య ఎన్నికలు' అని ప్రకటించడం అసహేతుకమే అవుతుంది.

రష్యాలో జరిగిన తాజా ఎన్నికతో 2030 వరకు వ్లాదిమిర్ పుతిన్ అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. వ్లాదిమిర్ పుతిన్ 2000 నుంచి 2008 వరకూ అధ్యక్షుడిగానూ, 2008 నుంచి 2012 వరకూ ప్రధానిగాను మరియు 2012 నుంచి నేటి వరకు అధ్యక్షుడిగానూ కొనసాగుతున్నారు. వ్లాదిమిర్ పుతిన్ 2020లో రూపొందించిన రాజ్యాంగ మార్పుల ప్రకారం 2036 వరకు అధికారంలో కొనసాగేందుకు అవకాశం ఉంది. ఏది ఏమైననూ ఈ 2029 నాటికి పుతిన్ పదవీకాలం సోవియట్ యూనియన్ను నిరంతరాయంగా 29 సంవత్సరాలు పాలించిన జోసెఫ్ స్టాలిన్ను అధిగమించి 200 ఏళ్లలో రష్యాలో ఎక్కువ కాలం పనిచేసిన అధినేత గాను వ్లాదిమిర్ పుతిన్ నవచరిత్రను సృష్టించనున్నారు.



**జేజేసీపీ**
**బాబూరావు**
**రీసెర్చ్ స్కాలర్,**
**9493319690**

# పానీ పూరి

చూడగానే నోరూరుతుంది
మనసు కొమ్మ మీది కోతిలా
ఆనందంతో గెంతుతుంది!

జీవితం
బుడగలాంటిదని స్ఫురిస్తుంది
అనుభవించి
ఆస్వాదించుమని బోధిస్తుంది!

ఉప్పు, కారం, ఘాటు
భిన్న రుచుల సమ్మిళితం
బండీపై ఉన్నా
బడా విందులో ఉన్నా!

మాతృక మారదు
ఎంత ఆస్వాదించిన
దాహం తీరదు!

**జగ్గయ్య.జి**
**9849525802**

# గొంగట్లో తింటూ వెంట్రుకల గురించి మాట్లాడుటయా!

భారతదేశంలో కూడ మీడియాను డబ్బులు ఉన్న బడా పారిశ్రామికవేత్తలు ఒక వ్యాపార సంస్థగా మార్చివేశారు. ఇందులో నీతి, నియమం, ధర్మం, అధర్మం, ప్రజలు, బాధితులు, పీడితులు అనే విచక్షణను కోల్పోయి తమకు అనుకూలమైన వాటినే వార్తలుగా, నిజాలుగా ప్రచారం చేసే స్థాయికి మీడియా దిగజారింది. మీడియాలో పనిచేసే ఎడిటర్ నుంచి గ్రామీణ విలేకరి వరకు కుల, మత, ప్రాంతీయ అభిమానం, ఆర్థిక లావాదేవీలతో నియామకాలు కొనసాగుతున్నాయి. మీడియాకు ప్రచారాన్ని డబ్బులు సమకూర్చే ఏజెంట్ గానే విలేకరులు, జర్నలిస్టులు మిగిలిపోవాలని, పనిచేయాలని యజమాన్యం ఆకాంక్షిస్తున్నది. అదే రీతిలో నడిపిస్తున్నది.విలేకరులు, జర్నలిస్టుల నియామకాలు చదువు, సామాజిక స్పృహ, జ్ఞానం, ప్రాపంచిక విషయాలపై అవగాహన ఆధారంగా జరగడం లేదు. కేవలం అడ్వర్టైజ్మెంట్లు, సర్కులేషన్ పెంచి మీడియా సంస్థలకు డబ్బులు సమకూర్చే స్తోమత కలిగిన వారిని విలేకరులుగా, జర్నలిస్టులుగా నియమిస్తున్నారు.

ఇలాంటి చోట జర్నలిస్టులను మాత్రమే తప్పు పట్టడం సరైనది కాదని నా అభిప్రాయం. జర్నలిస్టు సంఘాలు, జర్నలిస్టుల నాయకులు కూడా యాజమాన్య విధానాలకు వ్యతిరేకంగా పోరాడటం,కనీసం ఉద్యమించడం, ప్రశ్నించడం మరిచిపోయారు. నాయకులుగా చలామణి కావడానికి, ప్రభుత్వాల వద్ద గుర్తింపు కోసం మాత్రమే తహతహలాడుతున్నారు. తమ ప్రయోజనాల కోసం జర్నలిస్టుల సమస్యలను సంక్షేమాన్ని మరచి స్వీయ ప్రయోజనం కోసం మాత్రమే వ్యవహరిస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో జరిగిన సంఘటన... అందులో విలేకరులు, ముఖ్యంగా ప్రధాన పత్రిక విలేకరులు వ్యవహరించిన తీరు పూర్తిగా తప్పిదమే! కానీ విలేకరులను డబ్బులు సమకూర్చే వ్యక్తులుగా, యంత్రాలుగా మార్చిన మీడియా యజమాన్యాలనే తప్పుగా నేను భావిస్తున్నాను. దీనిని కొందరు జర్నలిస్టు సంఘాల నాయకులు తమ ఉద్యోగాలను వదులుకొని పోరాడిన వారు ఉన్నారు. మరికొందరు లేదా అనేకులు యాజమాన్యం ఆలోచనలకు మరింత పదును పెట్టి, వీరి భావజాలాన్ని మేధస్సును వినియోగించి గ్రామీణ విలేకరులు డబ్బులు ఏ రకంగా సమకూర్చగలరో భారీ ప్రణాళికలను అందజేసిన మహానుభావులున్నారు. వారే జర్నలిస్టు సంఘాలకు నాయకులుగా, మీడియా సంస్థలకు అధిపతులుగాను ఉన్న సంఘటనలు ఉన్నాయి. అందుకే వ్యవస్థీకృత నేరాలను తీవ్రమైన నేరాలుగా పరిగణించేటప్పుడు, సామాజిక కోణాలను కూడా ఆలోచించాలని కోరుతున్నాను. నీతులు చెప్పేముందు, తీర్పులు వెల్లడించే ముందు ఆత్మ సాక్షిగా ఎవరికి వాళ్లు చేసే కార్యక్రమాలను కూడా సమీక్షించుకొని ఇతరులను విమర్శించడం మంచిది. తాము నిజాయితీపరులుగా ప్రకటించుకునే ముందు మరొక్కసారి గుండె మీద చేయి వేసుకొని గ్రామీణ విలేకరుల కష్టాలను, ఆకలిని, అవమానాలను, ఆత్మ గౌరవం గురించి కూడా ఆలోచించాలని మనవి చేస్తున్నాను. ఒక పత్రిక వార్షిక చందా చేయించడం, అడ్వర్టైజ్మెంట్ తీసుకురావడం కోసం నాయకులు చుట్టూ, కాంట్రాక్టర్ల ఇంటికి, ప్రభుత్వ అధికారుల కార్యాలయాలలో ఎన్నిసార్లు ప్రదక్షిణలు చేస్తున్నాము గుర్తుకు తెచ్చుకోవాలని కోరుతున్నాను. అందుకే విలేకరులను వార్తలు రాయటానికి బదులు డబ్బులు తీసుకువచ్చే ఏజెంట్లుగా మార్చి వేసిన తీరుపై మన కార్యాచరణ ఉంటే మంచిదేమో! మరొక్కసారి మనసుతో ఆలోచించాలని కోరుతున్నాం నేను ఎవరిని వ్యక్తిగా నిందించదలచుకోలేదు మనం గొంగట్లో ఉండి వెంట్రుకల గురించి మాట్లాడుతున్నావేమో అనిపిస్తుంది. అందుకే మన కష్టాలు, సంక్షేమ చర్యల పైన పనిచేయాల్సిన అవసరం ఉందని కోరుతున్నాను.

**మాదాసి రామమూర్తి,**
**సీనియర్ జర్నలిస్ట్**

# ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు

- **ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి బృందాలు ఎన్నికల విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి**
- **ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి**
- **అన్ని పార్టీల అభ్యర్థుల పట్ల సమదృష్టితో వ్యవహరించాలి**
- **ఈవీడిఎం డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి**




**హైదరాబాద్ సిటీ, మార్చి 19(జనం సాక్షి):**
ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిస్టిక్స్ సర్వైలెన్స్ బృందాలు వారికి కేటాయించిన ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించడమే కాకుండా అప్రమత్తంగా ఉండాలని ఈవీడియం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని మంగళవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టిక్స్ సర్వైలెన్స్ బృందాలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టిక్స్ సర్వైలెన్స్ బృందాల విధులు, బాధ్యతలు,ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం, నిరంతర తనిఖీ నిర్వహణ, ఈ ఎస్ఎమ్ఎస్ అప్లికేషన్, సి-విజిల్ యాప్ తదితర అంశాలపై జిల్లా వ్యయ పరిశీలకులు శరత్ చంద్ర అవగాహన కల్పించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం నిబంధనలు విధిగా పాటించాలని, అన్ని పార్టీల అభ్యర్థుల పట్ల నిబంధనలకు అనుగుణంగా సమదృష్టితో వ్యవహరించాలన్నారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలకు గురి కావాల్సి వస్తుందన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే విధంగా నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా వాస్తవాలను నిర్ధారించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

### వాహనాలకు పిటిజి కెమెరాలు, జిపిఎస్ ట్రాకింగ్

ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు సమకూర్చిన వాహనాలకు అత్యాధునిక సాంకేతికతతో కూడిన పిటిజి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా జీపిఎస్ ట్రాకింగ్ ఉంటుందని తెలిపారు. వీటి ద్వారా నిఘా బృందాల పనితీరును కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని, నిబంధనలకు అనుగుణంగా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు.

### ఫిర్యాదులను వంద నిమిషాలల్లో పరిష్కరించాలి

సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు అందిన 15 నిమిషాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు అక్కడికి చేరుకోవాలన్నారు. సి-విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులను వంద నిమిషాల్లో పరిష్కరించాల్సి ఉంటుందని తెలిపారు. తనిఖీల సమయంలో సాధారణ ప్రజలకు ఇబ్బందులు ఏర్పడకుండా సంయమనంతో వ్యవహరించాలని, నగదును జప్తు చేసిన సందర్భాలలో వీడియో కవరేజీ చేయాలని, తప్పనిసరిగా రశీదులు అందించాలన్నారు. అదే విధంగా తగిన ఆధారాలు చూపించి నగదును విడిపించుకునే వెసులుబాటు ఉందన్న విషయాన్ని వివరించాలన్నారు. ఎన్నికల వ్యయం, ప్రచార సరళి, ప్రలోభాల విషయంలో నిఘా బృందాలు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈవీడిఎం డిఎస్‌పి శ్రీనివాస్, సుదర్శన్, జిల్లా వ్యయ పరిశీలకులు నోడల్ అధికారి శరత్ చంద్ర, ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టీ బృందాలు చేయాల్సిన విధులు, బాధ్యతలు, ఈ ఎస్ఎంఎస్ అప్లికేషన్, సి-విజిల్ యాప్ తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్స్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు, ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి బృందాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసే బాధ్యత పాలకులదే

- **భగత్ సింగ్ కలలుగన్న అవినీతి, దోపిడీ, అక్రమాలు లేని సమసమాజ స్థాపనకు పౌరులంతా కృషి చేయాలి**
- **సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయా దేవి**



**హైదరాబాద్ మార్చి 19 (జనం సాక్షి)**
యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసే బాధ్యత పాలకులదేనని, భగత్ సింగ్ కలలుగన్న అవినీతి, దోపిడీ, అక్రమాలు లేని సమసమాజ స్థాపనకు పౌరులంతా కృషి చేయాలని సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయా దేవి పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 93వ వర్ధంతిని పురస్కరించుకుని ఉస్మానియా విశ్వవిద్యాలయం లోని క్రికెట్ గ్రౌండ్లో ఏర్పాటు చేసిన భగత్ సింగ్ మెమోరియల్ టోర్నమెంట్‌కు ఛాయా దేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెండవ రోజు పోటీలలో పాల్గొన్న క్రీడాకారులకు కరచాలనం చేసి అభినందించారు. ఈ సందర్భంగా సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయా దేవి మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ఎన్నో క్రీడలు అంతరించి పోతున్నాయని వాటిని గుర్తించి కాపాడాల్సిన బాధ్యత పాలకులదేనని వారు డిమాండ్ చేశారు. భగత్ సింగ్ దేశ స్వాతంత్ర్యం కోసం చిరు ప్రాయంలోనే పోరాడి వీరమరణం పొందారని అటువంటి భగత్ ఆశయ సాధనలో నేటి యువత పాటుపడాలని వారు అన్నారు. భగత్ కలలుగన్న అవినీతి, అక్రమాలు, దోపిడీ లేని సమసమాజ స్థాపనకు నేటి యువత నడుంబిగించాలని వారు ఉద్ఘాటించారు. కానీ నేడు దేశంలో అవినీతి, అక్రమాలతో కూడిన రాజకీయాలు సమాజాన్ని, రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేసేలా ఉన్నాయని, రాజకీయాలంటే కార్పొరేట్ శక్తులు మాత్రమే అనేలా అపహాస్యం చేసేలా ఉన్నాయని, సేవ చేయాలనే యువత ఆలోచనలను నేటి పాలకులు కుతంత్రాలతో నాశనం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తంచేశారు. అందుకే ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులలో ఆర్థిక అరాచకాలు,నేరాలు చేసిన వారే ఉన్నారని ఇది మన దేశ భవిష్యత్‌కు పెను ప్రమాదమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. సత్య ప్రసాద్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోలోజు లక్ష్మణ్, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, నేతలు మాజీద్, కళ్యాణ్, అనిల్, మహేష్‌లతో పాటు 12జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

## పార్కు అభివృద్ధి పనుల పరిశీలన

**కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి**

**కాప్రా, మార్చి 19 (జనంసాక్షి)**
ఉప్పల్ నియోజకవర్గం కాప్రా డివిజన్ సైనిక్పురి ఫోర్త్ రెవెన్యూ పార్క్ అభివృద్ధి పనులను మంగళవారం డివిజన్ కార్పొరేటర్ స్వర్ణ రాజ్యం శివమణి స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. పార్కులో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరలో మార్కులు ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అధికారుల ప్రత్యేక చరవతో పార్కును అన్ని వయసులవారు ఉపయోగించుకునేలా తీర్చిదిద్దారన్నారు. డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల సంక్షేమ సంఘం సభ్యులు ఈ పార్కును సందర్శించాలన్నారు. డివిజన్లోని మిగితా పార్కులను ఈ పార్కు తరహాలో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రంలో కాప్రా మాజీ వార్డ్ మెంబర్ పవన్, మచ్చ శ్రీకాంత్ గౌడ్, నాయకులు రిజవాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



## మల్కాజ్గిరిలో కాంగ్రెస్, బీజేపీని చిత్తూగా ఓడించాలి:లక్ష్మ రెడ్డి

**ఎల్బీ నగర్ మార్చి 19(జనం సాక్షి**
కర్మాంఘాట్ లోని కొత్తకాపు యాదవరెడ్డి గార్డెన్స్ నందు ఎల్‌బి నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మల్కాజిగిరి భారస పార్టీ ఏంపీ అభ్యర్థి శ్రీ.రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి రాగిడి లక్ష్మారెడ్డి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం అభ్యర్థి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ.కేసీఆర్ కేటీఆర్ గార్ల వల్లనే తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందింది అని తెలిపారు. రాబోయే రోజుల్లో భారస పార్టీ తప్పకుండా పుంజుకుంటుంది అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు పూర్తిగా అమలు చేసే వరకు మనం వదిలిపెట్టవద్దని బీజేపీ కాంగ్రెస్ ను ఎన్నికలో ఓడించాలన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో ముద్దగోని రామ్మోహన్ గౌడ్, ఆనంతుల రాజిరెడ్డి, గజ్జల మధుసూదన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, జిట్టా రాజాషేకరు రెడ్డి కొప్పుల వితలిరెడ్డి, ప్రవీణ్ కిసర్, డివిజన్ తాజా మాజీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, మహిళా నాయకురాలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ సాస్ తయారు చేస్తున్న ముఠా గుట్టు రట్టు చేసిన పోలీసులు

**శంషాబాద్, మార్చి 19 (జనం సాక్షి)**
శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ సాస్‌లు తయారు చేస్తున్న ముఠా గుట్టు రట్టు చేసిన ఎస్ఓటి శంషాబాద్ పోలీసులు. శంషాబాద్ ఎస్ఓటి పోలీసులు శంషాబాద్ పరిధిలోని ఇండస్ట్రీస్‌పై దాడి చేసి ప్రాణాంతక మైన రసాయనాలు మరియు సింథటిక్ రంగులతో కూడిన ఎక్స్పైరీ అయిన సాస్ పాకెట్స్‌పై కొత్త తేదీలతో కూడిన స్టిక్కర్స్ వేసి మార్కెట్‌లో అమ్మకానికి పంపిస్తున్న 772.13 లీటర్స్ సాస్, ఏసిటిక్ అసిడ్ 30 లీటర్స్ కార్న్ ఫ్లోర్ 13 కేజీలు మరియు ఇతర సామాగ్రిని పట్టుకున్నారు. వీటి విలువ రూ. 3,50,000 ల వరకు ఉంటుందని అంచనా. కేసును ఎయిర్పోర్ట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## ఎండాకాలం మూగ జీవుల దాహార్తిని తీర్చాలి

**భావన శ్రీనివాస్**

**ఈ నెల 24న పిచ్చుక గూళ్ళు, నీళ్ళ తొట్టెలు పంపిణీకి సిద్ధం**

**ఎల్బీనగర్, మార్చి 19 (జనం సాక్షి)**
ఎండాకాలం మూగ జీవుల దాహార్తిని తీర్చేందుకు కాలనీ వీధుల్లో నీటి తొట్టెలు, డాబాలపైన పక్షుల నీళ్ళ కొరకు మట్టి మూకుళ్ళు, పిచ్చుకల ఆశ్రయం కొరకు మట్టితో చేసిన పిచ్చుకల గూళ్ళను, వాటి ఆహారం కొరకు కొర్రలు, సజ్జలు,రాగులు తదితర గింజల పొట్లాలను 100మందికి ఈ నెల 24న బిఎన్‌రెడ్డి డివిజన్ గాయత్రి నగర్ బ్యాంక్ కాలనీ విప్ర సేవా సమితి ప్రక్కన, ఇంజాపూర్ ప్రధాన రహదారిలో ఉన్న (వూ స్కూల్) ఊ స్కూల్ ప్రాంగణం నందు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ తో పాటు మనోహర్, గద్దె విజయ్ నేత, పర్యావరణ వేత్త సూర్యకుమారిలు ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 20 ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా 24సెలవ రోజు కాబట్టి పంపిణీకి సిద్ధం చేస్తున్నామన్నారు. జాగృతి అభ్యుదయ సంఘం, ఊ స్కూల్ సామాజిక కార్యకర్త గద్దె విజయ్ నేతల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పంపిణీ కార్యక్రమానికి ప్రకృతి ప్రేమికులు, గాయత్రి నగర్ బ్యాంక్ కాలనీ వాసులతో పాటు పరిసర కాలనీ వాసులు కూడా హాజరైపై వస్తువులు తీసుకోవచ్చని వారున్నారు. వివరాలకు: 9985985958 నంబర్‌లో మనోహర్‌ని సంప్రదించవచ్చును.

## శిశువు ఎదుగుదలకు తల్లి పాలు శ్రేయస్కరం

**డిజిటల్ మాధ్యమం ద్వారా గర్భిణీ స్త్రీలకు అవగహన**

**చిల్డ్రన్ స్పెషలిస్ట్ డాక్టర్ అనుపమ శశిధర్ రెడ్డి**

**తాండూరు మార్చి 19(జనం సాక్షి)**



తల్లి గర్భంలో శిశువు ఎదుగుదలకు తల్లి పాలు శ్రేయస్కరమని చిల్డ్రన్ స్పెషలిస్ట్ డాక్టర్ అనుపమ శశిధర్ రెడ్డి పేర్కొన్నారు. తాండూరు పట్టణంలోని డాక్టర్ ఎం కోబా గార్డెన్ కోకట్ రోడ్‌లో ఉన్న ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని బషీరాబాద్, యలాల్, పెద్దేముల్, తాండూర్ మండలం నుంచి 250 మంది గర్భిణీ స్త్రీలకు 250 అంగన్వాడి టీచర్లకు డిజిటల్ మాధ్యమం ద్వారా గర్భిణీ స్త్రీలు బిడ్డ గర్భంలో ఉన్నప్పుడు ఎలాంటి మెలకువలు పాటించాలని విషయంపై శ్రీ రామకృష్ణ మఠం ఆర్య జననిముఖ్య అతిథిగా పాల్గొని చిల్డ్రన్ స్పెషలిస్ట్ డాక్టర్ అనుపమ శశిధర్ రెడ్డి పాల్గొని అవగాహన కల్పించారు. తల్లి గర్భంలో శిశువు ఎదుగుదలకు తల్లి పాటించవలసిన విషయాలను కండ్లకు కట్టినట్లుగా గర్భిణులకు వివరించారు. ప్రతిరోజు గర్భిణిలు ఉదయం నుండి రాత్రి వరకు ధ్యానము, యోగ, ఆధ్యాత్మిక భావనతో కలిగి ఉండి పాజిటివ్ నేచర్లో 9 నెలలు బిడ్డను మోయ్యాలన్నారు. దేశంలో ప్రతి కుటుంబంలో అభిమన్యుడు, వివేకానందుడు, శివాజీ, ప్రహ్లాదుడు లాంటి బిడ్డలు దేశానికి కావాలన్నారు. అందుకు తల్లి ఆలోచన శక్తి కలిగి ఉండాలన్నారు. పిల్లలలో బ్రెయిన్ డెవలప్మెంట్ కావాలంటే తల్లి గర్భంలో ఉన్నప్పుడే కథలు పుస్తకాలు, భజనలు, యోగ, ధ్యానము, రామాయణం మహాభారతం లాంటి ఇతిహాసాలను అనుసరించి చదవాలని మంచి ఆహారం తీసుకొని భోజనం చేయాలని అప్పుడే మంచి వ్యక్తిత్వం కలిగిన సంస్కారవంతమైన బిడ్డలు జన్మిస్తారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్పర్సన్ విజయలక్ష్మి, వికారాబాద్ మా శారద డాక్టర్ రాజశేఖర్, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు బాలకృష్ణ, లయన్స్ క్లబ్ అధ్యక్షులు బసన్నప్ప, ప్రోగ్రాం కన్వీనర్ దశరథ్, నిర్వాహకులు కే.వి.ఎం వెంకట్, నరహరి, మోహన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సిడిపిఓ లక్ష్మియోగా భజన శిక్షకులు దీప్తి, నిహారిక గంగాధర్, శరన్ అంగన్వాడి సూపర్వైజర్లు, నియోజకవర్గ అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



## ఉప్పల్ నియోజకవర్గం రాష్ట్రంలో ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తా..

**ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి**

**కాప్రా మార్చి 19 (జనం సాక్షి)**
ఉప్పల్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తా, నియోజకవర్గ పరిధిలోని డివిషన్లలో ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలను తప్పకుండ పరిష్కరిస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కాప్రా డివిజన్‌లో కృప విల్లాస్, చంద్రపురి కాలనీ ఎక్స్‌టేన్షన్‌లలో స్థానిక ప్రజలతో కలిసి పర్యటన చేశారు. కాలనీ సమస్యలపై పర్యటించిన ఎమ్మెల్యే కు స్థానికులు శాలువాతో సత్కరించి సమస్యలను వివరించారు. ముఖ్యంగా కాలనీలలో సమస్యలు మంచినీరు, సీసీ రోడ్లు, డ్రైనేజ్ సమస్య, మ్యాన్ హోల్స్ ఎర్పాటు తదితర సమస్యలను ప్రజలు ఎమ్మెల్యేకు తెలియజేసారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ..డివిజన్ ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా సంబందిత అధికారులతో మాట్లాడి పనుల పుర్తి అయ్యేలా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బైరి నవీన్ గౌడ్, కృపావిల్లాస్ కాలనీ అధ్యక్షుడు మధుకర్ నాయుడు, చంద్రపురి కాలనీ ఎక్స్ టేన్షన్ అధ్యక్షుడు సంతోష్, దామోదర్, మాధవరెడ్డి, భద్రయ్య, నాగేశ్వరావు పాల్గొన్నారు.



## రంజాన్ పండుగ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

**తాండూరు మార్చి 19 (జనం సాక్షి)**
మున్సిపల్ పరిధిలోని చెన్ గెష్ పూర్ రోడ్ మార్గంలో గల ఈద్గాను స్థానిక ముస్లిం సోదరులతో కలిసి రంజాన్ పండుగ ఏర్పాట్లును ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గామైదానంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతిపత్రం ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఈద్గామైదానంలో రంజాన్ పండుగ రోజు ప్రత్యేక ప్రర్థనలు నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాని సంబంధించిన అధికారులకు అదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న పరిమళ్, కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్, నాయకులు సర్దార్ ఖాన్, అజయ్ ప్రసాద్, ఈద్గా కమిటి చైర్మన్ యూసుఫ్ తదితరులు ఉన్నారు.

# రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందాం

**మల్కాజిగిరి, మార్చి 19 (జనం సాక్షి)**



ఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి నాయకులకు,కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నేరేడ్ మేట్ డివిజన్‌లోని సరస్వతి ఫంక్షన్ హల్ లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.కాంగ్రెస్ పార్టీ 100 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని, కాంగ్రెస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వల్లనే రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని, ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారని దీంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలుస్తున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో బిఆర్ ఎస్ పార్టీ గెలుపు దిశగా పయనిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ అల్వాల్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్ సబిత అనిల్ కిషోర్ గౌడ్, కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి మేకల సునీత రాము యాదవ్, జవహర్ నగర్ కార్పొరేటర్ ఏ.కే. మురేష్, మాజీ కార్పొరేటర్లు, జగదీష్ గౌడ్,ఆకుల నర్సింగరావు, రావుల అంజయ్య,బద్ధం పరశురాం రెడ్డి, జెఏ సి వెంకన్న, అమీనుద్దీన్, జీకే హనుమంతు రావు, మధు సుదన్ రెడ్డి, కరంచంద్, ఢిల్లీ పరమేష్, డొలి రమేష్, లడ్డు నరేందర్ రెడ్డి, చిన్నా యాదవ్, వీరేశం,శివ కుమార్,చిందం శ్రీనివాస్, సత్తయ్య, శ్రీనివాస్ గౌడ్, సతీష్, నేమురి శ్రీధర్, బైరూ అనిల్, చంద్రమౌళి, ఇబ్రహీం, భాగ్యనంద రావు, ఉస్మాన్, వివిఎన్.రాజు, ఉపేందర్, ఆతిక్, ఫరీద్, ప్రభాకర్, నర్సింగ్ రావు, అరుణ్, వాసు తదితరులు పాల్గొన్నారు.

# కాలనీలా అభివృద్ధికి సంక్షేమ సంఘాలు భాగస్వామ్యం కావాలి

**ఎమ్మెల్యే కేపీ వివేకానంద**

**కుత్బుల్లాపూర్ మార్చి 19 (జనం సాక్షి)**



కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు భాగస్వామ్యం కావాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అన్నారు. మంగళవారం జీడిమెట్ల డివిజన్ ప్రసన్న నగర్ నూతన సంక్షేమ సంఘం, శ్రీ కోదండ రామాలయం నూతన పాలకవర్గం సభ్యులు ఎమ్మెల్యే కేపీ వివేకానందను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకంక్షలు తెలియజేశారు. అనంతరం కేపీ వివేకానంద మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి పరచడానికి తాను ఎల్లవేళలా ముందు ఉంటాను అన్నారు. దేవాలయాలను అభివృద్ధి చేయడానికి తాను శాయశక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీ, దేవాలయ సంఘాల సభ్యులు కలిసి అభివృద్ధిలో వారి వంతు భాగస్వామ్యాన్ని నెలకొల్ప అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న నగర్ నూతన సంక్షేమ సంఘం నాయకులు రామచందర్, సిద్ధులు గౌడ్, జీ రమేష్, ఆర్ సుబ్బారావు, కే నాగేంద్రబాబు, కోదండ రామాలయ కమిటీ సభ్యులు జి సుబ్రమణ్యం, నాగ చంద్రారెడ్డి, మద్దిలేటి, సికె ఆశ, యు సుజాత, శైలజ, జె నాగేశ్వరరావు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# చేనేత హస్తకలను సద్వినియోగం చేసుకోండి



- **నేటి నుండి..ఏప్రిల్ 1వరకు కొనసాగింపు**
- **ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**

**తాండూరు మార్చి 19 (జనం సాక్షి)**
చేనేత హస్తకలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తాండూరు పట్టణం ఆర్యవైశ్య కళ్యాణమండపంలో చేనేత హస్తకళ నిర్వాహకులు పవన్ కుమార్ మోదీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి హాజరై చేనేత హస్తకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 19వతేదీ నుండి వచ్చే నేల ఏప్రిల్ 1వరకు సూమారు 15రోజుల పాటు చేనేత హస్తకల అమ్మకాలు కోనసాగిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలతోపాటు పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, కౌన్సిలర్లు నీరజాబాల్ రెడ్డి, ప్రభాకర్ గౌడ్, బోయరవి, రాము, నాయకులు చెన్నారం అనిల్ గుప్త, వడ్డె శ్రీనివాస్, అజయ్ ప్రసాద్, దేవగారి రాములు, పోటీ మహరాజ్ దేవాలయ చైర్మన్ భాను, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు కావలి సంతోష్ కుమార్, పట్టణ అధ్యక్షులు బంటు వేణుగోపాల్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కట్కం వీరేందర్, కార్యదర్శి కోటం మురళీకృష్ణ, చేనేత హస్తకల నిర్వహకులు తదితరులు ఉన్నారు.

# ఎన్నికల విధులను నిర్వహించే అధికారులు బాధ్యతతో వ్యవహరించాలి



## జిల్లా కలెక్టర్ సంతోష్

గద్వాల నడిగడ్డ, చెప్పు 19 (జనం సాక్షి)

సాధారణ లోకసభ ఎన్నికలను పారదర్శకంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు బాధ్యతతో పని చేయాలనీ, వారికీ సంబంధించిన అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి బిఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి సమావేశ మందిరములో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిస్టికల్ సర్విలేయన్స్, వీడియో వివింగ్ సర్వేలెన్స్, బృందాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి భారత ఎన్నికల సంఘం ద్వారా ఎన్నికల నిర్వహణ కోసం అన్ని విధాలుగా సన్నద్ధమై ఉండాలని అధికారులకు తెలిపారు. అధికారులకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలు, ఫ్లయింగ్ స్క్వాడ్, సర్విలేయన్స్ టీం బాధ్యతలను తెలియజేశారు. జిల్లాలోని సరిహద్దు ప్రాంతాలలో ఏర్పాటుచేసిన చెక్ పోస్టుల వద్ద పటిష్టమైన నిఘా పెట్టి విస్తృత తనిఖీలు నిర్వహించి అక్రమంగా నగదు మద్యం రవాణాను అరికట్టాలన్నారు. ఏప్రిల్ 18 నుండి ఎన్నికలు పూర్తయ్యే వరకు నిరంతరంగా టీములన్ని చురుకుగా పనిచేయాలన్నారు. సి-విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను వెంటనే స్పందించి 100 నిమిషాలలో పరిష్కరించాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎవరైనా 50 వేలకు మించి నగదును తీసుకొని వెళ్తే కచ్చితంగా ఆధారాలు చూపించాలని, లేకుంటే అట్టి నగదును సీజ్ చేయడం జరుగుతుందన్నారు. 10 లక్షల వరకు స్వాధీనం చేసుకున్న నగదును జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల కమిటీ ద్వారా పూర్తి ఆధారాలను పరిశీలించిన పిదప విడుదల చేయడం జరుగుతుందని, అంతకంటే ఎక్కువ ఉన్న నగదును ఇన్ కం టాక్స్ అధికారుల పరిధిలోకి వెళుతుందన్నారు. నగదు స్వాధీనం చేసుకునేటప్పుడు ఖచ్చితంగా వీడియో కవరేజ్ చేయాలని సూచించారు. గతంలో జరిగిన లోపాలను సరి చేసుకుని పని చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సదుపాయాలు కల్పించే విధంగా క్షేత్రస్థాయిలో సన్నద్ధమవ్వలని, పార్లమెంట్ ఎన్నికలలో సెక్టోరల్ అధికారుల పాత్ర చాలా కీలకంగా ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ రామ్ చందర్, డిఆర్డిఓ నర్సింగ్ రావు, ఎఫ్ యస్ టి, యస్ యస్ టి, వియస్ టి, వివిటి బృందాలు, సంబంధిత ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఆరెకటికల సంక్షేమానికి కృషి చేస్తా

## ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)

గత కొన్ని సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న ఆరెకటికల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం మహబూబ్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ఆరెకటికల సంఘం అధ్యక్షుడు అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఆరెకటికల సమస్యలను మహబూబ్ నగర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి, సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఆర్థికంగా వెనుకబడిన వారిని, ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేసి సబ్సిడీ ద్వారా లోన్లు మంజూరు చేసి ఆదుకోవాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. వారి సమస్యను విన్న ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ, వీలైనంత త్వరగా సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుధాకర్ రెడ్డి, ఆరెకటిక సంఘం నాయకులు మల్లేశం, ఖాజారామ్, శివరాములు, మహేందర్ జీ, వెంకటేశ్వర్ జీ, రవి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



# ఏప్రిల్ నాటికి బల్క్ మిల్క్ యూనిట్ పూర్తి చేయాలి

## అధికారులకు కలెక్టర్ శ్రీహర్ష ఆదేశం

నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):

ఏప్రిల్ చివరి నాటికి బల్క్ మిల్క్ చిల్లింగ్ యూనిట్లు పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో బల్క్ మిల్క్ చిల్లింగ్ యూనిట్ల పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మూడు రూట్ల ద్వారా పాల సేకరణ నిర్వహించి బల్క్ మిల్క్ చిల్లింగ్ యూనిట్లలో ఉంచే విధంగా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. మూడు వేల లీటర్ల పాలను సేకరించి వాటిని భద్రపరిచే విధంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అందుకు తగిన విద్యుత్ సదుపాయము ఇతర ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాయాంకుమిత్తల్, డివిఏహెచ్ఓ శ్రీనివాస్, అనిరుద్ చారి, డిప్యూటీ డైరెక్టర్ కవిత, బల్క్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలి

## పాలమూరు ఎంపీ స్వతంత్ర అభ్యర్థి రుద్రసముద్రం రామలింగం

మక్తల్, మార్చి 19 (జనం సాక్షి ):

కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ఏమాత్రం తెలంగాణపై ప్రేమ ఉంటే వెంటనే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇవ్వాలని పాలమూరు పార్లమెంటు స్వతంత్ర అభ్యర్థి రుద్ర సముద్రం రామలింగం మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉన్న ఏడు నియోజకవర్గాల్లో ఈ యొక్క ప్రాజెక్టు పూర్తయితే జిల్లా మొత్తం పూర్తి సస్యశ్యామలం అవుతుందని అన్నారు. ఇప్పటివరకు భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి పాలమూరు జిల్లాకు చేసిన గొప్ప పనులు ఏంటని వారు ప్రశ్నించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నాటి స్వాతంత్రం నుంచి నేటి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయినా కూడా ఇంకా వెనకబడిపోతూనే ఉందని, కేంద్ర ప్రభుత్వం వెంటనే జాతీయ హోదా ప్రకటించి ఉమ్మడి పాలమూరు జిల్లా రైతులకు మేలు చేయాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పేద ప్రజలను మోసం చేశారని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి 100 రోజుల పరిపాలన దాటిన నేటి వరకు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు, వెంటనే రైతుబంధు నిధులను విడుదల చేయాలని, రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.



# ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వాలి

## ముదిరాజ్ మహసభ రాష్ట్ర కార్యదర్శి కొత్త మనోహర్ ముదిరాజ్

మఖ్తల్ మార్చి 19 (జనం సాక్షి)

తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మక్తల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నుండి ఎమ్మెల్యేగా గెలుపొందిన ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఏకైక వ్యక్తి వాకిటి శ్రీహరికి మంత్రి పదవి కేటాయించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి కొత్త మనోహర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దాదాపుగా 65 లక్షల జనాభా కలిగి, అతి పెద్ద సామాజిక వర్గమైన ముదిరాజ్ లకు మంత్రి పదవుల్లో చోటు కల్పించి సముచిత స్థానం ఇవ్వాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ ఎస్ ముదిరాజ్‌లకు ఒక్క సీటు కూడా ఇవ్వకపోవడంతో...అందరూ కాంగ్రెస్‌కు జై కొట్టి, అధికారంలోకి రావడానికి కీలక భూమిక పోషించారని అన్నారు. కార్యక్రమంలో శ్రీధర్ ముదిరాజ్, నారాయణ పేట జిల్లా ఉద్యోగాల సంఘం అధ్యక్షుడు యాదగిరి, తెలంగాణ ముదిరాజ్ మహా సభ నారాయణ పేట జిల్లా యువత అధ్యక్షులు గాసం నర్సింహా ముదిరాజ్, హైకోర్టు అడ్వకేట్ వాసు రావు, మైనార్టీ రాష్ట్ర నాయకులు నదీమ్గం, గంగపుత్ర రాష్ట్ర యువత నాయకులు సతీష్ కుమార్, లింగప్ప, అంజప్ప పాల్గొన్నారు.

# పలక బలపం పట్టిన వలస కూలీల పిల్లలు

## శిశు సంరక్షణ కేంద్రం (వర్క్‌సైట్ ) పాఠశాలను ప్రారంభించిన జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి






వనపర్తి బ్యూరో మార్చి 19 (జనం సాక్షి)

వనపర్తి జిల్లాలో ఇటుక బట్టీ కార్మికుల పిల్లల కోసం పని ప్రదేశంలో శిశు సంరక్షణ కేంద్రం (వర్క్‌సైట్) పాఠశాలను జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి ప్రారంభించారు. ఇటుకలు పట్టుకోవడం అలవాటు చేసుకున్న వారి చిన్ని చేతులు మొదటిసారిగా స్లేట్‌లను పట్టుకున్నాయి. వారిలో చాలామంది ఇంతకు ముందు స్కూల్ డ్రెస్ వేసుకోలేదు లేదా సరైన స్కూల్‌కి వెళ్లలేదు. కాబట్టి మంగళవారం వనపర్తి జిల్లా మెట్టుపల్లీ గ్రామంలో ఒడిశాకు చెందిన ఇటుక బట్టీ కార్మికుల పిల్లల కోసం పని ప్రదేశంలో సంరక్షణ కేంద్రం వర్క్‌సైట్ పాఠశాలను ప్రారంభించినప్పుడు, వారు ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. వారు వారి వయస్సును బట్టి కొత్త యూనిఫారాలు, స్లేట్లు లేదా నోట్‌బుక్‌లు, పాఠ్యపుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు పొందారు. జిల్లా ఎస్పీ రక్షిత కే మూర్తి, ఏడీ ఎట్ యాక్షన్ స్వచ్ఛంద సంస్థ జి. సురేష్ చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ (సిడిపిఓ) ఆధ్వర్యంలో 49 మంది వలస కూలీల పిల్లలను పాఠశాలలో చేర్పించి తరగతులు ప్రారంభించారు. ఎయిడ్ ఎట్ యాక్షన్ మల్టీ-గ్రేడ్ టీచింగ్‌లో శిక్షణ పొందిన వాలంటీర్ ఉపాధ్యాయులలను ఏర్పాటు చేయనైనది వారు 3 నుండి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు నర్సరీ నుండి నుండి 2 తరగతి వరకు తరగతులు తీసుకోవడం ప్రారంభించారు. ఎన్జీవో పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగులు బూట్లు యూనిఫామ్, పెన్సిల్లు నోట్ పుస్తకాలు పలుకలు పెన్నులు మొదలగునవి అందించారు. చైల్డ్ డిపార్ట్మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ కృష్ణ చైతన్య వారి ఆధ్వర్యంలో పప్పు బియ్యం కోడిగుడ్లు బాలామృతం మొదలగు పౌష్టికాహారంతో పాటు పాఠశాల పర్యవేక్షణను కూడా అందిస్తోంది. ఈ కార్యక్రమంలో ఎన్జీవోస్ సిడిపిఓ సిబ్బంది వనపర్తి డిఎస్పి జె వెంకటేశ్వరరావు, వనపర్తి సీఐ నాగభూషణం, ఆత్మకూరు సిఐ శివ కుమార్, ఏహెచ్‌టియూ ఇన్చార్జి ఎస్ఐ అంజద్, వనపర్తి టౌన్ ఎస్ఐ జయన్న రామరాజు, భరోసా సెంటర్ సిబ్బంది షీ టీం సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుపయోగంగా ఉన్న భవనాలను వినియోగంలోకి తీసుకొస్తాం

## మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మఖ్తల్ మార్చి 19 (జనం సాక్షి)

నియోజకవర్గ కేంద్రం మక్తల్ పట్టణంలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలను ప్రజల అవసరం మేరకు వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం పట్టణంలోని పురాతన తహశీల్దార్ నివాస భవనాన్ని ఆయన పరిశీలించారు. గత కొంతకాలంగా వినియోగించకపోవడంతో నిరుపయోగంగా మారిన ఈ భవనాన్ని ఏ విధంగా ప్రజలకు ఉపయోగంలోకి తెస్తే బాగుంటుందో ఆలోచించి ఒక నిర్ణయం తీసుకుంటామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాకటి శ్రీహరి తెలిపారు. ఆ పక్కనే ఉన్న పోస్ట్ ఆఫీస్ భవనంతో పాటు ఖాళీ స్థలాన్ని ఆయన పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ఏవైనా కార్యాలయాలు ఏర్పాటుకు అవకాశం ఉంటే వాటిని అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. అదేవిధంగా మున్సిపాలిటీకి సంబంధించిన పాత పశువుల దవాఖాన, ఐడీసీ స్థలాన్ని ప్రజల అవసరాలకు ఉపయోగించే విధంగా ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం మీద పట్టణంలో నిరుపయోగంగా



ఉన్న ప్రభుత్వ భవనాలు స్థలాలను ప్రజల అవసరాలకు ఉపయోగపడే విధంగా ఉపయోగంలోకి తీసుకువస్తామని ఆయన తెలిపారు. అందుకు సంబంధిత అధికారులతో చర్చించి త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి వెల్లడించారు. ఎమ్మెల్యే వెంబడి కాంగ్రెస్ నాయకులు ఎండి. ఫయాజ్ కోళ్ళ వెంకటేష్ తదితరులు ఉన్నారు.

# బాధిత మహిళలకు ఆత్మస్థైర్యాన్ని కల్పించాలి



## జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట జిల్లా బ్యూరో మార్చి 19 (జనం సాక్షి):

బాధిత మహిళలకు మెరుగైన జీవనానికి జీవనం పొందేందుకు ఆత్మ స్థైర్యం కల్పించాలనీ ఎస్పీ యోగేష్ గౌతం అన్నారు. మంగళవారం ఉదయం జిల్లా ఎస్పీ జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి భరోసా సెంటర్లోని రికార్డులను తనిఖీ నిర్వహించి రికార్డులను పక్కాగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పరిధిలో హింసకు గురి అయిన శారీరికంగా లైంగికంగా ఆపదలో ఉన్న మహిళలు అత్యాచారానికి గురైన మరియు చిన్నారులకు భరోసా కేంద్రం ద్వారా సరైన సమయంలో రక్షణ వైద్య న్యాయ సహాయం అందించాలని నిందితులకు కోర్టులో శిక్షపడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత మహిళలకు భరోసా కల్పించి అండగా ఉండి వారికి ఆత్మస్థైర్యాన్ని పెంచి మెరుగైన జీవనానికి భరోసా కల్పించాలన్నారు. జిల్లా పరిధిలో ఎవరైనా బాధిత మహిళలు ఉన్న, ఫోక్సో, క్రైమ్ ఎగైనెస్ట్ ఉమెన్ సంబంధించిన కేసులలో సత్వర న్యాయం చేయుట కొరకు భరోసా సెంటర్ కు బదిలీ చేయడం వలన మెడికల్ ఎగ్జామినేషన్ బాధితురాలి, వాంగ్మూలం నమోదు బాధితురాలికి కౌన్సిలింగ్ ఇప్పించడం, 164 స్టేట్మెంట్ రికార్డు చేయడం బాధితురాళ్లకు షెల్టర్ ఇవ్వడం, వారికి వైద్య సహాయం కల్పిస్తామని అన్నారు. తద్వారా బాధితురాలు పోలీస్ స్టేషన్కు పదే పదే తిరగాల్సిన అవసరం ఉండదని వారు కూడా తమకు భరోసా కల్పించే అధికారులతో మనసు విప్పి జరిగిన అన్యాయాన్ని వివరించవచ్చని బరోసా సెంటర్‌లో తమకు ఎదురైన సమస్యను ఫిర్యాదు చేయడానికి భయపడవలసిన అవసరం లేదని అటువంటి వారికి అండగా నిలిచేది భరోసా కేంద్రం అన్నారు. బాధిత మహిళలు భరోసా సెంటర్ ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ గారు కోరారు. ఈ కార్యక్రమంలో సిఐ లు రామ్ లాల్, శివ శంకర్,ఆర్. ఐ. శ్రీకాంత్, ఎస్సై వెంకటేశ్వర్లు, సునిత, కౌన్సిలర్ ప్రమీల, రాధిక తదితరులు పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్‌పై ఆర్టీసీ దాడి

- కబ్జాకు యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన స్థానిక జర్నలిస్టులు

నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో మార్చి 19(జనం సాక్షి):

జిల్లా కేంద్రంలోని నల్లవెల్లి రోడ్డులో బస్టాండ్ ఆవరణలో గతంలో గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలోనే ప్రెస్ క్లబ్ కోసం గ్రామపంచాయతీ తీర్మానం మేరకు స్థలాన్ని కేటాయించడం జరిగింది. అట్టి స్థలంలో నిర్మాణంలో ఉన్న దుకాణాలపై మంగళవారం టిఎస్ఆర్టిసికి చెందిన డిఎం మరియు కొందరు ఉద్యోగులు దౌర్జన్యంగా ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తూ అందులో ఉన్న వారిని భయభ్రాంతులకు గురి చేశారని అలాంటి వారిపై కఠినంగా చర్యలు తీసుకొని ప్రెస్ క్లబ్‌కు రక్షణ కల్పించాలని స్థానిక జర్నలిస్టులు పోలీసులను ఆశ్రయించారు. గతంలో కబ్జాకు ఎక్కించిన వారి ఆగడాలను ఎండగట్టి నిర్మాణం చేపట్టిన జర్నలిస్టులకు ఆర్టీసీ అధికారులు బెదిరింపులకు దిగడం జరిగిందని ఇటీవల కబ్జాకు ఎక్కించిన సంఘటన మంగళవారం ఉదయం స్థానిక ఎస్సైకు రాతపూర్వకంగా మరియు మౌఖికంగా ఫిర్యాదు చేసిన సందర్భంలో పోలీసులు ఇరువురిని పిలిపించి మాట్లాడుదామని వివరించారని కానీ ఆర్టీసీకి చెందిన ఉద్యోగులు దౌర్జన్యంగా జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ కబ్జాకు ఎక్కించారని ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. డివి చారి, బాబురావు, బాల్ రెడ్డి, శ్రీశైలం, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నట్లు వారిపై ఫిర్యాదు చేశారు. ఈ



కార్యక్రమంలో జర్నలిస్టులు కందికొండ మోహన్, పి వెంకటస్వామి, కంచర్ల శ్యామ్, దస్తగిరి ఎస్ఎస్ బాబు, సహదేవుడు, సందు యాదగిరి, కందికొండ రమేష్, భరత్, వసీం విజయ భాస్కర్, శ్రీహర్ష, రాంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



# పరీక్ష కేంద్రాలను తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్

మక్తల్ మార్చి 19 (జనం సాక్షి)

నర్వ మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ముందుగా నర్వ మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పదో తరగతి పరీక్షా కేంద్రానికి వెళ్లి కేంద్రంలో ఎంతమంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు, ఎవరైనా గైర్హాజరు అయ్యారా అని సిఎస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లను నిర్మించాలని, పాఠశాల ఆవరణను చదును చేయాలని సూచించారు. పక్కనే ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కూడా ఆయన పరిశీలించారు. పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ సిలబస్ అమలు చేస్తున్నారా? ఏమైనా ఇంప్రూవ్ మెంట్ ఉందా లేదా అని అక్కడి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల తరగతి గదులపై కొందరు విద్యార్థులు తయారు చేసి అతికించిన వినాయకుడు, ఇతర బొమ్మలు బాగున్నాయని ప్రశంసించారు. అనంతరం కలెక్టర్ నర్వ తహసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. మండల పరిధిలో పెండింగ్‌లో ఉన్న 75 సర్వే దరఖాస్తులను వారం రోజుల్లోపు క్లియర్ చేయాలని సర్వేయర్‌ను ఆయన ఆదేశించారు. అలాగే ధరణి పెండిన దరఖాస్తుల గురించి అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి దిశా నిర్దేశం చేశారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన మండల ప్రజల నుంచి కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించి వాటిని తొందరగా పరిష్కరించాలని నర్వ తహసిల్దార్ మల్లారెడ్డికి సూచించారు. ఆ తర్వాత నర్వ ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేసి కార్యాలయంలో పనిచేసే అధికారులు, ఉద్యోగులకు సంబంధించిన మూడు నెలల బయోమెట్రిక్ హాజరు పట్టికను క్షుణ్ణంగా పరిశీలించి, కార్యాలయంలో అందరూ సమయపాలన పాటించాలని ఆదేశించారు. మండలంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనుల ప్రగతి నివేదికలను పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీఓ సుదర్శన్, ఎంఎల్‌హెచ్‌పిలు వెంకటరమణ, కీర్తి, తదితరులు పాల్గొన్నారు.



# ముచ్చటగా మూడోసారి నరేంద్ర మోడీ ప్రధాని

## బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్ నగర్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి డీకే అరుణ

మహబూబ్ నగర్ బ్యూరో మార్చి 19 (జనం సాక్షి)

ముచ్చటగా మూడవసారి ప్రధాని నరేంద్ర మోడీని ప్రధానమంత్రిని చేసేందుకు దేశ ప్రజలు కంకణబద్ధులై ఉన్నారని మహబూబ్ నగర్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి డీకే అరుణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కాళికాంబ కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన మహబూబ్ నగర్ పార్లమెంట్ పార్టీ విస్తృత స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాబోయే ఎన్నికల్లో నరేంద్రమోదిని మళ్ళీ ప్రధానిని చెయ్యడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు ఒక అభ్యర్థిగా పని చెయ్యాలన్నారు, ఈసారి ప్రజల్లో మళ్ళీ ఈ ఓటు మోదీ కోసమే మళ్ళీ మోదీనే రావాలి అన్న నినాదం ప్రజల్లో బలంగా ఉన్నదనీ ఆమె పేర్కొన్నారు . స్వాతంత్రం సిద్ధించిన నాటినుండి కాంగ్రెస్ దేశాన్ని పాలించిందని, కానీ ఎలాంటి అభివృద్ధి చేయలేదని, నరేంద్ర మోడీ ప్రధాని అయ్యాక ప్రపంచంలో భారత్ దేశానికి గుర్తింపు లభించిందని ఆమె పేర్కొన్నారు. దేశం అభివృద్ధి చెందాలన్నా, చతుర్దేశాల నుండి దేశాన్ని కాపాడుకోవాలన్న మూడోసరి నరేంద్ర మోడీని ప్రధానం చేయాలని ప్రజలను ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ పార్లమెంట్ ఎన్నికల ఇంచార్జి మాజీ ఎం.ఎల్.సి రాంచందర్ రావు, పార్లమెంట్ కన్వీనర్ పవన్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి చితరంజన్ దాస్, క్రమశిక్షణ సంఘం నాయకులు నాఘురావు నామోజీ, పార్లమెంట్ కో - కన్వీనర్ నర్సింహా గౌడ్, పార్లమెంట్ కో - కన్వీనర్ బీమ్ రెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజా రెడ్డి, రాష్ట్ర నాయకులు శ్రీవర్ధన్ రెడ్డి, మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, నారాయణ్ పేట్ జిల్లా అధ్యక్షులు పగుడాకుల శ్రీనివాసులు, మహబూబ్ నగర్ మాజీ జిల్లా అధ్యక్షులు వీర బ్రహ్మ చారి, వనపర్తి మాజీ జిల్లా అధ్యక్షులు రాజవర్ధన్ రెడ్డి, అసెంబ్లీ ఇంచార్జిలు పాల్గొన్నారు.

# తెలుగు సాహిత్యంలో మహిళలు



చరిత్ర కందని చిత్ర కథలు మొదలైనవి వ్రాసారు.గృహాలక్ష్మీ స్వర్ణ కంకణం,కళాప్రపూర్ణ, సుశీలానారాయణ రెడ్డి అవార్డు,తెలుగు విశ్వవిద్యాలయంవారి ఉత్తమ రచయిత్రి అవార్డు పొందారు.

అబ్బూరి ఛాయాదేవి(1933-2019).ఛాయాదేవి గొప్పకథకురాలు స్త్రీల కథలను స్త్రీవాద కథగా పరిణమింప చేయటంలో ఛాయాదేవి చెప్పుకోదగ్గ కృషి చేశారు.1956లో హైదరాబాద్ ఆంధ్ర యువతీ మండలి వారి వనిత పత్రికకు సంపాదకీయం వహించారు.3 స్వీయ కథా సంకలనాలు ప్రచురించారు.పిల్లల కథలు, జానపద కథల అనువాదం,యాత్రా చరిత్రలు 16 రచించారు.%ూ ఎ% నరిసింహారావు స్మారక పురస్కారంగా స్వర్ణ కంకణం,పులికంటి సాహితీ సత్కృతి,సుశీలా నారాయణ రెడ్డి పురస్కారం ఇలా ఎన్నోపురస్కారాలు వీరిని వరించాయి. ఈమె సహాయ సంపాదకత్వంలో కథాకోశం ప్రచురితం అయ్యింది.

1939లో జన్మించిన రంగనాయకమ్మ తెలుగు సాహిత్యంలో సాహసానికి, సంచలనాలకు మారు పేరు.గృహిణిగా ఉంటూ కథలు, నవలలు రాసే స్థాయి నుండి సమాజాన్ని,మర్మిజాన్ని అధ్యయనం చేసి విమర్శకురాలిగా పరిణితి చెందారు.1955 లో తన 16 వ ఏటనే పార్వతమ్మ కథ అనే కథ తెలుగు స్వతంత్ర లో ప్రచురింప బడింది.జానకి విముక్తి,స్వీట్ హోమ్,పేకమేడలు,బలిపీఠం వీరి పాపులర్ రచనలు.రామాయణ విష వృక్షం సంచలనాన్ని రేపిన పుస్తకం. వాసిరెడ్డి సీతాదేవి,మాదిరెడ్డి సులోచన, కోడూరు(ఆరెకపూడి) కౌసల్యాదేవి, ఆంధ్రులఆరాధ్య రచయిత్రి యద్దనపూడి సులోచనా రాణి వీరంతా 1965 కు ముంద తమ రచనల ద్వారా తెలుగు పాఠకుల సాహిత్యాభిలాషను, తెలుగు భాషను నిలబెట్టారు.

నిడదవోలు మాలతి అమెరికా,తెలుగు రాష్ట్రాల మధ్య వారధిలా చాలా కథలను ,వ్యాసాలను అందించారు.డయాస్పోరా కథలు, కథా మాలతి ఈవిడ కొన్ని రచనలు.

తరువాతి సంచలనాలు ఓల్గా,కాత్యాయనీ విద్మహే,వాడ్రేవు వీరలక్ష్మీదేవి, సత్యవతి , కుప్పలి పద్మ వంటి వారు తెలుగు సాహిత్యంలో కొత్త ఒరవడిని సృష్టించారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఎంతో మంది యువ రచయిత్రులు తమ విభిన్నతను చాటుకున్నారు. కె ఎన్ మల్లీశ్వరి,కల్పనా రెంటాల, సుజాత వేల్పూరి ఇలా వీరంతా కొత్త కొత్త కోణాలలో సామాజిక అధ్యయనాన్ని, సమస్యలను తమ రచనల ద్వారా పాఠకుల ముందుకు తెస్తున్నారు.

మహిళా దినోత్సవం సందర్భంగా ఇంతమంది తెలుగు కవయిత్రులలను, రచయిత్రులను గూర్చి కొంతయినా వివరాలను అందించే ప్రయత్నం ఇది.సాహిత్యం భాషను ,అనుభవాలను,విజ్ఞానాన్ని,చరిత్రని సజీవంగా ఉంచే గొప్ప ప్రక్రియ.తెలుగు వారంతా మంచి సాహిత్యాన్ని మరింతగా ఆదరించే దిశగా అడుగు వేయాలని కోరుకుంటూ. మహిళామణులందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

**ఈవ్యాసం కోసం పరిశీలించిన పుస్తకాలు:**

1.విశిష్ట తెలుగు మహిళలు :డాక్టర్ దామెర వేంకట సూర్యారావు.
2.మహిళల నవలలు మానవీయ విలువలు: కాత్యాయనీ విద్మహే.
3.సాహిత్యాకాశంలో సగం :కాత్యాయనీ విద్మహే
4.ఆంధ్ర రచయిత్రులు సమాచార సూచిక: కె . రామలక్ష్మి

ప్రపూర్ణ బిరుదు పొందారు. రంగాజమ్మ తరువాత కనకాభిషేకం పొందిన ఏకైక కవయిత్రి లక్ష్మీకాంతమ్మ.1917 నుండి 1996 వీరి జీవితకాలం.

1918 నుండి 1998 వరకూ జీవించిన ఇల్లిందుల సరస్వతీదేవి హైద్రబాదు నగర మహిళా చైతన్యం కోసం ఆంధ్ర యువతీ మండలిని నడిపించారు.యేవాదాలకు లోను కాకుండా సార్వజనీనమైన మానవతా విలువలు పెంచే కథలు వ్రాసారు.ఇతి వృత్త వైవిధ్యంతో 250 కథలు రాశారు. నూరు కథల సంపుటి 'స్వర్ణ కమలాలు'కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు పొందింది.వీరి మరో 108 కథల సంపుటి ' తులసీదళాలు'

తొలినాటి మహిళా కాలమిస్ట్,తెలుగు వారి పఠనా స్థాయిని పెంచిన రచయిత్రి మాలతి చందూర్.1950లో ఆనందవాణిలో 'రవ్వలదుద్దులు' మాలతీ చందూర్ తొలికథ ప్రచురితం అయ్యింది.1952 నుంచి నిరాటంకం గా అర్ధ శతాబ్ది పాటు' ప్రమదావనం'అనే జవాబుల శీర్షిక ఆంధ్రప్రభ వారపత్రికలో నడిపిన ఘనత మాలతీ చందూర్ ది. స్వాతి మాసపత్రికలో పాతకెరటాలు పేరుతో 300 కి పైగా ఆంగ్ల నవలలని సంక్షిప్తంగా తెలుగులోకి కుదించి అందించారు.'పాప' పేరుతొ కథా సంపుటి శతాబ్ది సూరీడు,హృదయనేత్రి,కాంచనమృగం లాంటి 26 నవలలు ఈవిడ రచనలు. 1928 నుండి 2013 ఈవిడ జీవితకాలం.వంటలు-పిండివంట లు అత్యధికంగా అమ్ముడుపోయిన పుస్తకం 30 మార్లు ముద్రణ అయినది. 1993 లో కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు,1987 ఆంధ్ర సాహిత్య అకాడమీ అవార్డు,లోక్ నాయక్ ఫౌండేషన్ పురస్కారం,రాజాలక్ష్మీ సాహిత్య పురస్కారం ఇలా ఎన్నో అవార్డులను పొందటం ఈమె ప్రతిభకు తార్కాణం. తెన్నేటి హేమలత (1931-1997)1960 లలో అబ్బాయిలు,అమ్మాయిలు ఎవరి చేతిలో చూసినా లత పుస్తకం ఉండేది.సంచలన రచయిత్రి.1958-69 మధ్య ఆంధ్రప్రభ వారపత్రికలో ఊహాగానం శీర్షిక లత నడిపేవారు. ఈవిడ భావకురాలు, ఉద్విగ్న మనస్కురాలు అని ఈవిడ రచనలు మోహన వంశీ వంటి వాటి ద్వారా పాఠకులు అనుకునేవారు.లత ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీలో 20 ఏళ్ల పాటు సభ్యురాలిగా ఉన్నారు.విషవృక్ష ఖండన పేరుతో రెండు సంపుటాలు,స్వర్ణసీత,లతవ్యాసాలు,

రేపటి సంచికలో

# జీతాల్లో వ్యత్యాసమెందుకు?



'సమాన పనికి సమాన వేతనం' అనే సిద్ధాంతం మహిళలకు వర్తించడం లేదు. పురుషులతో సమానంగా వారు విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ జీతాలు మాత్రం తక్కువగానే ఉంటున్నాయి. ఉద్యోగాలు చేస్తున్న మహిళల్లో **23%** మంది ఇలా తక్కువ జీతాలతో సరిపెట్టుకుంటు న్నారు. **16%** మంది మహిళా ఉద్యోగులు వివక్షను ఎదుర్కొంటున్నారు. రేటింగ్ సంస్థ క్రిసిల్, డీబీఎస్ బ్యాంక్ ఇండియా నిర్వహించిన సర్వే ప్రకారం **69%** మహిళా ఉద్యోగులు ప్రధానంగా మెరుగైన జీతాన్ని, కెరీర్‌లో ఉన్నతిని కోరుకుంటున్నారు. స్వయం ఉపాధి పొందుతున్న మహిళల్లో **42%** మంది స్వతంత్రతకు, అనుకూలమైన పనిగంటలకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

- సమాన పనికి సమాన వేతనం ఏది?
- యాజమాన్యాలతోచర్చించడంలోనూ సమస్యలే
- పని ప్రదేశంలో లింగ వివక్ష
- మహిళా ఉద్యోగులపై క్రిసిల్, డిబిఎస్ సర్వే

**న్యూఢిల్లీ : మార్చి 19 (జనంసాక్షి) :** ఆసక్తికరమైన విషయమేమంటే కేంద్ర కార్యాలయాల్లో కాకుండా బ్రాంచీలలో పనిచేయడానికి మహిళా ఉద్యోగులు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వడం లేదు. కేవలం 3 శాతం మంది మాత్రమే బ్రాంచి కార్యాలయాల్లో పనిని కోరుకుంటున్నారు. ఇక స్వయం ఉపాధి పొందుతున్న మహిళల విషయానికి వస్తే సంపదను పెంచుకోవడం, వ్యాపారంలో పురోభివృద్ధి సాధించడంపై ఆసక్తిని కనబరుస్తున్నారు. దేశంలోని పది నగరాల్లో పనిచేస్తున్న 800 మంది మహిళా ఉద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్న వారిని ఇంటర్వ్యూ చేసి ఈ సర్వేను రూపొందించారు.

**వేతనాలలో తేడాలు**

పురుష, మహిళా ఉద్యోగుల మధ్య వేతన వ్యత్యాసం ఎక్కువగానే ఉంది. రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ వార్షిక వేతనం తీసుకుంటున్న పురుష, మహిళా ఉద్యోగుల మధ్య వేతన వ్యత్యాసం 18 శాతం ఉంటోంది. అదే రూ.41 లక్షల నుండి రూ.55 లక్షల వరకూ వార్షిక వేతనం తీసుకుంటున్న వారి మధ్య వేతన వ్యత్యాసం 30 శాతంగా ఉంది. పని ప్రదేశంలో కూడా లింగ వివక్ష కన్పిస్తోంది. రూ.41-55 లక్షల మధ్య వార్షిక వేతనం తీసుకుంటున్న మహిళా ఉద్యోగుల్లో 30 శాతం మంది వరకూ తాము లింగ వివక్షను ఎదుర్కొన్నామని తెలిపారు. రూ.10-25 లక్షల వార్షిక వేతనం అందుకుంటున్న మహిళా ఉద్యోగుల్లో మాత్రం 12 శాతం మంది మాత్రమే ఈ రకమైన వివక్షకు గురవుతున్నారు.

**'జీతాల' సమస్యలు**

మెట్రో నగరాల్లో పనిచేస్తున్న 42 శాతం మహిళా ఉద్యోగులు తమ యాజమాన్యాలతో జీతాల గురించి చర్చించే సమయంలో సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తోంది. అయితే తూర్పు, పశ్చిమ ప్రాంతాల్లో వారి అనుభవాలు భిన్నంగా ఉన్నాయి. కొల్‌కతాలో పనిచేస్తున్న 96 శాతం మహిళా ఉద్యోగులు జీతాలపై చర్చించే సమయంలో ఎలాంటి సమస్యలు ఎదుర్కోవడం లేదు. అహ్మదాబాద్‌లో మాత్రం 33 శాతం మందికి సమస్య ఎదురవుతోంది. చెన్నైలో 77 శాతం మందికి, హైదరాబాద్‌లో 41 శాతం మందికి సవాళ్లు తప్పడం లేదు.

**ఆరోగ్యానికి ప్రాధాన్యత**

ఇక మహిళలకు పని ప్రదేశంలో తగినంత విశ్రాంతిని కల్పించే విధానాలపై పూనేలో 35 శాతం మంది ఉద్యోగులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయంలో జాతీయ సగటు 5 శాతంగా నమోదైంది. మెట్రో నగరాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు బిజీ షెడ్యూల్ మధ్య కూడా ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. గత సంవత్సరం 66 శాతం మంది మహిళా ఉద్యోగులు సమగ్ర ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.

**ఖర్చు ఎక్కువే**

మహిళా ఉద్యోగుల్లో కేవలం 32% మంది మాత్రమే వారానికి ఒకసారి బయటికి భోజనానికి వెళుతున్నారు. లేదా ఆహారాన్ని ఆర్డర్ చేస్తున్నారు. మహిళా ఉద్యోగుల్లో 24 శాతం మంది రోజుకు నాలుగు గంటలకు పైగా పాటు ఆఫీసు పనికి దూరంగా ఉంటున్నారు. వివాహిత ఉద్యోగుల్లో 32 శాతం మంది గత సంవత్సరం 3-5 సార్లు విశ్రాంతి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లారు. అవివాహిత మహిళలతో పోలిస్తే ఇది రెట్టింపుగా ఉంది. సర్వేలో పాల్గొన్న మహిళల్లో దాదాపు సగం మంది (47 శాతం) తమ ఆదాయంలో 70 శాతానికి పైగా ఖర్చు చేస్తున్నారు. వీరిలో 39 శాతం మంది విహార యాత్రలు, షాపింగ్ కోసం తమ వద్ద ఉన్న క్రెడిట్ కార్డులను ఉపయోగిస్తున్నారు. ఈ విషయంలో పాన్-ఇండియా సగటు 33 శాతంగా ఉంది.




# ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కేసు

- చంద్రబాబు బెయిల్ రద్దు విచారణ వాయిదా
- ఏప్రిల్ 16కు వాయిదా వేసిను సుప్రీం కోర్టు



**న్యూఢిల్లీ, మార్చి 19 (జనంసాక్షి) :** ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బెయిల్ రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ వచ్చే నెలకు సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఏప్రిల్ 16వ తేదీన ఈ పిటిషన్‌పై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టనున్నట్టు జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ పంకజ్ మిట్టల్ ధర్మాసనం పేర్కొంది. చంద్రబాబు కుటుంబం ఒక డైరీ పెట్టి... అందులో అధికారుల పేర్లు నమోదు చేస్తున్నట్లు చెపుతోందని, తాము అధికారంలోకి వస్తే... అందరిపై చర్యలు తీసుకుంటామని బెదిరిస్తోందని ప్రభుత్వం తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీ కోర్టుకు తెలిపారు. ఈ పిటిషన్ ప్రధాన ఉద్దేశం ఏమిటని ప్రభుత్వ న్యాయవాదులను జస్టిస్ బేలా త్రివేది ప్రశ్నించారు. బెయిల్ రద్దు చేయాలని కోరుతున్నట్లు ముకుల్‌రోహత్గి చెప్పారు. స్కిల్ కేసులో బెయిల్ మంజూరు తర్వాత... చాలా పరిణామాలు చోటు చేసుకున్నాయని, నిందితుడి కుటుంబ సభ్యులు అధికారులను, దర్యాప్తు సంస్థను బెదిరిస్తున్నారన్న ముకుల్ రోహత్గి అన్నారు. వెంటనే బెయిల్ రద్దు చేయడానికి అనేక కారణాలు ఉన్నాయని, తక్షణం విచారణ చేపట్టాలని ముకుల్ రోహత్గి కోరారు.కాగా ప్రభుత్వం లేవనెత్తిన ప్రతి అంశానికి తాము సమాధానం ఇస్తామని చంద్రబాబు తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు.

దీంతో రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశిస్తూ.. తదుపరి విచారణ మూడు వారాల తరువాత చేపట్టనున్నట్లు ప్రకటించింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో హైకోర్టు చంద్రబాబుకు ఇచ్చిన బెయిల్ రద్దు చేయాలంటూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌పై ఇవాళ మరోసారి సుప్రీంకోర్టు విచారణ జరుపనుంది. చంద్రబాబుకు బెయిల్ మంజూరులో తమ వాదనలు, ఆధారాలను హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదని, ప్రభుత్వ ధనం దుర్వినియోగం అయిందన్న అంశాన్ని కోర్టు పరిగణలోకి తీసుకోలేదని సీఐడీ ప్రధానంగా పిటిషన్‌లో పేర్కొంది. స్కిల్ కేసులో చంద్రబాబును ఏపీ సీఐడీ అరెస్ట్ చేయగా.. ఆయన రాజమండ్రి సెంట్రల్ జైలులో 50 రోజులకు పైగా రిమాండ్‌లో ఉన్నారు.. ముందు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు.. ఆ తర్వాత రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసిన విషయం విదితమే.. దీంతో. స్కిల్ కేసులో చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలంటూ ఏపీ ప్రభుత్వం సుప్రీం కోర్టు మెట్లు ఎక్కింది.. ఆ పిటిషన్‌పై ఈరోజు సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ పంకజ్ మిట్టల్ ధర్మాసనం విచారణ జరిగింది. ఈ సందర్భంగా బెయిల్ రద్దుపై ఏప్రిల్ 16న పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని ధర్మాసనం పేర్కొంటి.. విచారణను వాయిదా వేసింది.

# మల్లారెడ్డి కాలేజీల్లో ఫీజుల దందా

**ఐటి దాడులు చేపట్టిన అధికారులు**




**హైదరాబాద్, మార్చి 19 (జనంసాక్షి) :** బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్లను ఎక్కువ ఫీజుకు యాజమాన్యం అమ్ముకుంటోందనే ఆరోపణలు రావడంతో ఐటి అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్శిటీలో 40 మంది విద్యార్థులను డిటైన్ చేయడంతో సోమవారం అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చేశారు. లాభాపేక్ష కోసం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారంటూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లెక్కల్ని రికార్డుల్లో సక్రమంగా చూపించడం లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఐటి అధికారులు సోదాలు నిర్వహించారు. మేనేజ్‌మెంట్ కోటా సీట్లను ఎంతకు అమ్ముకున్నారనే దానిపై ఐటి అధికారులు ప్రధానంగా ఆరా తీస్తున్నారు. ఏ విద్యార్థి ఎంత ఫీజు కట్టాడనే దానిపై ఫోకస్ పెట్టారు. కాలేజీ రికార్డులను స్వాధీనం చేసుకున్న ఐటి అధికారులు? వాటిని తమ కార్యాలయానికి తీసుకెళ్లారు. ఇప్పటికే కాలేజీ మేనేజ్ మెంట్, సిబ్బందిని ఐటి అధికారులు ప్రశ్నించారు. బంధువుల పేర్లతో ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్టు గుర్తించినట్టు సమాచారం. ప్రస్తుతం తనిఖీలు కొనసాగుతున్నాయి.



# ఎస్ఐగా చెలామణి అవుతున్న యువతి అరెస్ట్

**పెళ్లి చూపుల సందర్భంలో బయటపడ్డ మోసం**

**నల్లగొండ, మార్చి 19 (జనంసాక్షి) :** గతేడాది కాలంగా నకిలీ ఎస్ఐగా చెలామణి అవుతున్న మాళవిక అనే యువతిని పోలీసులు అరెస్ట్ చేశారు. నల్గొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన యువతి మాళవిక తాను శంకర్ పల్లి ఎస్ఐని అని అందరినీ నమ్మించింది. ఆఖరికి పెళ్లి సంబంధానికి కూడా యూనిఫామ్‌లో వెళ్లింది. అయితే పెళ్లి సంబంధం కుదుర్చుకునేందుకు అబ్బాయి తరపు వారు వివరాలు ఆరా తీశారు. ఉన్నతాధికారులను సంప్రదించడంతో అసలు విషయం బయటపడింది. మాళవిక నకిలీ ఎస్ఐ అని గుర్తించారు. కాగా మాళవికను రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. మాళవిక నార్కట్ పల్లికి చెందిన యువతి అని, నిజాం కాలేజీలో డిగ్రీ పూర్తి చేసిన ఆమె 2018లో ఆర్‌పీఎఫ్ ఎస్సై పరీక్ష రాసిందని తెలిపారు. కంటి సమస్య ఉండడంతో వైద్య పరీక్షల్లో ఆమె క్వాలిఫై కాలేదని వివరించారు. నల్గొండలో మాళవికను అదుపులోకి తీసుకున్నట్టు వివరించారు. శంకర్‌పల్లిలో విధులు నిర్వహిస్తున్నట్లు నమ్మించిందని పేర్కొన్నారు. ఆర్‌పీఎఫ్ ఎస్సైని అని చెప్పుకున్న ఆమె యూనిఫామ్, ఐడీ కార్డులను కూడా తయారు చేసుకుందని రైల్వే పోలీసులు వివరించారు. ఉద్యోగం రాలేదని తల్లి తండ్రులు బాధ పడుతుండడంతో ఆమె ఈ పని చేసినట్లు తేలిందన్నారు. కాగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఆర్‌పీఎఫ్ యూనిఫామ్‌లో మాళవిక కొన్ని రీల్స్ కూడా చేసింది.

# మావోయిస్టులకు భారీ దెబ్బ

**ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోల హతం**



**ముంబయి, మార్చి 19 (జనంసాక్షి) :** మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టులు-భద్రతా బలగాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోలు చనిపోయారు. తెలంగాణ సరిహద్దు నుంచి మహారాష్ట్రలోనికి మావోయిస్టులు ప్రవేశిస్తుండగా వారిని భద్రత బలగాలు చుట్టుముట్టాయి. పోలీసుల అలికిడి విన్న మావోలు కాల్పులు జరపడంతో భద్రతా బలగాలు ఎదురుకాల్పులు జరిపారు. హతమైన మావోయిస్టులు తెలంగాణ కమిటీకి చెందిన వారిగా గుర్తించారు. మృతి చెందిన మావోలలో ఇద్దరిపై రూ.36 లక్షల రివార్డు ఉన్నట్టు సమాచారం. ఘటనా స్థలంలో నుంచి ఎకె 47 తుపాకులు, మందుగుండు సామాగ్రి, సాహిత్య పుస్తకాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతులలో మంచిర్యాల డివిజన్ కమిటీ సెక్రటరీ వర్గీస్, చెన్నూరు ఏరియా కమిటీ సెక్రటరీ మగ్తూ, కుర్సంగ్ రాజు, కుడిమెట్ట వెంకటేశ్‌లుగా గుర్తించారు.

# కెసిఆర్ లక్ష్యంగా రాజకీయ కుట్రలు

- కవిత అరెస్ట్ ఉద్దేశ్యం ఇదే కనిపిస్తోంది
- మాజీమంత్రుల విమర్శలు



**హైదరాబాద్,మార్చి19(జనంసాక్షి) :** బ్యాంక్‌లకు లక్షల కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన వారిని వదిలి కేవలం రాజకీయ కక్షతో కెసిఆర్‌ను అణచివేయాలన్న కుట్రతోనే కవితను అరెస్ట్ చేశారని మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ టార్గెట్‌గానే ఇవన్నీ జరుగుతున్నా యన్నారు. అధికారంలో ఉన్నామని భయ భ్రాంతులకు గురిచేసి పార్టీలో చేర్చుకుంటామంటే కుదరదన్నారు. అసమానతలు, అణిచివేత ఉన్నందునే నక్సల్ బరి నుంచి తెలంగాణ ఉద్యమం వరకు పుట్టుకొచ్చాయని చెప్పుకొచ్చారు. ఈ గడ్డపై మరో ఉద్యమం పుట్టడం ఖాయమన్నారు. అన్ని వర్గాలను కడుపులో పెట్టుకుని కాపాడుకుంది కేసీఆర్ మాత్రమే అని శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి విర్రవీగే మాటలు మానుకోవాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వ్యాఖ్యలు చేశారు. గత సీఎం కేసిఆర్ తప్పు చేసినట్లు చెప్పడం మూర్ఖత్వమన్నారు. ఎంక్వైరీల పేరుతో గత పథకాలు ఎగ్గొడుతున్నారన్నారు. దళిత బంధు, గొర్రెల పంపిణీ ఆపేశారని మండిపడ్డారు. ఇస్తరో ఇవ్వరో ఆ వర్గాలకు సమాధానం చెప్పాలన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా సీఎం చిల్లరగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి భాషపై క్రిమినల్ కేసుపెట్టి జైల్‌కు పంపాలని కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు.

# కెసిఆర్ సారథ్యంలోనే పనిచేస్తాం

- పార్టీ మార్పు ప్రచారంపై మండిపడ్డ ఎర్రబెల్లి
- ఆకురాలే కాలమన్న మాజీ ఎమ్మెల్యే వినయ్



**వరంగల్, మార్చి 19 (జనంసాక్షి) :** కేసీఆర్ సారథ్యంలో పార్టీ కోసం ఒక సైనికుడిగా పనిచేస్తానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తాను పార్టీ మారుతున్నట్లు జరుగుతున్నట్లుగా దుష్ప్రచారం జరుగుతోం దని కొట్టిపారేశారు. తనకు పార్టీ మారే ఉద్దేశం లేదన్నారు. బీజేపీలోకి వెళ్తున్నట్లు కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని..బీఆర్ఎస్ కార్యకర్తలను తప్పుదోవ పట్టించేందుకు ఇలా ప్రయత్నిస్తు న్నారని చెప్పారు. క్యాడర్ అవన్నీ నమ్మవద్దని ఎర్రబెల్లి సూచించారు. ఆనాడు వైఎస్సార్ ఎన్నో ఇబ్బందులు పెట్టిన తాను పార్టీ మారలేదని చెప్పారు. ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు ఫోన్ ట్యాపింగ్ కేసుపై ఎర్రబెల్లి స్పందించారు. అసలు ప్రణీత రావు ఎవరో కుడా తెలియదన్నారు. నా పేరు చెప్పాలని ప్రణీత రావు మీద అధికారులు ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. బిజినెస్, ల్యాండ్ దందాలు, తప్పుడు పనులు చేసే నాయకులు అధికార పార్టీలోకి పోతున్నారని ఎర్రబెల్లి విమర్శించారు. కాంగ్రెస్ వంద రోజుల పాలన ఫెయిల్ అయిందని ప్రజలు అనుకుంటున్నారని ఎర్రబెల్లి చెప్పారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటిలు అమలు చేయలేదని.. ఎన్నికల కోసమే డ్రామా చేశారని ఆరోపించారు. కనీసం కేసీఆర్ పెట్టిన పథకాలు కూడా అమలు చేయట్లేదని విమర్శించారు. మాయ మాటలు చెప్పడం, మోసాలు చేయడం సీఎం రేవంత్ రెడ్డికి అలవాటేనని ఎర్రబెల్లి.అన్నారు. మండే వేసవిలో కూడా చెరువులు నింపిన మహానుభావుడు కేసీఆర్ అని ఎర్రబెల్లి కొనియాడారు. నాయకులు పోయినంత మాత్రాన ఏమి కాదని.. కార్యకర్తలు దైర్యంగా ఉండాలన్నారు. కార్యకర్తలు మీద తప్పుడు కేసులు పెడితే తాము పోలీస్ స్టేషన్ లో కూర్చుంటామని భరోసా ఇచ్చారు. రాజకీయాల్లో గెలుపు, ఓటములు సహజమన్న ఎర్రబెల్లి... ఎన్టీఆర్ లాంటి నాయకునికి కూడా ఓటమి తప్పలేదని గుర్తుచేశారు. బీఆర్ఎస్ నుంచి ఇతర పార్టీలకు వెళ్లే నాయకులపై బీఆర్ఎస్ నేత దాస్యం వినయ్ భాస్కర్ విమర్శలు గుప్పించారు. కేసీఆర్ ఫోటోతో గెలిచిన నాయకులు ఇప్పుడు పార్టీ మారుతున్నారని విమర్శించారు. పార్టీ మారిన నాయకులతో క్యాడర్ పోవట్లేదని చెప్పారు. పచ్చని చెట్టుకు ఎండిపోయిన ఆకులు రాలిపోయినట్టు పోతున్నారని అన్నారు. మళ్ళీ చెట్టు చిగురిస్తుంది, కాయలు కాస్తాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎండి పోయిన పొలాలు, కాలిపోతున్న మోటార్లు కనిపిస్తున్నాయని వినయ్ ఆరోపించారు. ప్రజల పక్షాన పోరాడుతామని తెలిపారు. రాష్ట్రంలోని చోటా భాయ్, కేంద్రంలోని బడా భాయ్ కలిసి కేసీఆర్ మీద కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తాను ఫుల్ టైం పొలిటీషియన్ అని తనకు ఎలాంటి వ్యాపారాలు లేవని చెప్పారు. పార్ట్ టైం పొలిటీషియన్ లు పార్టీ మారిన వచ్చే నష్టం ఏం లేదని దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 20 మార్చి 2024 తెలంగాణ




## ఎంసీసీ అమల్లో ఉన్నందున శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేపట్టవద్దు

### జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ వెంకట్రావు

**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**
జిల్లాలో లోక్ సభ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వివిధ శాఖల ద్వారా నాన్ స్ట్రాట్ పనుల వివరాలను సత్వరమే అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లో వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర శాఖల ఇంజనీర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ బిఎస్. లత, ఏంసీసీ నోడల్ అధికారి, డీఎఫ్ఓ సతీష్ కుమార్ తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో ఎన్నికల కోడ్ కు ముందు జరుగుతున్న పనులు, అలాగే కోడ్ తదుపరి ఉన్న పనులు, టెండర్ ప్రక్రియలో గల పనుల వివరాలు సత్వరమే అందించాలని సూచించారు. జిల్లాలో మోడల్ కోడ్ కండక్ట్ అమలులో ఉన్నందున నాలుగు నియోజక వర్గాల్లో ఎక్కడ కూడా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టరాదని సూచించారు.కోడ్ కు ముందు జరుగుతున్న పనులు యధావిధిగా కొనసాగింపులు చేసుకోవచ్చని సూచించారు. పనులు టెండర్ ప్రక్రియలో ఉన్న నివేదికలో చూపాలని, అలాగే ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపడితే బాద్యులను చేస్తామని సూచించారు.నీటి పారుదల, రోడ్డు భవనాల శాఖ, పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపాలిటీలు వ్యవసాయ శాఖ, యస్.సి, బిసి వెల్ఫేర్ తదితర శాఖల పనులపై సమీక్షించారు.జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఉన్నందున ఎక్కడ కూడా నీటి ఎద్దడి రాకుండా చూడాలని,ఈ సమస్యపై రాష్ట్ర స్థాయిలో చర్చించడం జరుగుతుందని అన్నారు.ఈ సమావేశంలో పీఆర్ ఈఈ వెంకటేశ్వర రావు, ఇరిగేషన్ ఈఈ రమేష్,ఆర్అండ్ బి ఈఈ భాస్కర్ రావు, టీఎస్ఐడిసీ రమేష్, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్, డీఈ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి హ్యాండ్ బాల్ రిఫరీగా వరికుటి మోహన్

**మధిర ఆర్సి,మార్చి19(జనంసాక్షి)**




ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్న 45వ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ ఛాంపియన్షిప్ రెఫ్రిగా ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం మామునూరు గ్రామ నివాసి అయిన వరికుటి మోహన్ జాతీయస్థాయిలో న్యాయ నిర్ణీతగా వ్యవహరించున్నాడు . ఇట్టి విషయాన్ని హ్యాండ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రెటరీ తెలంగాణ స్టేట్ హ్యాండ్ బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ శ్యామల పవన్ కుమార్ మరియు తెలంగాణ రాష్ట్ర రిఫరీ బోర్డ్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి తెలియజేయడం జరిగింది . గత 20 సంవత్సరాలుగా పలుమార్లు జాతీయ స్థాయిలో రిఫరీగా మరియు జాతీయస్థాయి పోలీస్ క్రీడలలో న్యాయ నిర్ణయితగా వ్యవహరించి ఎన్నో ఉత్తమ అవార్డులు పొందినటువంటి వరికుటి మోహన్ ని ఖమ్మం జిల్లా సీనియర్ క్రీడాకారులు మరియు అసోసియేషన్ సంఘాలు మరియు పే బ్యాక్ సొసైటీ సభ్యులు జంగా లక్ష్మణరావు , కనకయ్య , జైపాల్ , శ్రీనివాసరావు , జర్నలిస్టు వేణుగోపాలరావు మరియు గ్రామ పెద్దలు అభినందనలు తెలియజేయడం జరిగింది.

## త్రాగునీటికి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్

ఖమ్మం అర్బన్, మార్చి19(జనంసాక్షి)
జిల్లాలో త్రాగునీటికి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. మంగళవారం నూతన కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఎంపిడివో, పీఆర్, ఆర్డబ్ల్యుఎస్ ఇంజనీర్లతో త్రాగునీటి సరఫరా పై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జలాశయాల్లో నీటి లభ్యత తగ్గుతున్నందున రాబోయే రోజుల్లో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో పట్టణ ప్రాంత పరిధిలో 804 బోర్లు, 151 పంప్ లు పనిచేస్తున్నట్లు, గ్రామీణ ప్రాంత పరిధిలో 1627 బోర్లు, 7199 పంప్ లు అందుబాటులో ఉన్నాయన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా ముందు ముందు ఏ ఏ ప్రాంతాల్లో ఎంత మేర నీటి లభ్యత ఉంటుందో, ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలపై కార్యాచరణ చేయాలన్నారు. బోర్ల మరమ్మత్తులు, ఫ్లషింగ్ లు చేయాలని, ప్రయివేటు బావులు, నీటి వనరులు లీజుకు తీసుకోనుట చేయాలని అన్నారు. నీటి వనరులు ఉన్న గ్రామాల్లో సరిపోను ఉన్నది లేనిది చూడాలన్నారు. త్రాగునీటి సరఫరా విషయమై మంజూరు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. బోర్ వెల్ ఆపరేటర్లు అనుమతి లేకుండా ప్రయివేటు బోర్లు వేస్తే వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. క్రొత్త బోర్ల మంజూరు విషయమై నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని ఆయన అన్నారు. గత సంవత్సరం నీటి ఎద్దడిని ఎదుర్కొన్న గ్రామాలలో సమస్య పునరావృతం కాకుండా చూడాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. మిషన్ భగీరథ ఏఇలు క్షేత్ర స్థాయిలో గ్రామాలు తిరిగి త్రాగునీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సరిచేయాలని అన్నారు. త్రాగునీటి ఎద్దడి కల్గకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణా సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, మిషన్ భగీరథ ఎస్ఇ సదాశివ కుమార్, పీఆర్ ఎస్ఇ చంద్రమౌళి, జెడ్పి సిఇఓ వినోద్, డిపిఓ హరికిషన్, సిపిఓ శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, మిషన్ భగీరథ ఇఇలు పుష్పలత, వాణిశ్రీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు కల్గిన ప్రతి మహిళ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలి






**నల్లగొండ బ్యూరో, మార్చ్, 20 (జనంసాక్షి):**
ఓటు హక్కు కల్గిన ప్రతి మహిళ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ,జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన అన్నారు. మంగళవారం ఆమె టిటిడిసిలోని జిల్లా సమాఖ్య భవనంలో పార్లమెంటు ఎన్నికల స్వీప్ కార్యక్రమాలలో భాగంగా "క్రమబద్ధమైన ఓటరు విద్య" పై మహిళా సంఘాలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మే నెలలోదేశవ్యాప్తంగా జరగనున్న పార్లమెంటు ఎన్నికలు దృష్ట్యా, ఓటు హక్కు కలిగిన ప్రతి మహిళ ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా సరైన నాయకున్ని ఎన్నుకోనే విధంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని చెప్పారు. సరైన నాయకుడిని ఎన్నుకుంటే మన భవిష్యత్తుతో పాటు, పిల్లల భవిష్యత్తు బాగుంటుందన్నారు. సమాజానికి ఉపయోగపడే పాలసీలను తీసుకురాగలిగే వారు సమాజానికి కావాలని, అలాంటి వారికి ఆలోచించి ఓటు వేయాలని తెలిపారు. నల్గొండ జిల్లాలో పురుషుల కన్నా మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారని ,ఈ ప్రభావం ఎన్నికలలో సైతం కనిపించాలని, అందువల్ల మహిళలందరు తప్పనిసరిగా ఓటింగ్ లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మహిళల్లో ఓటరు అవగాహనపై చైతన్యం తీసుకువచ్చేందుకు స్వీప్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతున్నదని పేర్కొన్నారు. గ్రామాలలో ఎవరైనా ఓటర్లను ప్రలోభపెట్టినట్లు తెలిస్తే తక్షణమే సి -విజిల్ లేదా 1950 హెల్ప్ లైన్ కు ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. ఎన్నికలలో ప్రతి ఓటు ముఖ్యమైనదని, అందువల్ల ప్రతి ఒక్కరూ వారి ఓటు హక్కును జాగ్రత్తగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.డిఆర్డిఓ నాగిరెడ్డి, జెడ్పి సిఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నాగమణి లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలోఅడిషనల్ డి ఆర్ డి ఓ శారద, తదితరులు పాల్గొన్నారు.

## వీరనారి మల్లు స్వరాజ్యం జీవితం స్ఫూర్తిదాయకం

### సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**




వీరనారి మల్లు స్వరాజ్యం జీవితం స్ఫూర్తిదాయకమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని రాయినిగూడెంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు,తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు నిర్మించిన మల్లు స్వరాజ్యం స్మారక కళా వేదికను ఆయన ప్రారంభించి మాట్లాడారు.ఈ తరానికి ఆమె ఒక స్ఫూర్తి అని, ఆమె పోరాటం అందరికీ ఆదర్శమని అన్నారు.వీర తెలంగాణ సాయుధ పోరాట వారసత్వమైన లౌకికత్వాన్ని రక్షించుకోవాల్సిన అవసరం మనందరిపైన ఉందన్నారు.దేశంలో బిజెపి మత సామరస్యాన్ని చెడగొట్టి మతోన్మాదాన్ని పెంచి పోషించాలన్న కుట్రలను అడ్డుకోవడానికి లౌకికవాద శక్తులు, రాజకీయ పార్టీలు భాగస్వామ్యం కావాలని కోరారు.నమ్మిన ఆశయం కోసం కొట్లాడిన వీరవనిత స్వరాజమని, ఆమె ఆశయ సాధనకు మనమంతా కృషి చేయాలని అన్నారు. మహిళా ఉద్యమానికి మల్లు స్వరాజ్యం దిక్సూచిగా నిలిచారని అన్నారు.తన జీవితాంతం ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసిన మహానాయకురాలని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎక్కడ పోరాటం జరిగితే అక్కడ మల్లు స్వరాజ్యం ప్రత్యక్షమయ్యే వారిని పేర్కొన్నారు.సారా వ్యతిరేక ఉద్యమంలో మల్లు స్వరాజ్యం నిర్వహించిన పాత్ర మరువలేనిదని కొనియాడారు.ఉమ్మడి జిల్లా అభివృద్ధిలో ఆమె ప్రముఖ పాత్ర పోషించారని అన్నారు.అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన విప్లవ గేయాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## పెండింగ్ కేసులను పరిష్కరించాలి

### అక్రమ కార్యకలాపాలు ఓపెన్ డ్రింకింగ్ జూదంను అరికట్టాలి

### రోడ్ భద్రతకు కఠిన చర్యలు తీసుకోవాలి

### సూర్యాపేట జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే





సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి): జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే సూర్యాపేట సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పెండింగ్ కేసులు, ఎన్ఫోర్స్మెంట్, తనిఖీలు, డయల్ 100 పిర్యాధులపై స్పందన, నిఘా నేత్ర ఏర్పాటు, దొంగతనం కేసుల రికవరీ, రోడ్డు భద్రత చర్యలు మొదలగు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలని, కోర్టు సిబ్బందితో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని అన్నారు. డయల్ 100, ఫిర్యాదులపై స్పందన వేగంగా ఉండాలని, బ్లూ కోట్స్ సిబ్బంది విధులు సమర్థంగా నిర్వహించాలని కోరారు.రోడ్ భద్రత విషయంలో నిత్యం తనిఖీలు చేస్తూ ఎన్ఫోర్స్మెంట్ కఠినంగా నిర్వహించాలని, మద్యం మత్తులో, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే జరిమానాతో పాటుగా వాహనాలు సైతం సీజ్ చేయాలని ఆదేశించారు.జిల్లా కేంద్రంతో పాటుగా ఇతర ప్రధాన పట్టణ కేంద్రాల్లో ట్రాఫిక్ నియంత్రణ, రెగ్యులేషన్ చేయాలని అన్నారు.రోడ్డు ప్రమాదాలు నివారణ కోసం సంబంధిత అధికారులతో సమన్వయంగా పని చేస్తూ ప్రమాదాలకు గల కారణాలకు నివారణ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఓపెన్ డ్రింకింగ్, అక్రమ రవాణా, అక్రమ కార్యకలాపాలపై, గంజాయి రవాణా, వినియోగంపై చట్టపరమైన చర్యలు తీసుకుని వాటిని నివారించడం కోసం అనుక్షణం కృషి చేయాలని అన్నారు. సిబ్బంది టీమ్ వర్క్ చేస్తూ, ప్రజలతో మంచి సంబంధాలు కలిగి లక్ష్యం కోసం పని చేయాలని అన్నారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పటిష్టంగా ఎన్నికల నియమావళి అమలు చేయాలని, సిబ్బంది అందరూ బాగా పని చేయాలని అన్నారు. ఎన్నికల సంబంధ కేసుల్లో ఉన్న వారిపై దృష్టి పెట్టాలని అన్నారు. ఈ సమావేశంలో సూర్యాపేట డీఎస్పీ రవి, డీసీఆర్బీ డీఎస్పీ మట్టయ్య, సీఐలు రాజశేఖర్, సురేందర్ రెడ్డి, శ్రీను, రఘువీర్ రెడ్డి,డీసీఆర్బీ, ఐటీ కోర్ ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లోపాలు లేకుండా, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను సమర్థవంతంగా చేపట్టాలి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్

**ఖమ్మం బ్యూరో, మార్చి19(జనంసాక్షి):**
ఎన్నికల నిర్వహణలో ఏ దశలోనూ లోపాలు లేకుండా, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. మంగళవారం నూతన కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో పోలీస్ కమీషనర్ సునీల్ దత్ తో కలిసి, ఏఆర్ఓ, డిఎస్పీ, ఏసీపీ, నోడల్ అధికారులతో లోకసభ ఎన్నికల నిర్వహణపై జిల్లా ఎన్నికల అధికారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల విధులు చాలా కీలకమైనవని, ఎక్కడా ఏ చిన్న తప్పిదానికి తావివ్వకుండా వంద శాతం సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. శనివారం ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ మేరక ఏప్రిల్ 18 నుండి 25 వరకు నామినేషన్ల స్వీకరణ, ఏప్రిల్ 26న స్క్రూటినీ, ఏప్రిల్ 29 వరకు అభ్యర్థుల ఉపసంహరణ ఉండగా, మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందని ఆయన అన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్టి బృందాలను పూర్తి స్థాయిలో పనిచేసేలా చూడాలన్నారు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు వాహనాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. నిఘా బృందాలు తమకు కేటాయించిన ప్రదేశాల్లో విధుల నిర్వహణ చేయాలన్నారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారిగా కేటాయించిన బృందాలు ఏ ఏ ప్రదేశాల్లో ఏర్పాటు చేసింది అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. అక్రమ నగదు, లిక్కర్, ప్రలోభాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో 12 ఎఫ్ఎస్టి, 15 ఎస్ఎస్టి, 2 ఇంటిగ్రేటెడ్ ఇంటర్ స్టేట్ చెక్ పోస్టులు, 10 ఇంటర్ స్టేట్ చెక్ పోస్టులు, 8 ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు, 24 గంటల నిఘా ఉంచినట్లు తెలిపారు. సాధారణ ప్రజానీకానికి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ప్రజలతో మర్యాదగా మెదగాలన్నారు. అనుమానిత రవాణా పట్ల చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రచార సామాగ్రిపై ప్రచురణకర్త పేరు, వివరాలు లేకుంటే సీజ్ చేయాలన్నారు. సీజర్ కు 102 కూడా ఉపయోగించాలన్నారు. సీజర్ సమయంలో అన్ని నియమ నిబంధనలను పాటించాలన్నారు. క్రిటికల్, వల్నరబుల్ పోలింగ్ కేంద్రాల గుర్తింపు మార్గదర్శకాల మేరకు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, శిక్షణా ఐపిఎస్ పి. మౌనిక, అదనపు డిసిపి ప్రసాద రావు, భద్రాద్రి కొత్తగూడెం అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎస్డీసి ఎం. రాజేశ్వరి, ఖమ్మం, కల్లూరు, కొత్తగూడెం ఆర్డీవోలు గణేష్, శ్రీనివాస్, మధు, డిసిఓ మురళీధర్ రావు, ఐటి అధికారి సాయి కుమార్, జిల్లా శిక్షణ నోడల్ అధికారి కే. శ్రీరామ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## ఉచిత శిక్షణకు గడువు పెంపు..

### జి.యం జాన్ ఆనంద్ వెల్లడి..

**ఇల్లందు మార్చ్ 19 (జనంసాక్షి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు సింగరేణి కాలరీస్ ఏరియాలోని నిరుద్యోగ యువతకు సింగరేణి ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి కోసం ఉచిత శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 30 వరకు పెంచినట్లు ఏరియా జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొత్తం 38 వృత్తి కోర్సులలో శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఇందులో కాస్మోటాలజీ, డ్రోన్, సోలార్, సెల్ టెక్నీషియన్స్, టూవీలర్ మెకానిక్, ఆర్క్ అండ్ గ్యాస్ వెల్డింగ్, కంప్యూటర్ డిటిపి, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ తదితర కోర్సులలో శిక్షణ అందించినట్లు తెలిపారు. కాస్మోటాలజీకి ఎటువంటి విద్యాఅర్హత అవసరం లేదని, ఇతర కోర్సులకు డిగ్రీ, డిప్లమా, పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఒక్కొక్క బ్యాచ్ కు 20 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల నిరుద్యోగ యువతీ యువకులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని సదరు పత్రంతో పాటు విద్యాఅర్హత సర్టిఫికెట్లను జత చేసి ఈ నెల 30వ తేదీ లోపు ఇల్లందు ఏరియా లోని యం.వి.టి.సి కార్యాలయంలో సమర్పించాలని, ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకుల అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## ఫిర్యాదు చేసిన 30 నిమిషాల్లో రికవరీ చేసిన పోలీసులు..


**మణుగూరు, మార్చి 19 (జనంసాక్షి):**



ఐఫోన్ ఎత్తుకెళ్లిన 30 నిమిషాల్లో ట్రేస్ చేసిన పట్టుకున్న మణుగూరు పోలీస్ లు ఒకప్పుడు చరవాణి పోయిందని ఫిర్యాదు చేస్తే దొరుకుతుందని నమ్మకం ఉండేది కాదు.. కానీ ఇప్పుడు సెంట్రల్ ఎక్విప్ మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సి ఈ ఐ ఆర్) వెబ్సైట్ అందుబాటులోకి వచ్చాక పోయిన ఫోను ట్రేస్ చేయడం వాటిని తిరిగి స్వాధీనం చేసుకోవడం సులభంగా మారింది. వివరాల్లోకి వెళ్తే మణుగూరు ఆదర్శనగర్ లో నివాసం ఉంటున్న నేత్ర వైద్యాధికారి జి సంజీవరావు ఇంట్లో చార్జింగ్ పెట్టిన ఐఫోన్ ని ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని సీఐ సతీష్ కుమార్ కి ఫోను ఎత్తుకెళ్లారని చరవాణి ద్వారా సమాచారం అందించారు.వెంటనే స్పందించిన సీఐ ఫోన్ నెంబర్ ఆధారంగా లొకేషన్ ని ట్రేస్ చేసి నిందితున్ని పట్టుకున్నారు. ఫిర్యాదు చేసిన అరగంట లోనే సిఐ సతీష్ కుమార్ నేతృత్వంలో, ఎస్సై ఎం ప్రసాద్ ఆదేశాల మేరకు కానిస్టేబుల్ షమీమ్ ఎంతో చాకచక్యంగా ఫోను ఎత్తుకెళ్లిన వ్యక్తిని పట్టుకొని ఫోన్ ను జి సంజీవరావు కు అందజేశారు. అరగంట లోనే ఛేదించిన విషయము డి.ఎస్.పి రవీందర్ రెడ్డి కి తెలియ పరచగా సిబ్బందిని అభినందించారు.

## ఈద్గా ఏర్పాటు చేయాలని ఎంఎల్ఏ పాయం కు వినతి..

**బూర్గంపహాడ్ మార్చి 19 (జనంసాక్షి) :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం జింకలగూడెం గ్రామానికి మైనారిటీల ప్రార్థనాస్థలం ఈద్గా తో పాటు కబరస్థాన్, క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని కోరుతూ స్థానిక గ్రామానికి చెందిన మైనారిటీ నాయకులు పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు కి వినతిపత్రం అందజేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత త్వరగా మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులతో పాటు మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మొరంపల్లిబంజర మాజీ ఉప సర్పంచ్ కైపు లక్ష్మీనారాయణ రెడ్డి, లక్ష్మీపురం మాజీ ఉప సర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పినపాక నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# డిప్రెషన్ నుంచి బయటపడేందుకే మళ్లీ డ్రగ్స్ తీసుకున్నాను

## అది టెస్లాకు ఎంతో ఉపయోగపడింది: మస్క్

**జనంసాక్షి:**డ్రగ్స్ తీసుకుంటున్నారంటూ తనపై వచ్చిన ఆరోపణలపై టెస్లా అధినేత ఎలోన్ మస్క్ స్పందించారు. మాదకద్రవ్యాలను వినియోగించినట్లు ఆయన అంగీకరించారు. డిప్రెషన్ నుంచి బయటపడేందుకు డాక్టర్ల సూచన మేరకే 'కెటమిన్' అనే డ్రగ్‌ను తీసుకున్నట్లు తాజాగా ఒక ఇంటర్వ్యూలో చెప్పారు.ఇలా తాను డ్రగ్స్ తీసుకోవడం వల్ల ప్రభుత్వ కాంట్రాక్టులు, పెట్టుబడి సంబంధాలపై ఎలాంటి ప్రభావం ఏర్పడలేదని భావిస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్ తనపై ఎలాంటి ప్రభావం చూపాయనే విషయాన్ని పక్కనపెడితే.. టెస్లా కారు గతేడాది ప్రపంచంలోనే బెస్ట్ సెల్లింగ్ కారుగా రికార్డు నెలకొల్పిందని మస్క్ చెప్పారు.కొన్నినెలల కొందట తాను మానసిక కంగుబాటుకు గురైనట్లు మస్క్ చెప్పారు. ఆ సమయంలో దాన్నుంచి బయటపడేందుకు కెటమిన్ అనే డ్రగ్‌ను వినియోగించానన్నారు. వైద్యుడి సూచన మేరకు వారానికి ఒకసారి చిన్న మొత్తంలో దాన్ని తీసుకునేవాడినని తెలిపారు. ఆయన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'రోజుకు 16 గంటలు పనిచేస్తాను. దాంతో నాపై తీవ్ర ఒత్తిడి ఉంటుంది. నేను ఎక్కువ కాలం డిప్రెషన్‌లోకి వెళితే దాని ప్రభావం టెస్లా పనితీరుపై పడుతుంది. దాన్ని అధిగమించేందుకు డాక్టర్ సూచనతో తగుమోతాదులోనే కెటమిన్ డ్రగ్ తీసుకున్నాను. అది టెస్లాకు ఎంతో ఉపయోగపడింది. ఒకవేళ ఎవరైనా కెటమిన్‌ను ఎక్కువ మోతాదులో తీసుకుంటే ఏ పనీ సక్రమంగా పూర్తి చేయలేరు' అని మస్క్ చెప్పారు.ఇదిలా ఉండగా, తాను డ్రగ్స్ తీసుకున్నట్లు మస్క్ చెప్పడం ఇది రెండోసారి. గతంలో ఓసారి డ్రగ్స్ సేవించిన విషయం నిజమేనని మస్క్ అప్పట్లోనే చెప్పారు. ఆ తర్వాత చాలాకాలంపాటు తాను డ్రగ్స్ తీసుకోలేదని స్పష్టం చేశారు. నాసా అభ్యర్థనతో టెస్లా ఆఫీసును డ్రగ్స్ రహితంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఆ అభ్యర్థన మేరకు గత మూడేళ్లుగా తాను వైద్య పరీక్షలు కూడా చేయించుకుంటున్నట్లు తెలిపారు. అయితే, ఈ మూడేళ్లలో తన శరీరంలో డ్రగ్స్ కానీ, మద్యానికి సంబంధించి ఎలాంటి ఆనవాళ్లు గుర్తించలేదన్నారు.రెండు నెలల క్రితం మస్క్ డ్రగ్స్ వినియోగంపై వాల్ స్ట్రీట్ జర్నల్ ఒక కథనాన్ని ప్రచురించింది. ప్రపంచంలో వివిధ ప్రాంతాల్లో జరిగే పార్టీల్లో మస్క్ తరచుగా పాల్గొంటూ నిషేధిత డ్రగ్స్‌ను తీసుకుంటున్నారని దానిలో పేర్కొంది. ఈ విషయంపై టెస్లా, స్పేస్ ఎక్స్ సంస్థల బోర్డు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారని తెలిపింది. దీని వల్ల మస్క్ ఆరోగ్యంతోపాటు ఆయన వ్యాపార సామ్రాజ్యంపై తీవ్ర దుష్ప్రభావం పడుతున్నదని ఆ సంస్థల డైరెక్టర్ల బోర్డు సభ్యులు చెప్పినట్లు ఆ కథనంలో ప్రచురించారు. తాజాగా డ్రగ్స్ వినియోగంపై స్వయంగా మస్క్ చెప్పడం చర్చనీయాంశంగా మారింది.

# రతన్ టాటాకు ప్రతిష్టాత్మక అవార్డు

**జనంసాక్షి:**దేశీయ పారిశ్రామిక దిగ్గజం 'రతన్ టాటా' వ్యాపార రంగంలో మాత్రమే కాకుండా.. దాతృత్వంలో కూడా తనకు తానే సాటి. ఈయన చేసిన సేవలకుగానూ ఇటీవల ప్రతిష్టాత్మకమైన 'పీవీ నరసింహారావు స్మారక అవార్డు' లభించింది. దీనికి సంబంధించిన ఫోటోలను టాటా మోటార్స్ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేసింది.భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరు మీద అందించే ఈ స్మారక పురస్కారం.. సామాజిక సంక్షేమం, మానవతా దృక్పథం పట్ల అసాధారణమైన అంకితభావాన్ని ప్రదర్శించిన వ్యక్తులకు అందిస్తారు. ఈ అవార్డు మార్చి 15న ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో రతన్ టాటా పొందారు.బిలియన్ల కొద్దీ విరాళాలు ఇచ్చిన పారిశ్రామికవేత్తల్లో రతన్ టాటా ఒకరు. టాటా ట్రస్ట్‌ల కింద వ్యక్తిగత స్థాయిలో లక్షల రూపాయల విరాళాలు అందించారు. రతన్ టాటా ఆరోగ్య సంరక్షణ, విద్య, గ్రామీణాభివృద్ధి సహా వివిధ రంగాలకు విరివిగా విరాళాలు అందించారు. కాగా తాజాగా ఈయన పెంపుడు జంతువుల కోసం రూ. 165 కోట్లు వెచ్చించి టాటా ట్రస్ట్స్ స్మాల్ యానిమల్ హాస్పిటల్ పేరుతో హాస్పిటల్ నిర్మించారు.ప్రస్తుతం రతన్ టాటా.. టాటా గ్రూప్ ఎమెరిటస్ చైర్మన్‌గా ఉన్నారు. ఇప్పటికే ఈయన భారతదేశ అత్యుత్తమ పురస్కారాలైన పద్మవిభూషణ్ (2008), పద్మభూషణ్ (2000) పొందారు. కాగా ఇప్పుడు పీవీ నరసింహారావు స్మారక అవార్డును సొంతం చేసుకున్నారు.



# విపణి

| నెక్ గుడ్ల ధరలు | ఒకటి | వంద |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 4.10 | ₹ 410 |
| వరంగల్ | ₹ 4.12 | ₹ 412 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**

హైదరాబాద్: ₹60,750 (22 క్యారెట్లు), ₹66,270 (24 క్యారెట్లు)

చెన్నై: ₹61,500 (22 క్యారెట్లు), ₹67,100 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**

హైదరాబాద్: ₹79,000

## మార్కెట్ సూచీలపై బేర్ పంజా

**జనంసాక్షి:**దేశీయ స్టాక్‌మార్కెట్లు మంగళవారం నష్టాలతో ముగిశాయి. మార్కెట్లు ముగిసే సమయానికి నిఫ్టీ 242 పాయింట్లు నష్టపోయి 21,813 వద్దకు చేరింది. సెన్సెక్స్ 736 పాయింట్లు దిగజారి 72,012 వద్దకు చేరింది.సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టైటాన్ కంపెనీ షేర్లు లాభాల్లో ట్రేడింగ్ ముగించాయి.టీసీఎస్, నెస్లే, ఇండస్‌ఇండ్ బ్యాంక్, విప్రో, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, పవర్‌గ్రిడ్, ఐటీసీ, అల్ట్రాటెక్ సిమెంట్, టెక్ మహీంద్రా, ఎల్ అండ్ టీ, హిందూస్థాన్ యూనిలీవర్, టాటా మోటార్స్ కంపెనీ షేర్లు నష్టాల్లోకి జారుకున్నాయి.వడ్డీ రేట్లపై అమెరికా ఫెడరల్ రిజర్వ్ నిర్ణయం బుధవారం రాత్రి వెలువడనుంది. దాంతో గురువారం మార్కెట్‌లు స్పందించనున్నాయి.

## రూ.1,600 కోట్లు వేతనం..

### సమర్థించుకున్న సీఈవో



జనంసాక్షి:టెక్ కంపెనీలు కాస్ట్‌కటింగ్ పేరిట భారీగా వేతనాలు అందుకుంటున్న ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటిస్తుంటే కొన్ని సంస్థల సీఈవోల కు మాత్రం కోట్లల్లో వేతనాలు ఉంటు న్నాయి. దీనిపై నెట్టింట చర్చ జరుగు తోంది. తాజాగా రెడ్డిట్ సీఈవో స్టీవ్ హాఫ్‌మన్ వేతనం పట్ల చాలా విమర్శలు వచ్చాయి.దాంతో రెడ్డిట్ సీఈవో స్పందించారు. తన భారీ వేతన ప్యాకేజ్‌ను ఆయన సమర్థించుకున్నారు. దాదాపు రూ.1600 కోట్ల వేతన ప్యాకేజ్‌ను హాఫ్‌మన్ అందు కోవడంపై కోరా, ఎక్స్ వంటి పలు ప్లాట్‌ఫాంలలో యూజర్ల మధ్య హాట్ డిబేట్ సాగింది. ఇంతటి భారీ ప్యాకేజ్ అవసరమా అంటూ యూజర్లు కామెంట్ చేశారు.ఈ వివాదంపై రెడ్డిట్ సీఈవో రెడ్డిట్ వేదికగా క్యూ అండ్ ఏ సెషన్‌లో స్పందించారు. తన సామర్థ్యం ఆధారంగా రెడ్డిట్ బోర్డ్ తన వేతన ప్యాకేజ్‌ను నిర్ధారించిందని స్పష్టం చేశారు. హాఫ్‌మన్ వేతనం ఓ ప్రముఖ పబ్లిక్ కార్పొరేషన్ సీఈవో వేతనానికి దీటుగా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## రూ.1991కే విమాన ప్రయాణం

### మొదటి సర్వీస్ ప్రారంభించిన ఫ్లై91

**జనంసాక్షి:**ఫ్లై91 సంస్థ తన మొదటి విమాన సర్వీసులను ప్రారంభించింది. తాజాగా గోవాలోని మనోహర్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి సోమవారం ఉదయం గం.7.55కు విమాన సర్వీసులను మొదలు పెట్టింది.ఈ సందర్భంగా రూ.1991కే ప్రత్యేక ఛార్జీతో ప్రయాణించేలా వెసులుబాటు కల్పిస్తున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. ఫ్లై91 విమాన సర్వీసులన్నింటికీ ఈ ఆఫర్ అమలవుతుందని కంపెనీ పేర్కొంది. తొలుత గోవా, హైదరాబాద్, బెంగళూరు, సింధుదుర్గ్ మధ్య విమాన సర్వీసులను ప్రారంభించామని, ఏప్రిల్‌లో అగత్తి, జలగావ్, పుణెకు ప్రారంభించే యోచనలో ఉన్నామని కంపెనీ ప్రతినిధులు చెప్పారు.




# రష్యాకు కొత్త రాయబారి..



## నియమించిన కేంద్రం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**విదేశీ వ్యవహారాల్లో నిపుణుడైన ఇండియన్ ఫారెన్ సర్వీస్(ఐఎఫ్ఎస్) అధికారి వినయ్‌కుమార్‌ను రష్యా రాయబారిగా కేంద్ర ప్రభుత్వం నియమించింది.ఈ మేరకు మంగళవారం(మార్చ్ 19) విదేశీ వ్యవహారాల శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. 1992 బ్యాచ్ ఐఎఎస్ అధికారి అయిన వినయ్‌కుమార్ 2021 నుంచి మయన్మార్‌లలో భారత రాయబారిగా విధులు నిర్వహించారు.ప్రస్తుతం రష్యా రాయబారిగా పనిచేస్తున్న పవన్‌కుమార్ ఇటీవలే విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. సాధారణంగా మాస్కో, వాషింగ్టన్, లండన్, టోక్యో, కాన్‌బెర్రా నగరాలు భారత ఐఎఫ్ఎస్ అధికారులకు కీలక పోస్టింగ్‌లుగా భావిస్తారు. ప్రస్తుత పరిస్థితుల్లో మిత్ర దేశం రష్యాతో సంబంధాలు మరింత మెరుగుపరిచుకునేందుకు అనుభవజ్ఞుడైన వినయ్‌కుమార్‌ను నియమించినట్లు చెబుతున్నారు.

# ఎన్డీయేలోకి శిరోమణి అకాలీదళ్!

**చండీగఢ్(జనంసాక్షి):** సార్వత్రిక ఎన్నికలు బీజేపీ 400 సీట్లలో గెలిచి నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని కావాలని దూసుకు పోతోంది. ఇప్పటికే రెండు జాబితాల్లో 267 మంది అభ్యర్థులను లోకసభ ఎన్నికలకు ప్రకటించి..ప్రచారంలో సైతం స్పీడ్ పెంచింది. మరోవైపు బీజేపీ.. ఎన్డీయే కూటమి విస్తరణపై కూడా ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. పంజాబ్‌లోని శిరోమణి అకాలీదళ్(ఎస్ఏడీ) బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిలో చేరడానికి చర్చలు జరగుతున్నాయని బీజేపీ పార్టీ సీనియర్ నేత ఎస్ఎస్ చన్నీ తెలిపారు. 'ఇరుపార్టీల మధ్య చర్చలు కొనసాగు తున్నాయి. మరికొంత సమయం పడుతుంది. శిరోమణి అకాలీదళ్ మార్చి 22న కోర్ కమిటీ సమావేశం నిర్వహిం చనుంది. అనంతరం వాళ్లు నిర్ణయం తీసుకోనున్నారు. ఇరు పార్టీల మర్యాద పూర్వక సమావేశం జరగనుంది. ఇరుపార్టీల పొత్తుకు సంబంధించి బీజేపీ అధిష్టానం నిర్ణయం తీసుకుంటుంది' అని ఎస్ఎస్ చన్నీ వెల్లడించారు.శిరోమణి అకాలీ దళ్ కోర్ కమిటీ సమావేశం ఛండీగఢ్‌లో జరుగనుంది. ఎస్ఏడీ పార్టీ జనరల్ సెక్రటరీ దల్జీత్ సింగ్ చీమా తమ కోర్ కమిటీ సమావేశంలో ఎన్నికల వ్యహరిం చాల్సిన వ్యూహాలు, పొత్తులపై కీలక నిర్ణ యం తీసుకోనున్నట్లు తెలిపారు. కోర్ కమిటీలో మీటింగ్‌లో దేశం, రాష్ట్రంలోని అన్ని విషయాలపై చర్చిస్తామని తెలిపారు. అదేవిధంగా తమతో భావ సారూప్యత ఉన్న పార్టీతో పొత్తు పెట్టుకునే అవకాశం ఉన్నట్లు చెప్పకనే చెప్పారు. అయితే బీజేపీతో మళ్లీ పొత్తు విషయంలో శిరోమణి అకాలీదళ్ ముందు నుంచి వెనకడుగు వేస్తోంది. అయి తే రైతుల పంటలకు మద్దతు ధర, సిక్కు ఖైదీల విడుదల విషయంలో ఎస్ఏడీ బీజేపీని వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే.పొత్తు వ్యవహారంపై పంజాబ్ కాంగ్రెస్ నేత ప్రతాప్ సింగ్ బజ్వా స్పందిస్తూ.. శిరోమణి అకా లీదళ్ ఆసక్తికే వదిలేస్తున్నామని తెలిపారు. ఎందుకంటే వారిది రైతు సమస్యలపై పోరాడే, మత సిద్ధాంతాలతో కూడుకున్న పార్టీ అని అన్నారు. ఇక.. ఎస్ఏడీ బీజేపీతో పొత్తుపెట్టుకుంటే బీజేపీ బలపడుతుంది. కానీ.. రైతుల సమస్యలపై పోరాటం చేసే ఎస్ఏడీకి ఈ పొత్తు నష్టం కలిగిస్తుందన్నారు.

# అమెరికాలో మన రైతుబజార్లు






**జనంసాక్షి:**హాలీవుడ్ సినిమాలకు ప్రసిద్ధిగాంచిన లాస్ ఏంజిల్స్ మహానగరంలో నేను చూసిన ప్రదేశాల్లో నాకు సినిమా స్టూడియోల కన్నా కూడా బాగా నచ్చింది ఈబీ గిల్మోర్ ఫార్మర్స్ మార్కెట్.ఎందుకంటే..? నాకు వ్యవసాయ సహకార రంగంలో మూడున్నర దశాబ్దాలకుపైగా పనిచేసిన అనుభవం ఉంది. ఎర్లీబెల్ గిల్మోర్ 1934 లో ప్రారంభించిన ఈ రైతుబజారులో వ్యవసాయ సంబంధమే కాదు అన్ని వస్తువులు పిల్లల ఆటవస్తువులు, గిఫ్ట్ ఐటమ్స్ (అవీ వారి ఉత్పత్తులేనంటారు ) వంటివి కూడా దొరకడం విశేషం.రుచికరమైన ఆహార పానీయాలు అందించే రెస్టారెంట్లకు లెక్కేలేదు. ఇక్కడికి వచ్చే జనం కొనుక్కుపోయే వాటికన్నా ఇక్కడ తినేవే ఎక్కువ. నేను గమనించిందేంటంటే, అమెరికన్లు తినేదానికన్నా వృధాగా పడేసేదే ఎక్కువ. పొద్దున్నుండి రాత్రివరకు పనిచేసే ఈ మార్కెట్ మామూలు రోజుల్లోనే కిటకిట లాడుతుంది, ఇక వీకెండ్స్లో చెప్పే పని లేదు. బయటి నుండి వచ్చే యాత్రీకుల రద్దీ కూడా ఎక్కువే. హాలీవుడ్ సినిమాల వాళ్ళు కూడా తరచుగా ఈ మార్కెట్ కు వస్తుంటారన్నది మరో ఆకర్షణ.ఈ ఫార్మర్స్ మార్కెట్ ప్రత్యేకత ఉత్పత్తిదారులే ఇక్కడ స్వయంగా తమ ఉత్పత్తులు అమ్ముకోవడం , ముఖ్యంగా సేంద్రియ వ్యవసాయదారులు, అవి చౌక ధరలకు లభిస్తాయన్న వినియోగదారుల నమ్మకం. అంతేకాదు ఈ మార్కెట్‌కు సరాసరి ఫామ్ నుండి సరఫరా ఔతాయి కాబట్టి పండ్లు, కూరగాయలు తాజాగా ఉండడం. అమ్మకం దారుల మధ్య నున్న తీవ్రమైన పోటీవల్ల ఇక్కడ ఏది కొన్నా బయటి మార్కెట్ కన్నా తక్కువ ధరలకే లభిస్తాయి.అమెరికాలో ఇలాంటి ప్రదేశాల్లో ఎక్కడికి వెళ్లినా మనకు లభించే కనీస సౌకర్యాలు పార్కింగ్, రెస్ట్ రూంలు, ఈ మార్కెట్లో ఏటీఎం, టెలిఫోన్ బూత్, పోస్ట్ ఆఫీసు వంటివి కూడా ఉన్నాయి. అన్నింటికన్నా ముఖ్యం సందర్శకుల రక్షణ, ఎప్పుడు ఏ టెర్రరిస్టు ఎటునుండి వచ్చి దాడి చేస్తారోనని అమెరికా వాళ్ళు నిరంతరం జాగ్రత్తగా ఉంటుంటారు, అది ఈ మార్కెట్లో స్పష్టంగా కనబడుతుంది.ఇలాంటి రైతుల మార్కెట్లకు అమెరికాలో ఈ మధ్యకాలంలో గిరాకీ ఎక్కువ అవుతుందని అక్కడి సర్వేలు చెబుతున్నాయి. డైరెక్ట్ సేల్స్ వృద్ధి 9.6 శాతం ఉందని ఆ దేశ వ్యవసాయశాఖ వారి గణాంకాలు తెలుపుతున్నాయి. 1994 నాటికి అమెరికాలో రిజిస్టరై నడపబడుతున్న రైతుబజార్లు 1744 కాగా, 2012 నాటికి వాటి సంఖ్య 7864కు చేరింది. ఇందుకు ముఖ్య కారణం రసాయనిక ఎరువులు, పురుగు మందులతో పండించబడిన ఆహారపదార్థాలతో విసిగిపోయినవారు ఆర్గానిక్ ఫుడ్స్ కోసం రైతు బజార్ల వైపు చూస్తున్నారట, ఇలాంటి వాటికి ఎక్కువ ధర అయినా చెల్లించడానికి వారు వెనకాడడం లేదట.మన దేశంలో మన రాష్ట్రాలలో ప్రభుత్వాలు ప్రారంభించిన రైతు బజార్లలో రైతులకు బదులు దళారులు ఎక్కువగా కనిపిస్తారు. రైతులే తమ పంటలు అమ్ముకుంటారనుకుంటే అందులో కూడా సేంద్రియ, పర్యావరణ, జీవసంబంధ పంటల ఉత్పత్తులు ఎక్కువగా ఉంటాయి. దీనికితోడు వారి స్థానాల్లో మధ్య దళారులు కాస్తా దుకాణాలను కబ్జా చేయడం, ఏది పడితే అది అమ్మడం వల్ల బయటి మార్కెట్లకు వీటికి తేడా లేకుండాపోవడం.. ఇవన్నీ ఇక్కడి అనుభవాలు. మరి అమెరికాలో.. ఇలాంటి మార్కెట్లలో చాలా వసతులతో పాటు కొత్త విషయాలెన్నో ఉన్నాయి. ముందు ముందు మనం కూడా మరింత మెరుగ్గా తీర్చిదిద్దుకుందాం.

# జాతీయం అంతర్జాతీయం

## మూడు వారాల్లోగా సమాధానమివ్వండి

చేయకపోవడంతో ఆ చట్టం అమల్లోకి రాలేదని కేంద్రం నాడు న్యాయస్థానానికి వెల్లడించింది. ఈ క్రమంలోనే ఇటీవల పౌరసత్వ సవరణ నిబంధనలు-2024ను సర్కారు నోటిఫై చేయడంతో చట్టం అమలవుతోంది. దీంతో ఈ అంశం మళ్లీ కోర్టుకు చేరింది.సీఏఏ రాజ్యాంగ చట్టబద్ధతను సవాల్ చేస్తూ ఇప్పటికే దాఖలైన దాదాపు 200 పిటిషన్లపై తీర్పు వచ్చేవరకు ఆ చట్టం నిబంధనల అమలుపై స్టే విధించాలని తాజాగా పిటిషనర్లు కోరారు. వీటిపై నేడు విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం.. కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్లపై మూడు వారాల్లోగా తమ సమాధానం తెలియజేయాలని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను ఏప్రిల్ 9వ తేదీకి వాయిదా వేసింది.అయితే, అప్పటిదాకా చట్టం అమలుపై స్టే విధించాలని పిటిషనర్లు న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై ధర్మాసనం ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు. అంటే.. సీఏఏ అమలు యథావిధిగా కొనసాగనుంది. కాగా.. ఈ చట్టంతో ఏ వ్యక్తి పౌరసత్వాన్ని తొలగించబోమని విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు.

## హిందు మతమే లక్ష్యంగా ఇండియా కూటమి పనిచేస్తోంది

మోదీ అన్నారు.వృత్తిరీత్యా ఆడిటర్ అయిన రమేశ్ గతంలో తమిళనాడు రాష్ట్ర భాజపా ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. 2013 జులైలో ఆయనను నివాసంలోనే గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. ఇదే సభలో మరో భాజపా నాయకుడు కేఎన్ లక్ష్మణన్ సేవలను ప్రధాని గుర్తుచేసుకున్నారు. తమిళనాడులో పార్టీ బలపడేందుకు ఆయన ఎంతో కృషి చేశారని ప్రశంసించారు. అంతకుముందు డీఎంకే, కాంగ్రెస్‌లపై విమర్శలు చేశారు. ఇండియా కూటమి పార్టీలు మహిళలు, హిందుత్వాన్ని అవమానిస్తున్నాయని ఆరోపించారు. తమిళనాడు సహా దేశవ్యాప్తంగా ఆ కూటమిని ప్రజలు ఓడిస్తారని ప్రధాని అన్నారు.

## ఈడీ ప్రకటనపై ఆప్ తీవ్ర అభ్యంతరం

పొందడానికి కవిత, అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోదియా తదితరులు కుట్ర పన్నారని ఈడీ తమ ప్రకటనలో వెల్లడించింది. ఈ ప్రయోజనాలకు ప్రతిఫలంగా ఆ పార్టీ నేతలకు రూ.100 కోట్లు చెల్లించడంలో కవిత భాగస్వామి అయ్యారని పేర్కొం ది. ఈ సందర్భంగా ఆప్ నేతలు మనీశ్ సిసోదియా, సంజ య్‌సింగ్ అరెస్టు విషయాన్ని ఇందులో ప్రస్తావించింది. దీనిపై ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా స్పందించింది. 'గతంలోనూ ఈడీ ఇలాంటి అవాస్తవ ప్రకటనలు విడుదల చేసింది. ఈ కేసులో 500లకు పైగా సోదాలు జరిపి నా.. వేల మంది సాక్ష్యులను విచారించినా దర్యాప్తు సంస్థకు అక్రమం గా ఉన్నట్లు నిరూపించేలా ఒక్క రూపాయి కూడా లభించలేదు. చిన్న సాక్ష్యాన్ని కూడా రికవరీ చేయలేదు.అందుకే విసుగెత్తిపోయి ఇలాంటి ఆరో పణలు చేస్తోంది. తాజాగా విడుదల చేసిన ప్రకటనలో ఒక్క కొత్త విష యం లేదు. ఇవన్నీ చూస్తుంటే కేసులో తటస్థ దర్యాప్తు విధానాన్ని వది లేసి.. భాజపాకు పొలిటికల్ వింగ్‌లా ఈడీ పనిచేస్తున్నట్లు అనిపిస్తోంది.



# జేఎమ్ఎమ్‌కు సీత సోరెన్ రాజీనామా

**గంటల్లోనే బీజేపీలో పార్టీలో చేరిన శిబూసోరెన్ పెద్దకోడలు**

**జనంసాక్షి:**జార్ఖండ్ ముక్తి మోర్చా అధినేత శిబు సోరెన్ పెద్ద కోడలు సీత సోరెన్ మంగళవారం భారతీయ జనతా పార్టీలో చేరారు. జేఎంఎం పార్టీకి రాజీనామా చేసిన కొన్ని గంటల్లోనే ఆమె కాషాయ తీర్థం పుచ్చుకున్నారు.మరికొన్ని రోజుల్లో లోక్‌సభ ఎన్నికలు, వచ్చే ఏడాది జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో సీత సోరెన్ పార్టీ మార్పు చర్చనీయాంశంగా మారింది.కాగా జేఎమ్ఎమ్ నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన సీతా సోరెన్ శిబు సోరెన్ పెద్ద కుమారుడు దుర్గా సోరెన్ సతీమణి. జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ వదిన అవుతుంది. అనారోగ్యంతో దుర్గా సోరెన్ 2009లో మరణించారు. అప్పుడు ఆయన వయసు 39 ఏళ్లు. అయితే భర్త మరణానంతరం తనను, తన కుటుంబాన్ని సోరెన్ కుటుంబ సభ్యులు పక్కన పెట్టారని ఆరోపిస్తూ మంగళవారం జేఎమ్ఎమ్ పార్టీకి సీత రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. పార్టీలోని అన్ని పదవులకు, జార్ఖండ్ అసెంబ్లీలోని జామా స్థానానికి కూడా ఆమె రాజీనామా చేశారు.'కుటుంబంలోనే కాదు పార్టీలో తగిన గౌరవం దక్కడం లేదని తాను నిర్లక్ష్యానికి గురవుతున్నానని ఆరోపించారు.

# అందరినీ కలుపుకొనిపోయి అభివృద్ధికి కృషి చేస్తా

పార్టీ పెద్దల సమిష్టి నిర్ణయంతోనే నాకు పదవి వచ్చింది

కష్ట కాలంలో పని చేసిన వారందరికీ కూడా పదవులు రావాలని కోరుతున్నా..

నూతనంగా నియమితులైన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్ బ్యూరో, మార్చి 19 నంసాక్షి) ;: అందరినీ కలుపుకొనిపోయి సుడా పరిధిలో అభివృద్ధికి కృషి చేస్తానని నూతనంగా నియమితులైన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. గతంలో గిడ్డంగుల సంస్థ చైర్మన్ గా సంస్థ ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం కల్పించి పొరుగు సేవల ఉద్యోగులకు జీతాలు పెంచి వీలైనంత సహాయం చేశాము. పిసిసి అధికార ప్రతినిధిగా నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా నిరంతరం ప్రజల పక్షాన నిలబడ్డాను. మొన్నటి ఎన్నికలలో అసెంబ్లీ టికెట్ ఇవ్వకున్నా క్రమశిక్షణ గల కార్యకర్తగా పని చేసినాను అని అన్నారు.ఏఐసిసి నాయకులు నాకు సముచిత స్థానం కల్పిస్తామని మాట ఇచ్చారని అందులో భాగంగానే నాయకుల సమిష్టి నిర్ణయంతో నాకీ పదవి ఇచ్చారని అన్నారు. గతంలో పిసిసి అధికార ప్రతినిధిగా సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నా నియామకం మంత్రి పొన్నం ప్రభాకర్ వల్లే జరిగిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం అందరి సహకారం వల్లే నాకు సుడా చైర్మన్ నియామకం జరిగిందని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. గత పది సంవత్సరాలుగా అప్పటి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం చేసి పార్టీ ఇచ్చిన కార్యక్రమాలు విజయవంతం చేయడంలో పనిచేసిన వారందరికీ కూడా పదవులు రావాల్సిన అవసరం ఉందని అన్నారు. సహకరించిన మీడియా మిత్రులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ విలేఖరుల సమావేశంలో కొరివి అరుణ్ కుమార్, శ్రవణ్ నాయక్, అఖిల్, కుర్ర పోచయ్య, స్వామిగౌడ్, బొబ్బిలి విక్టర్, ఖంరొద్దిన్, దన్న సింగ్, నెల్లి నరేష్, మెతుకు కాంతయ్య, షేహెన్ష, పొరండ్ల రమేష్, గంగుల దిలీప్, కీర్తి కుమార్, షబానా మహమ్మద్, ముల్కల కవిత, జ్యోతి రెడ్డి, ఊరడి లత, మేరాజ్, మహాలక్ష్మి, తిరుమల, మహమ్మద్ భారీ, బషీర్, అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.






# నిబంధనల ప్రకారం నడుచుకోండి

ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడండి..

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి..

ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష...

కరీంనగర్ బ్యూరో, మార్చి 19 (జనంసాక్షి) : పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అధికారులంతా నిబంధనల ప్రకారం పని చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మంగళవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వివిధ పథకాల కింద ఇప్పటికే ప్రారంభించిన అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనుల పై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అత్యవసరమైన విద్యుత్తు, తాగునీటి సరఫరాకు ఆటంకం కలుగకుండా చూడాలని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో అధికారులు అంతా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నిబంధనలు పాటించకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రారంభించిన అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, సిపిఓ కొమురయ్య, ఇరిగేషన్ ఎస్ఈ శివకుమార్, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్, కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.



## ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకు కృషి

పెద్దపల్లి,మార్చి 19(జనంసాక్షి) : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షుడు కొమ్ము అభిలాష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పెద్దపల్లి ఆర్యవైశ్య భవన్ లో మంగళవారం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో అభిలాష్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో పెద్దపల్లి నుండి కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన అభ్యర్థి గెలుపు కోసం ఎన్ ఎస్ యు ఐ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని కోరారు. విద్యార్థుల పక్షాన ఎల్లప్పుడూ పోరాడుతామని, రాజకీయాల్లోకి రావాలని ఆకాంక్షించే యువతకు కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘం వేదిక అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మడి భరత్ కుమార్, పెనుకొండ ప్రణయ్, ఈగ ప్రశాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శులు పిరంగి రాజు, బొంకూరి పవన్, యమ అనిల్ కుమార్, జిల్లా కార్యదర్శి మదాసి శ్రవణ్ రాజ్, పెద్దపల్లి, మంథని నియోజకవర్గాల అధ్యక్షులు కోదాది ప్రశాంత్ రాజ్, కక్కెర్ల సందీప్, మంథని, రామగిరి మండలాల అధ్యక్షులు శైలెందర్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా జరుగుతున్న 10వ తరగతి పరీక్షలు

అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్

పెద్దపల్లి,మార్చి 19(జనంసాక్షి) : జిల్లాలో 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ తెలిపారు. మంగళవారం అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ ఎన్టిపిసి లోని సెయింట్ క్లైర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ, 10వ తరగతి పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరుగుతున్నా యని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని అన్నారు. పరీక్షా కేంద్రాలలో సెల్ ఫోన్ అనుమతి లేదని, ఎట్టి పరిస్థితులలో ఎవరు కూడా సెల్ ఫోన్ తీసుకుని వెళ్లకుండా పకడ్బందీగా చెక్ చేయాలని సంభందిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో 45 పరీక్షా కేంద్రాలలో నిర్వహించిన పదవ తరగతి హిందీ పరీక్షలో 7,712 మంది విద్యార్థులకు గాను 7,705 మంది విద్యార్థులు హాజరు కాగా, 99.9 శాతం హాజరు నమోదు అయినట్లు తెలిపారు. 10వ తరగతి పరీక్షల నిర్వహణ తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, మంగళవారం నాడు 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 16 పరీక్ష కేంద్రాలను, జిల్లా స్థాయి పరిశీలకులు 6 పరీక్ష కేంద్రాలను, డి.ఈ.ఓ. 7 పరీక్షా కేంద్రాలను సందర్శించారనీ, మాల్ ప్రాక్టీస్ కేసులు బుక్ కాలేదని, హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో సంబంధిత అధికారులు, తదితరులు అదనపు కలెక్టర్ వెంట ఉన్నారు.

# కరీంనగర్లో దొరికిన డబ్బు తనది కాదని వినోద్ రావు ప్రమాణానికి సిద్ధమా..

బీఆర్ఎస్ పార్టీ కథ ముగిసింది..

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చి 19 (జనంసాక్షి): కరీంనగర్ ప్రతిభ మల్టీప్లెక్స్ లో దొరికిన డబ్బు తనది కాదని వినోద్ రావు ప్రమాణానికి సిద్ధమా..రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ కథ ముగిసిందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కథలాపూర్ మండల కేంద్రంలో అయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నేత వినోద్ రావు పార్టీ ఫిరాయింపులపై నంగనాచి కబుర్లు చెబుతున్నాడన్నారు. పదేళ్ల పాటు కేసీఆర్ విచ్చలవిడిగా ఎమ్మెల్యేలను ప్రలోభ పెట్టినప్పుడు వినోద్ రావుకు అవి కనిపించలేదని ప్రశ్నించారు.కేసీఆర్ కు సన్నిహితుడైన వినోద్ రావుకు పార్టీ ఫిరాయింపులు రాజ్యాంగ వ్యతిరేకమని తెలియదా అప్పుడు ఆయనకెందుకు చెప్పలేదన్నారు.న్యాయవాది అయిన వినోద్ రావుకు రాజ్యాంగం గురించి పదేళ్లలో తెలియరాలేదని,అనర్హత పిటిషన్లపైన త్వరగా నిర్ణయం తీసుకోవాలని గత స్పీకర్లు మధుసూదనాచారి, పోచారం శ్రీనివాస్ రెడ్డి కి వినోద్ రావు ఎందుకు సలహా ఇవ్వలేదన్నారు.ఐదేళ్ల పాటు అనర్హత పిటిషన్లపైన స్పీకర్లు తేల్చకపోతే ఆయన కనీసం ఒక్క మాటైనా ఎందుకు మాట్లాడలేదన్నారు.రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న కల్వకుంట్ల కుటుంబాన్ని ఎందుకు నిలదీయలేదనీ,కాంగ్రెస్ పార్టీకి నీతులు చెబుతున్న వినోద్ రావు కేసీఆర్ కు ఆ నీతులు ఎందుకు చెప్పలేదన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చుతామని బీఆర్ఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలను వినోద్ రావు ఎందుకు ఖండించలేదనీ,కేటీఆర్, కడియం శ్రీహరి లాంటి వారు నోటికొచ్చినట్లు మాట్లాడుతుంటే తమరు ఏం చేశారన్నారు.లోపల కుట్రలు చేస్తు బయటకు వినోద్ రావు సుద్దపూస కబుర్లు చెబుతున్నాడని బీజేపీ, బీఆర్ఎస్ కలిసి మా ప్రభుత్వంపైన కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు.గతంలో కేటీఆర్,హరీష్ రావు మాదిరి ఎమ్మెల్యేల ఇళ్లకు వెళ్లి మేం ప్రలోభ పెట్టడం లేదనీ,కేసీఆర్ నాయకత్వంలో పని చేయడం ఇష్టం లేకనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మా వైపు చూస్తున్నారన్నారు.బీఆర్ఎస్ కథ ముగిసిందని వారికి అర్థమైందని,ఎంపీ ఎన్నికల తర్వాత మీ పార్టీ కనిపించదని,కరీంనగర్ లో ప్రజాబలంతో గెలవలేమని వినోద్ రావు డబ్బు సంచులు దింపారనీ డబ్బులు పట్టుబడటంతో నాకేం సంబంధమని బుకాయిస్తున్నాడనీ,ప్రతిమ మల్టీ ప్లెక్స్ లో దొరికిన డబ్బు తో నాకేం సంబంధం లేదని వేములవాడ రాజన్న ఆలయంలో ప్రమాణం చేయాలన్నారు.వినోద్ రావు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ కరీంనగర్ ఎంపీ స్థానంలో కాంగ్రెస్ జెండా ఎగరేస్తమన్నారు.

# కమీషనరేట్ స్థాయి నేర సమీక్ష సమావేశం నిర్వహణ

ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేయాలి..

కమిషనరేట్ పోలీస్ అధికారులందరికీ పలు కీలక సూచనలు

చేసిన కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి..




కరీంనగర్ బ్యూరో, మార్చి 19 (జనంసాక్షి) : కరీంనగర్ కమీషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలు నందు మంగళవారం నాడు కమిషనరేటులోని అన్ని విభాగాల అధికారులు, పోలీస్ స్టేషన్ ల ఎస్హెచ్ఓ లతో కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి రానున్న లోక్ సభ ఎన్నికల నిర్వహణతో పాటుగా, నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ... అధికారులందరికీ పలు కీలక సూచనలు చేసారు.

సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున 05 అంతర జిల్లా చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేశామని వాటిల్లో వుండే సిబ్బందికి అప్రమత్తంగా ఉండాలన్నారు. వారికి మౌలిక వసతులైన త్రాగునీరు, రాత్రి సమయాల్లో సిబ్బంది కనిపించేలా లైటింగ్, రోడ్డు పై వచ్చే వాహన దారులకు కనిపించేలా రిఫ్లెక్టింగ్ జాకెట్లు ధరించి విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. చెక్ పోస్టులు పనితీరుపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలన్నారు. చెక్ పోస్టుల వద్ద వాహన తనిఖీలు క్షుణ్ణంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే సంఘ విద్రోహ వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే బైండ్ ఓవర్ కాబడి గడువు ముగిసిన వారిని తిరిగి బైండ్ ఓవర్ చేయాలన్నారు. ఫ్లాగ్ మార్చ్ సమయాల్లో ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే జరిగే పరిణామాలను వివరించే సమావేశాల్లో ఆయా ప్రాంతాల్లో వుండే ట్రబుల్ మొంగెర్స్ ని ఉండేలా చూసుకోవాలన్నారు. పలు రాజకీయ పార్టీలు నిర్వహించే ప్రచార సమావేశాల పై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని ముఖ్యంగా వారి సమావేశం నిర్వహించుకునే సమయం , ర్యాలీ వెళ్లే మార్గం , ఎంతమందితో నిర్వహిస్తున్నారనే సమాచారం తెలుసుకొని తదనుగుణంగా ఎటువంటి గొడవలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలన్నిటిని సంబంధిత స్టేషన్ల అధికారులు స్వయంగా పరిశీలించాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే దృష్టికి తీసుకురావాలన్నారు.

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి..

కమీషనరేట్ వ్యాప్తంగా పోలీస్ స్టేషన్ ల వారీగా పెండింగ్ లో వున్న కేసుల వివరాలు , అందుకు గల కారణాలను తెలుసుకున్నారు. త్వరితగతిన కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వారెంట్లను ముఖ్యంగా భౌతిక నేరాలకు సంబందించిన వాటిని అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నియమావళి అమలుకు పటిష్ట చర్యలు చేపట్టాలని , అధికారులందరికీ అవగాహనా కల్పించారు. ఎటువంటి ఉల్లంఘనైనాసరే సంబంధిత సెక్షన్ల ఆధారంగా కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో అడిషనల్ డీసీపీ శాంతి భద్రతలు ఏ లక్ష్మీ నారాయణ, ఏసీపీ లు నరేందర్, వెంకటరమణ, శ్రీనివాస్, శ్రీనివాస్ (ఎస్ బి ), మాధవి, విజయ్ కుమార్ లతో పాటుగా ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## జాతీయ రహదారి నిర్మాణానికి భూ సర్వే ప్రక్రియ పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- భూ సేకరణ ప్రతిపాదనల రూపకల్పనపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



పెద్దపల్లి,మార్చి 19(జనంసాక్షి) : వరంగల్ -మంచిర్యాల మధ్య 4 లైన్ల గ్రీన్ ఫీల్డ్ కారిడార్ జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ చేపట్టుటకు భూ సర్వే నిర్వహించి శనివారం లోగా సంబంధిత నివేదికలుసమర్పించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టర్ తన క్యాంప్ కార్యాలయంలో మంచిర్యాల-వరంగల్ జాతీయ రహదారి భూ సేకరణ సర్వే ప్రతిపాదనల రూపకల్పనపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, వరంగల్-మంచిర్యాల మధ్య 4 వరుసల గ్రీన్ కారిడార్ జాతీయ రహదారి కోసం పెద్దపల్లి జిల్లాలోని మంథని, రామగిరి, ముత్తారం మండలాల్లో అవసరమైన భూ సేకరణ చేపట్టుటకు సర్వే చేసి ప్రతిపాదనలను తయారు చేయాలని కలెక్టర్ సూచించారు.రోడ్లు, భవనాల శాఖ, అటవీ శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, మిషన్ భగీరథ ఇంట్రా, ఉద్యానవన శాఖ అధికారులు జాతీయ రహదారి నిర్మించడం వల్ల ఆయా శాఖల పరిధిలో కలిగే నష్టాలకు, వాటి పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలు, అదే విధంగా సేకరించాల్సిన భూమి , రైతులకు చెల్లించాల్సిన నష్టపరిహారం, తదితర అంశాలపై సంపూర్ణ నివేదిక రూపొందించాలని అన్నారు.జాతీయ రహదారి నిర్మాణానికి భూ సేకరణకు సంబంధించి భూ సర్వేను అధికారులు కట్టుదిట్టంగా పూర్తి చేయాలని, భూ సేకరణ చట్టం ప్రకారం రైతులకు తప్పనిసరిగా నష్టపరిహారం అందుతుందని, ప్రభుత్వం ప్రకటించే పరిహారం పట్ల రైతులకు సంతృప్తి కలగని నేపథ్యంలో వారు అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉంటుందని, రైతులకు నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని భరోసా కల్పిస్తూ భూ సర్వే ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో మంథని రెవెన్యూ డివిజన్ అధికారి హనుమా నాయక్, జిల్లా అటవీ శాఖ అధికారి శివయ్య, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి, ఆర్.డబ్ల్యు.ఎస్.,ఆర్.అండ్ బి., సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవ అవార్డు అందుకున్న మాదారి స్వామి



ఆర్మూర్, మార్చి19 (జనంసాక్షి): రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో ఒకేషనల్ ఎక్సెంట్ సర్వీస్ అవార్డ్స్ లో భాగంగా ఆర్మూర్ పోలీస్ హెూమ్ గార్డ్ మాదారి స్వామి సన్మానం తో పాటు ఉత్తమ సేవా అవార్డును అందుకున్నారు. స్వామి బాయ్ బ్లడ్ ఫౌండేషన్ ను స్థాపించి ఎంతోమందికి రక్తాన్ని అందించి రక్తదానం చేస్తూ బ్లడ్ డోనర్ల ద్వారా ప్రజల ప్రాణాల్ని రక్షిస్తున్న మాదారి స్వామిని శాలువాతో సత్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏ సీపీ బస్వా రెడ్డి,సిఐ రవికుమార్, ఎంఈఓ రాజ గంగారాం, పిడిజి హనుమంత్ రెడ్డి,అధ్యక్షులు పట్వారి గోపికృష్ణ, కార్యదర్శి పట్వారీ తులసిచే ఉత్తమ సేవ పురస్కారం ఇంటర్నేషనల్ సంస్థ ద్వారా మాదారి స్వామికి అందించడం జరిగింది. సేవలు ఇలాగే కొనసాగించాలని అందరికి స్ఫూర్తిగా నిలవాలని వారు ఆకాంక్షించారు.

# విద్యార్థులు మంచి మార్కులు సాధించాలి

- పాఠశాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి
- పిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి





హుజురాబాద్, మార్చి, 19 ( జనంసాక్షి) : 10వ తరగతి విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాస్తూ మంచి మార్కులు సాధించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. మంగళవారం హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరును పరిశీలించారు. ఎంతమంది పరీక్ష రాస్తున్నారు.. ఎందరు హాజరయ్యారు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని పరీక్షల చీఫ్ సూపరిండెంట్ ను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎండాకాలం నేపథ్యంలో పరీక్ష రాసిన తర్వాత విద్యార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు నీరసం నుంచి ఉపశమనం కలుగుతుందని, బలం చేకూరుతుందని పేర్కొన్నారు.పరీక్ష కేంద్రంలో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని, టాయిలెట్ల ు ఎప్పటి కప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. అలాగే సీసీ కెమెరాల పనితీరును కలెక్టర్ పరిశీలించారు. పరీక్ష జరిగే సమయంలో అధికారులు అంతా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఆర్డీవో రమేష్ బాబు, తహసిల్దార్ విజయ్ కుమార్, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరిండెంట్ శోభారాణి, డిఓ సత్యప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## అప్పుడూ.. ఇప్పుడూ షారుక్ చెప్పిందదే..!



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 17వ సీజన్‌లో గౌతం గంభీర్ మెంటార్‌గా కొత్త సవాల్ ఎదుర్కోనున్నాడు. కెప్టెన్‌గా రెండు కప్‌లు అందించిన కోల్‌కతా నైట్ రైడర్స్‌కు గౌతీ ఈసారి మెంటార్‌గా వ్యవహరిస్తున్నాడు. 17వ సీజన్‌కు మరో మూడు రోజులు ఉండనగా ఈ లెజెండరీ ఆటగాడు కోల్‌కతాకు ఆడిన రోజుల్ని గుర్తు చేసుకున్నాడు. 'కోల్‌కతాను నేను విజయవంతైన జట్టును చేయలేదు. కోల్‌కతానే నన్ను విజేతను చేసింది. నన్ను ఒక నాయకుడిని చేసింది' అని గౌతీ వెల్లడించాడు. అంతేకాదు ఫ్రాంచైజీ సహ యజమాని షారుక్ ఖాన్ తనతో చెప్పిన మాటల్ని కూడా అతడు పంచుకున్నాడు. 'నన్ను హ్యాండిల్ చేయడం చాలా కష్టం. అయితే.. నాపై నమ్మకంగా బాధ్యతలు అప్పగించిన షారుఖ్ ఖాన్, మైసోర్ (కోల్‌కతా మేనేజింగ్ డైరెక్టర్)లకు చాలా ధన్యవాదాలు. 2012లో కెప్టెన్‌గా ఎంపికైనప్పుడు.. ఇప్పుడు మెంటార్‌గా రాగానే బాద్ షా నాతో ఒకటే చెప్పాడు. ఇది నీ ఫ్రాంచైజీ. దీన్ని నిలబెడుతావా? ముక్కలు చేస్తావా? అనేది నీ చేతుల్లోనే ఉంది' అని అన్నాడు అని గంభీర్ తెలిపాడు.

కోల్‌కతా మాజీ కెప్టెన్ అయిన గౌతీ.. ఆ జట్టును రెండు సార్లు చాంపియన్‌గా నిలిపాడు. ఈ విధ్వంసక ఓపెనర్ సారథ్యంలో కోల్‌కతా 2012, 2014లో ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడింది. అతడు ఐపీఎల్ 17వ సీజన్ వేలానికి ముందు సొంత గూటికి చేరాడు. 16వ సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ మెంటార్‌గా ఉన్న గంభీర్ కోల్‌కతా మెంటార్‌గా బాధ్యతలు చేపట్టాడు. గంభీర్ తర్వాత ప్యాట్ కమిన్స్, ఇయాన్ మోర్గాన్, శ్రేయాస్ అయ్యర్, నితీశ్ రానా.. ఇలా కెప్టెన్లు మారారు. కానీ, కోల్‌కతా రాత మారలేదు. దాంతో, కోల్‌కతా యాజమాన్యం మళ్లీ గంభీర్‌ను సంప్రతించింది. పదహారు సీజన్లుగా ఫ్యాన్స్‌ను అలరిస్తున్న ఐపీఎల్ మార్చి 22న షురూ కానుంది. కోల్‌కతా తమ తొలి మ్యాచ్‌లో మార్చి 23న సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను ఢీకొననుంది.

## 12 భాషల్లో ప్రసారాలు

**ఐపీఎల్‌ను వినిపించేది కామెంటేటర్స్ లిస్ట్ రిలీజ్ చేసిన జియో**

త్వరలో మొదలుకాబోయే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ సీజన్ డిజిటల్ ప్రసారాలను జియో ఉచితంగా అందిస్తున్న విషయం తెలిసిందే. అత్యాధునిక టెక్నాలజీతో, సరికొత్త హంగులతో అభిమానులకు ఐపీఎల్ మొబైల్ ప్రసారాలతో మరింత ఉత్తేజపరిచేందుకు గాను జియో అన్ని ఏర్పాట్లనూ పూర్తిచేసింది. తాజాగా జియో.. 12 భాషలకు చెందిన కామెంటేటర్స్ లిస్ట్‌ను విడుదల చేసింది. ఇంగ్లీష్, హిందీతో పాటు ప్రాంతీయ భాషల్లోనూ జియో ఈ ప్రసారాలను ఉచితంగానే అందిస్తోంది.

ఇంగ్లీష్, హిందీతో పాటు గుజరాతి, భోజ్‌పురి, బెంగాలీ, హర్యాన్వి, మలయాళం, కన్నడ, తమిళం, తెలుగు, పంజాబిలలో ప్రసారాలను అందించనుంది. ఇంగ్లీష్ కామెంట్రీని దిగ్గజ క్రికెటర్లు క్రిస్ గేల్, ఏబీ డివిలియర్స్, షేన్ వాట్సన్, ఇయాన్ మోర్గాన్, బ్రెట్ లీ అనిల్ కుంబ్లే, రాబిన్ ఊతప్ప, గ్రేమ్ స్మిత్, స్కాట్ స్టైరిస్‌లు అందించనున్నారు. హిందీ కామెంట్రీని జహీర్ ఖాన్, సురేశ్ రైనా, పార్థీవ్ పటేల్, ఆర్‌పీ సింగ్, ప్రజ్ఞాన్ ఓజా, ఆకాశ్ చోప్రా వంటి మాజీలు చెప్పనున్నారు. వీరేంద్ర సెహ్వాగ్ హర్యానా భాషలో కామెంట్రీ చెప్పనుండటం విశేషం.

దక్షిణాది భాషల్లో ముఖ్యంగా తెలుగులో భారత టెస్టు క్రికెటర్ హనుమా విహారితో పాటు మాజీ క్రికెటర్ వెంకటపతి రాజు, అక్షత్ రెడ్డి, అశిశ్ రెడ్డి, సందీప్ బవనక, కళ్యాణ్ కొల్లారపు, ఆర్‌జే హేమంత్, ప్రత్యూష, ఆర్‌జే కౌశిక్, సునితా ఆనంద్‌లు కామెంట్రీ వినిపించనున్నారు.

ఇక ఐపీఎల్ టీవీ పార్ట్‌నర్ అయిన స్టార్ కూడా భారీ కామెంటేటర్స్ లిస్ట్‌ను మూడు రోజుల క్రితమే ప్రకటించింది. స్టార్ కూడా ఇంగ్లీష్, హిందీ, తమిళ్, తెలుగు, కన్నడ, మరాఠీ, మలయాళం, గుజరాతి, బంగ్లా (బెంగాళి) భాషల్లో ప్రసారాలను అందించనుంది. తెలుగులో అంబటి రాయుడు, మిథాలీ రాజ్, ఎమ్మెస్కే ప్రసాద్, వేణుగోపాల్ రావు, టి. సుమన్, కళ్యాణ్ కృష్ణ, జ్ఞానేశ్వర్‌రావు, రాకేశ్ దేవ రెడ్డి, డానియల్ మనోహర్, శశికాంత్ ఆవులపల్లి, రవి రక్లీ, ఆనంద్ శ్రీ కృష్ణ, వింధ్యా మేడపాటి, గీతా భగత్‌లు ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. భారత మాజీ క్రికెటర్ నవజ్యోత్ సింగ్ సిద్ధూ స్టార్ స్పోర్ట్స్‌లో కామెంట్రీ చెప్పనుండటం గమనార్హం.

## శాంతించని ముంబై ఫ్యాన్స్

**ట్రెండింగ్‌లో 'రిప్‌హార్దిక్ పాండ్యా' హ్యాష్‌ట్యాగ్**



ఐపీఎల్ 17వ సీజన్‌కు మరో మూడు రోజులే ఉంది. అయినా సరే ముంబై ఇండియన్స్ కొత్త కెప్టెన్ హార్దిక్ పాండ్యా అభిమానుల ఆగ్రహానికి గురవుతూనే ఉన్నాడు. సోషల్‌మీడియాలో ముంబై ఫ్యాన్స్ అతడిని విపరీతంగా ట్రోల్ చేస్తున్నారు. సోమవారం పాండ్యా, హెడ్‌కోచ్ మార్క్ బౌచర్ ప్రెస్ కాన్ఫరెన్స్ అనంతరం ముంబై ఫ్యాన్స్ ఆగ్రహం తారా స్థాయికి చేరింది. రోహిత్‌తో మాట్లాడే సమయమే దొరకలేదని పాండ్యా చెప్పడంతో అగ్నికి ఆజ్యం పోసినట్టు అయింది. అప్పటికే రోహిత్‌ను కెప్టెన్‌గా తప్పించడంపై గుర్రుగా ఉన్న ఫ్యాన్స్ సోషల్‌మీడియాలో పాండ్యాపై దుమ్మెత్తిపోస్తున్నారు. ఫ్రాంచైజీకి ఐదు ట్రోఫీలు కట్టబెట్టిన రోహిత్‌ను కాదని, పాండ్యాను సారథిగా ఎంపిక చేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతటితో ఊరుకోకుండా 'రిప్‌హార్దిక్‌పాండ్యా' అంటూ పోస్టులు పెడుతున్నారు. దాంతో, రిప్‌హార్దిక్‌పాండ్యా హ్యాష్‌ట్యాగ్ నెట్టింటట్రెండ్ అవుతోంది.



## సన్ రైజర్స్‌కు భారీ షాక్!

**ఫస్ట్ షెడ్యూల్ మ్యాచ్‌లకు స్టార్ స్పిన్నర్ ఔట్**

ఐపీఎల్ - 17లో సన్ రైజర్స్ హైదరాబాద్ మెరుపుల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఆరెంజ్ ఆర్మీ ఫ్యాన్స్‌కు భారీ షాక్. టీ20 స్పెషలిస్టు బౌలర్, శ్రీలంకకు చెందిన వనిందు హసరంగ ఈ సీజన్ తొలి షెడ్యూల్ (మార్చి 22 నుంచి ఏప్రిల్ 7 దాకా) మిస్ అవనున్నాడు. ఈ షెడ్యూల్‌లో ఎస్‌ఆర్‌హెచ్.. నాలుగు మ్యాచ్‌లు ఆడనుంది. ఈ నాలుగు మ్యాచ్‌లకూ హసరంగ దూరం కానున్నాడు. ఈ సీజన్‌కు ముందు నిర్వహించిన వేలంలో సన్ రైజర్స్.. అతడిని రూ. 1.5 కోట్లకు దక్కించుకుంది. ఎందుకు..? హసరంగ ఫస్ట్ షెడ్యూల్‌కు దూరమవడానికి ప్రధాన కారణం అతడు జాతీయ జట్టు తరపున ఆడుతుండటమే. పూర్తిగా పరిమిత ఓవర్ల క్రికెట్‌కే ప్రాధాన్యమిచ్చిన హసరంగ గతంలో టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించాడు. కానీ తాజాగా బంగ్లాదేశ్ టూర్‌లో ఉన్న అతడు.. టెస్టు రిటైర్మెంట్ వెనక్కి తీసుకున్నాడు. అదీగాక బంగ్లాదేశ్‌తో ఆడనున్న టెస్టు సిరీస్‌లో భాగంగా తొలి టెస్టులో అతడు సభ్యుడిగా ఉన్నాడు.

మార్చి 22 నుంచి సిల్హెట్ వేదికగా మొదటి టెస్టు ఆడనుండగా మార్చి 30 నుంచి రెండో టెస్టు జరుగనుంది. ఏప్రిల్ 03 దాకా రెండో టెస్టు జరుగనుంది. ఇక ఐపీఎల్‌లో సన్ రైజర్స్.. మార్చి 23న తొలి మ్యాచ్ ఆడనుండగా 27, 30న తర్వాత మ్యాచ్‌లు ఆడుతుంది. ఫస్ట్ షెడ్యూల్‌లో భాగంగా ఆఖరి మ్యాచ్ ఏప్రిల్ 05న ఆడాల్సి ఉంది. ఒకవేళ బంగ్లాదేశ్‌తో రెండో టెస్టు గనక త్వరగా ముగిసినా అతడు ఏప్రిల్ 05 న జరిగే మ్యాచ్‌కు అందుబాటులో ఉండే అవకాశముంటుంది. బంగ్లాదేశ్‌తో టెస్టులకు శ్రీలంక జట్టు : ధనంజయ డిసిల్వ, కుశాల్ మెండిస్, దిముత్ కరుణరత్నె, నిషాన్ మధుశంక, ఏంజెలో మాథ్యూస్, దినేశ్ చండిమాల్, సదీర సమరవిక్రమ, కమిందు మెండిస్, లాహిరు ఉదర, వనిందు హసరంగ, ప్రభాత్ జయసూర్య, రమేష్ మెండిస్, నిషాన్ పెరిస్, కసున్ రజిత, విశ్వ ఫెర్నాండో, లాహిరు కుమార, చమీక గుణశేఖర

## నిన్న గాయం.. నేడు మాయం..!

**సీఎస్కే క్యాంప్‌లో చేరిన బంగ్లాదేశ్ పేసర్**

గడిచిన నెల రోజుల్లో రెండుసార్లు గాయపడ్డ బంగ్లాదేశ్ స్టార్ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్.. వాటిని లెక్కచేయకుండా ఐపీఎల్ ఆడేందుకు చెన్నైకి వచ్చేశాడు. కొద్దిరోజుల క్రితమే బంగ్లాదేశ్‌లో ముగిసిన బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ (బీపీఎల్)లో తలకు గాయమైన ముస్తాఫిజుర్.. సోమవారం శ్రీలంకతో ముగిసిన మూడో వన్డేలో తొడ కండరాల



గాయంతో మ్యాచ్ నుంచి తప్పుకున్నాడు. నిన్న అతడు కాలిగాయం తట్టుకోలేక ఫీల్డ్ లోనే పడిపోవడంతో ముస్తాఫిజుర్‌ను స్ట్రెచర్ మీద డ్రెస్సింగ్ రూమ్‌కు తీసుకెళ్లాల్సి వచ్చింది. నిన్న గాయంతో విలవిల్లాడిన అతడు.. నేడు చెన్నై క్యాంప్‌లో చేరడం గమనార్హం. బీపీఎల్‌లో ముస్తాఫిజుర్.. ప్రాక్టీస్ చేస్తుండగా తలకు గాయమై సుమారు వారం రోజుల పాటు ఈ లీగ్‌కు దూరమయ్యాడు. అయితే స్వదేశంలో శ్రీలంకతో జరిగిన పరిమిత ఓవర్ల సిరీస్ నాటికి కోలుకున్న అతడు టీ20లతో పాటు వన్డే సిరీస్ కూడా ఆడాడు. సోమవారం గాయంతో అసలు ముస్తాఫిజుర్ ఐపీఎల్ ఆరంభం నాటికి కోలుకుంటాడా..? చెన్నైకి మరో షాక్ తప్పదా..? అన్న అనుమానాలు వినిపించాయి. కానీ మంగళవారం ఉదయం అతడు చెన్నైలో ల్యాండ్ అవడమే గాక టీమ్‌తో కలిశాడు.



## మంచు లక్ష్మి ఫాంటసీ మూవీ ఆదిపర్వం

మంచు లక్ష్మి ప్రధాన పాత్రలో నటించిన సోషియో ఫాంటసీ మల్టీ లింగ్వల్ ఫిలిం ఆదిపర్వం చిత్రానికి సంజీవ్ మేగోటి దర్శకుడు. రావుల వెంకటేశ్వర్ రావు సమర్పణలో అన్వికా ఆర్ట్స్, ఎ.ఐ ఎంటర్‌టైన్మెంట్స్ సంయుక్త నిర్మాణంలో ఐదు భాషల్లో ఈ సినిమా రూపుదిద్దుకుంది. ఈ చిత్రం 1974 నుంచి 1992 మధ్య జరిగే పీరియాడిక్ డ్రామాగా తెరకెక్కింది. సోమవారం ఐదు భాషల్లో ట్రైలర్ విడుదల చేశారు. తెలంగాణ ఎఫ్.డి.సి ఛైర్మన్ ఎన్. గిరిధర్ చేతుల మీదుగా ఆదిపర్వం తెలుగు ట్రైలర్ విడుదలైంది. జడ్చర్ల ఎమ్మెల్యే జె అనిరుధ్ రెడ్డి తమిళ ట్రైలర్, ప్రముఖ దర్శకులు నీలకంఠ కన్నడ ట్రైలర్, ప్రముఖ రియల్టర్ శిల్పా ప్రతాప్ రెడ్డి మలయాళ ట్రైలర్, చిత్ర సమర్పకులు రావుల వెంకటేశ్వర్ రావు హిందీ ట్రైలర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్న కుమార్, బిల్డర్ కైపా ప్రతాప్ రెడ్డి, నటీనటులు ఢిల్లీ రాజేశ్వరి, సత్య ప్రకాష్, శివ కంఠమనేని, వెంకట్ కిరణ్, జెమినీ సురేష్, ఆదిత్య ఓం, శ్రీజిత ఘోష్, సీనియర్ జర్నలిస్టులు ప్రభు, ఆర్.డి.ఎస్ ప్రకాష్, సినిమాటోగ్రాఫర్ ఎస్.ఎస్. హరీష్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత ఘంటా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అతిథులంతా సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. లక్ష్మి మంచు మాట్లాడుతూ.. 'నాకు సంజీవ్ గారు కథ చెప్పినప్పుడు ఇంత పెద్ద సినిమా తక్కువ సమయంలో ఎలా చేస్తారని అనుకున్నా. పోస్టర్ చూస్తుంటే నేను ఇన్ని క్యారెక్టర్లు చేశానా అనిపిస్తుంది. నవ రసాలు, అన్ని రకాల ఎమోషన్స్ ఈ సినిమాలో ఉన్నాయి. అందరికీ ఈ సినిమా నచ్చుతుంది. మా దర్శకుడు చాలా స్వీట్ పర్సన్. మా నిర్మాతలు కోరుకున్న దాని కంటే ఎక్కువ విజయం సాధించాలని కోరుతున్నా' అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓ అభిమాని మంచు లక్ష్మికి పాదాభివందనం చేయగా పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన అభిమానులు మంచు లక్ష్మిని గజమాలతో సత్కరించారు. దర్శకుడు సంజీవ్ మేగోటి మాట్లాడుతూ.. 'మంచు లక్ష్మి గారి ద్వారా మీరు స్టార్ డైరెక్టర్ కాబోతున్నారని 'ఆదిపర్వం' పోస్టర్ చూసి చాలామంది చెప్పారని అది నాకు చాలా సంతోషంగా అనిపించిందని, అవార్డు వచ్చినంత ఆనందం వేసిందన్నారు. ఈ మూవీలో మంచు లక్ష్మి గారి విశ్వరూపం చూస్తామని.. ఆదిత్య ఓం గారిని కొత్త పాత్రలో చూస్తారన్నారు. ఎస్తర్ కీలక పాత్ర చేశారన్నారు. శ్రీజిత ఘోష్ వద్దని 99 మంది చెబితే నేను ఒక్కడినే ఆ అమ్మాయి అయితే బాగుంటుందని చెప్పా అని ఆమె 1000 శాతం న్యాయం చేసిందన్నారు. క్షేత్ర పాలకుడిగా శివ కంఠమనేని, లక్ష్మి మంచుభర్త పాత్రలో జెమిని సురేష్, థియేటర్ ఆర్టిస్ట్ వెంకట్ కిరణ్ చక్కని నటన కనబరిచారన్నారు. మొత్తంగా ఈ సినిమాలో సుమారు 400 మంది నటించారన్నారు. ఈ సినిమాకు బలం, బలగం మంచు లక్ష్మి గారని, దాదాపు 7 గెటప్స్ వేసిందన్నారు. దాదాపు 50 అడుగుల ఎత్తులో ఫైట్స్ చేశారని, ఆవిడ లేకపోతే ఈ మూవీ లేదని. ఈ మూవీకి ఇంత ప్రాముఖ్యం వచ్చేది కాదని ఇది ఆరంభం మాత్రమే' అని అన్నారు.



## శివానీ నాగరం మంచి సింగర్

అంబాజీపేట మ్యారేజి బ్యాండు' చిత్రంతో హీరోయిన్‌గా పరిచయం అయిన తెలుగమ్మాయి శివాని నాగరం. సుహాస్ హీరోగా దుశ్యంత్ కటికినేని దర్శకత్వంలో ధీరజ్ మొగిలినేని నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 2న రిలీజై మంచి విజయం దక్కించుకుంది. ఈ సినిమాలో హీరోయిన్ గా నటించిన శివాని తనదైన నటనతో..క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ తో ఆడియన్స్ మనసులని దోచేసింది. అయితే ఈ అమ్మడికి నటనలోనే కాదు..సింగర్ గా కూడా తన సినిమా ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. లేటెస్ట్‌గా శివాని నాగరం సింగర్ గా అవతారమెత్తింది. ఆరంభం అనే సినిమాలో శివాని ఓ బ్యూటిఫుల్ లవ్ సాంగ్ పాడింది. 'అమాయకంగా హడావుడేమి లేక..తార చేరుకుందా ఇలా. అయోమయంగా తలాడించులాగ, నేల మారుతుందే ఎలా..కాలానికే కొత్త రంగు పూసే, మాయతార సొంతమేగా, హోయి సంతకాలు చేసేనా..' అంటూ మంచి లవ్ ఫీల్ తో ఓ మంచి కంపోజిషన్ తో సాగుతుందీ ఈ పాట. నిజానికి ఈ పాటకు మాత్రం శివాని నాగరం వాయిస్ స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచిందని చెప్పొచ్చు. రీసెంట్?గా రిలీజ్ చేసిన ఈ పాట చాలా వినసొంపుగా ఉండటంతో పాటు లిరికల్ వీడియోలో శివాని నాగారం ఇచ్చిన పెర్ఫార్మన్స్ క్యూట్ గా తనవైపు తిప్పుకునేలా ఉంది. ఇక టాలీవుడ్ లో హీరోయిన్స్ గా రాణిస్తూనే..సింగర్స్ గా మారిన వాళ్ళు చాలానే ఉన్నారు. అందులో నిత్యామీనన్, శ్రుతి హాసన్, ఎన్టీఆర్, తమిళ హీరో శింబు, సిద్దార్థ్ సహా ఎంతోమంది అదిరిపోయే పాటలు పాడారు.మరి న్యూ టాలెంటెడ్ శివాని హీరోయిన్ గా..సింగర్ గా ముందు ముందు ఎలా ఆకట్టుకుంటుందో చూడాలి. ఆరంభం సినిమా విషయానికి వస్తే..మోహన్ భగత్, సుప్రిత సత్యనారాయణ్, భూషణ్ కల్యాణ్, రవీంద్ర విజయ్ కీ రోల్స్ ప్లే చేస్తున్న మూవీ ఆరంభం. ఈ సినిమాను ఏవీటీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై అభిషేక్ వీటీ నిర్మిస్తున్నారు.

## మహేశ్‌తో త్వరలోనే షూటింగ్ ప్రారంభం

**జపాన్ వెళ్లిన సందర్భంలో జక్కన్న వెల్లడి**

రాజమౌళి-మహేశ్‌బాబు కాంబినేషన్‌లో రానున్న సినిమాకు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చింది. ఇటీవల జపాన్ వెళ్లిన దర్శకుడు రాజమౌళి స్థానిక మీడియాతో మాట్లాడుతూ మహేశ్ బాబుతో సినిమా చేస్తున్నా. ఆయన మంచి నటుడు. చాలా అందంగా ఉంటారు. మీలో కొందరికి ఆయన గురించి తెలిసే ఉంటుంది. ఈ చిత్రానికి సంబంధించి ప్రీప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. త్వరలో చిత్రీకరణను ప్రారంభిస్తాం. వేగంగా నిర్మాణం పూర్తి చేసి మహేశ్‌బాబును ఇక్కడికి తీసుకురావాలని భావిస్తున్నా అని వెల్లడించారు.


సినిమా

## జోరు మీదున్న నటి కియారా




ఇప్పుడు బాలీవుడ్ లో అగ్ర నటీమణుల్లో స్థానం సంపాదించడానికి ప్రయత్నం చేస్తున్న నటీమణుల్లో కియారా అద్వానీ ఒకరు. రామ్ చరణ్ పక్కన 'గేమ్ చెంజర్' సినిమాలో కథానాయికగా నటిస్తోంది. శంకర్ దర్శకుడు, దిల్ రాజు నిర్మాత. ఈ సినిమా ఒక్క తెలుగులోనే కాకుండా, మిగతా భాషల్లో కూడా విడుదలయ్యే అవకాశాలు వున్నాయి. ఈ సినిమాతో పాటు ఇంకో పెద్ద సినిమా 'వార్ 2' లో కూడా కియారా కథానాయిక. గతేడాది ఫిబ్రవరి 7 తనతో ప్రేమలో వున్న సహచర నటుడు సిద్దార్థ్ మల్హోత్రా ని వివాహం చేసుకుంది కియారా అద్వానీ. తెలుగులో 'భరత్ అనే నేను' సినిమాతో మహేష్ బాబు పక్కన ఆరంగేట్రం చేసింది. ఆ తరువాత 'వినయ విధేయ రామ' అనే ఇంకో తెలుగు సినిమాలో నటించింది, ఇందులో రామ్ చరణ్ కథానాయకుడు. కియారా కి 'భరత్ అనే నేను' పెద్ద బ్రేక్ ఇచ్చిన సినిమా. తెలుగు సినిమా విడుదల సమయంలోనే 'లస్ట్ స్టోరీస్' అనే ఒక వెబ్ సినిమాలో ఒక బోల్డ్ పాత్రలో నటించి, అందరి దృష్టి ఆకర్షించింది. తెలుగులో పెద్ద విజయం సాధించిన 'అర్జున్ రెడ్డి' సినిమాని హిందీలో తెలుగు దర్శకుడు సందీప్ వంగా 'కబీర్ సింగ్' పేరుతో అర్జున్ కపూర్ కథానాయకుడిగా రీమేక్ చేశారు. అందులో కియారా అద్వానీ కథానాయికగా నటించింది. హిందీలో కూడా ఇది పెద్ద విజయం సాధించింది. హిందీలో తన ప్రియుడు సిద్దార్థ్ మల్హోత్రా పక్కన నటించిన యుద్ధ నేపథ్యంలో వచ్చిన సినిమా 'షేర్ షా'. ఇది నేరుగా అమెజాన్ ప్రైమ్ వీడియో లో విడుదలైంది. ఈ సినిమా అటు విమర్శకుల ప్రశంశలు, ఇటు ప్రేక్షకుల మన్ననలు పొందింది. 2021లో వచ్చిన ఈ సినిమా తరువాత కియారా సినిమాలు అంతగా బాక్స్ ఆఫీస్ దగ్గర ప్రభావం చూపలేదని చెప్పాలి. కియారా ఇప్పుడు 'గేమ్ చేంజర్' సినిమాపై చాలా అసలు పెట్టుకున్నట్టు కనపడుతోంది. ఎందుకంటే ఇప్పుడు ఆమె చేతిలో ఈ ఒక్క తెలుగు సినిమానే వుంది. ఇది హిందీలో కూడా విడుదలవుతుంది అని అనుకుంటున్నారు. ఈ సినిమా విడుదల తరువాత ఆమె 'వార్ 2' షూటింగ్ లో పాల్గొంటారు. ఇందులో ఎన్టీఆర్, హ్రితిక్ రోషన్ లు కథానాయకులు.

## సూర్య మూవీ విడుదల వాయిదా



తమిళ అగ్ర కథానాయకుడు సూర్య, సుధా కొంగరాల కాంబినేషన్‌లో రానున్న సినిమా వాయిదా పడింది. ఈ విషయాన్ని చిత్రబృందం ఎక్స్ వేదికగా ప్రకటించింది. పురాణనూరు చిత్రీకరణ అధిక సమయం తీసుకుంటుంది. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. ఈ చిత్రం మాకెంతో ప్రత్యేకం. ప్రేక్షకులకు నచ్చేలా తెరకెక్కించేందుకు ప్రయత్నిస్తున్నాం. త్వరలో షూటింగ్ ప్రారంభిస్తాం అని పేర్కొంది. 'ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. మీ కాంబినేషన్‌లో వచ్చిన 'సూరారై పోట్రు' (ఆకాశం నీ హద్దురా) మంచి విజయాన్ని అందుకుంది. ఈ చిత్రం కూడా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది' అని అభిమానులు కామెంట్స్ పెడుతున్నారు. సూర్య43 వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా తెరకెక్కనుంది. ఇందులో మలయాళ హీరో దుల్కర్ సల్మాన్, నజ్రియా, బాలీవుడ్ నటుడు విజయ్ వర్మ కీలక పాత్రల్లో నటించనున్నారు. జీవీ ప్రకాశ్ మ్యూజిక్ డైరెక్టర్. 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తోంది. గతంలో దీనికి సంబంధించిన పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. అందులో టైటిల్ 'పురాణనూరు' పేరుతో ముగుస్తుంది. ప్రస్తుతం సూర్య, శివ దర్శకత్వంలో 'కంగువా'లో నటిస్తున్నారు. దిశా పఠానీ కథానాయిక. బాబీ డేవోల్ ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. జగపతి బాబు, యోగిబాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వేసవిలో ఈ సినిమా విడుదల కానుంది.

## గ్లాస్ అంటే సైజ్ కాదు



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా రూపొందుతోంది. ఈ సినిమా టైటిల్ పోస్టర్ ను వదిలిన దగ్గర నుంచి అంచనాలు పెరుగుతూ వెళుతున్నాయి. ఈ సినిమాకి సంబంధించిన షూటింగు కొంతవరకూ జరిగింది. ఎన్నికల తరువాత నుంచి మళ్లీ పవన్ ఈ సినిమా షూటింగులో పాల్గొననున్నాడు. ఈ నేపథ్యంలో ఈ సినిమా నుంచి 'భగత్స్ బ్లేజ్' పేరుతో కొంతసేపటి క్రితం ఒక వీడియోను రిలీజ్ చేశారు. జాతర సమయంలో హింసకి పాల్పడటానికి ట్రై చేసిన రౌడీ మూకకి పోలీస్ ఆఫీసర్ గా పవన్ బుద్ధి చెప్పడం ఈ వీడియోలో చూపించారు. ఆ సందర్భంలో 'గాజు పగిలేకొద్దీ పదునెక్కుద్ది .. కచ్చితంగా గుర్తుపెట్టుకో .. గ్లాస్ అంటే సైజ్ కాదు .. సైన్యం .. కనిపించని సైన్యం' అంటూ పవన్ చెప్పిన డైలాగ్స్ ఆయన ఫ్యాన్స్ ను ఆకట్టుకుంటాయి.



# మధ్య మా'నీరేదీ'?

● జలాశయంలో తగ్గుతున్న నీటి నిల్వలు... ● తాగునీటికి భవిష్యత్‌లో ఆగమ్యగోచరం

తెలంగాణ రాష్ట్రానికి గుండెకాయ లాంటిదేనా మధ్య మానేరు ప్రాజెక్టులో రోజు రోజుకు నీటి నిల్వలు తగ్గడంతో రానున్న రోజుల్లో తాగునీటికి తిప్పలు తప్పేటట్లు లేవు.యాసంగి పంటలు చేతికొచ్చే సమయంలో మధ్య మానేరు ప్రాజెక్ట్ అధికారులు నీటి విడుదలను లోయర్ మానేర్ డ్యామ్ కు వదులుతున్నారు. సాగు, తాగు నీటి అవసరాల కోసం దిగువన ఎల్ఎండీ జలాశయం,కుడి కాలువ,ఏడుమ కాలువ, మిషన్ భగీరథకు నీటి వదులుతున్నారు.

– రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చి 19 (జనంసాక్షి) :

జూన్ 2023 నుంచి మిడ్ మానేరు కు 45.017 టీఎంసీల నీరు వచ్చి చేరింది. 53.772 టీఎంసీల నీటిని మిడ్ మానేరు జలాశయం నుంచి ఎల్ఎండి కుడి కాలువ ఎడమ కాలువ మిషన్ భగీరథకు వదిలారు. బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద 27.55 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన మిడ్ మానేరు జలాశయం (మధ్యమానేరు) యాసంగిలో పంటలకు ఆధారంగా మారింది. వరి నాట్లు ప్రారంభమైనప్పటి నుంచి నేటి వరకు రైతుల అవసరాల మేరకు జలాశయం నుంచి అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయానికి ఎస్సారెస్పీ వరద కాలువ ద్వారా, కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రామడుగు మండలం గాయత్రిపంపు హౌజ్ నుంచి వరదకాలువ ద్వారా నీరు వస్తుంది. వర్షాకాలంలో మానేరు, మూలవాగుల నుంచి వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుంది. జలాశయం నుంచి దిగువన ఎల్ఎండీ జలాశయం, కుడి, ఎడమ కాలువలు, అన్నపూర్ణ జలాశయం , వేములవాడ గుడి చెరువు, మిషన్ భగీరథకు నీరు వెళ్తుంది. 2023 జూన్ నుంచి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 6.012 టీఎంసీలు, ఎస్సారెస్పీ నుంచి 15. 959 టీఎంసీలు, మానేరు, మూలవాగు నుంచి 23. 046 టీఎంసీల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరింది. ఇదే సమయంలో ఎల్ఎండీ జలాశయానికి 41.96 టీఎంసీలు, అన్నపూర్ణ జలాశయానికి 47.94 టీఎంసీలు, కుడి కాలువకు 3.299, ఎడమ కాలువకు 0.093 టీఎంసీల నీటి విడుదల చేశారు.

**జలాశయంలో తగ్గుతున్న నీటి నిల్వలు..**

మిడ్ మానేరు జలాశయం నుంచి నీటి విడుదల కొనసాగుతుండటంతో జలాశయంలో నీటి నిల్వలు రోజు రోజుకు తగ్గుతున్నాయి. మిడ్ మానేరు జలశయంలో ముంపునకు గురైన కొదురుపాక,అనుపురం, కోడుముంజ,తదితర గ్రామాల్లో నీటి నిల్వలు తగ్గడంతో పాత ఇంటి కట్టడాలు తేలాయి. జలాశయానికి ఎస్సారెస్పీ, గాయత్రి పంపు హౌజ్ నుంచి ఎలాంటి ఇన్ ఫ్లో రావడం లేదు. నాలుగు రోజుల క్రితం వరకు జలాశయం గేట్ల నుంచి దిగువన ఎల్ఎండీకి నీటిని వదలగా జలాశయంలో నీటిమట్టం తగ్గడంతో గేట్లపై నుంచి నీరు వెళ్లే పరిస్థితి లేదు. దీంతో జలాశయం రివర్స్ నుంచి దిగువన ఎల్ఎండికి నీటిని వదులుతున్నారు. ఎల్ఎండి జలాశయానికి 3500 క్యూసెక్కులు, కుడి కాలువకు 550, ఎడమ కాలువకు 10 క్యూసెక్కుల, మిషన్ భగీరథకు 40 క్యూసెక్కుల నీరు వెళ్తుంది. జలాశయంలో గత ఏడాది మార్చిన 20 టీఎంసీల నీరు నిల్వఉంది. ప్రస్తుతం జలాశయంలో 10.20 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. మార్చి నెలాఖరు వరకు పంటలకు నీటి విడుదల కొనసాగించనున్నారు. ఎక్కడైన రైతులు పంటలకు సాగు ఆలస్యంగా ప్రారంభిస్తే ఏప్రిల్ వరకు నీటి విడుదలను కొనసాగించే అవకాశం వుంది.

**పడిపోతున్న భూగర్భ జలాలు**

మిడ్ మానేరు జలాశయంలో నీటిలో తగ్గడంతో సమీప గ్రామాలతో పాటు జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. వ్యవసాయ బావులు బోర్లలో నీరు తగ్గడంతో వరి పంటలకు మీరు అందించేందుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవికి ముందే జలాశయంలో నీరు తగ్గిపోవడంతో రాబోయే రోజుల మరింత ఇబ్బంది కరమైన పరిస్థితి తలెత్తే అవకాశం ఉంది.



అమెరికాలోని మరో ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీ నుంచి

# కేటీఆర్‌కు ఆహ్వానం

- వచ్చే నెలలో జరిగే ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్‌కు హాజరు కావాలని లేఖ
- భారత పారిశ్రామిక రంగంలో ఉన్న అవకాశాలు, సవాళ్లపై ప్రసంగించాలని విజ్ఞప్తి



హైదరాబాద్, మార్చి 19 (జనంసాక్షి) : అమెరికాలోని నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్ కు హాజరు కావాలని రాష్ట్ర మాజీ మంత్రి కేటిఆర్ కు ఆహ్వానం అందింది. ఇల్లినాయ్ రాష్ట్రంలో ఏప్రిల్ 13న జరగబోతున్న ఈ సదస్సులో భారత పారిశ్రామిక రంగంలో నెలకొన్న అవకాశాలు, సవాళ్లు అనే అంశంపై జరిగే చర్చలో పాల్గొని ప్రసంగించాలని ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వంలో ఐటీ, పారిశ్రామిక శాఖ మంత్రిగా పనిచేసిన సందర్భంగా పారిశ్రామిక రంగాన్ని పరుగులు పెట్టించడానికి, పెట్టుబడులను ఆకర్షించడానికి రూపకల్పన చేసిన పాలసీలు, అవి సాధించిన విజయాలను సదస్సులో వివరించి స్ఫూర్తి నింపాలని కేటిఆర్ ను కోరారు. ఈ మేరకు యూనివర్సిటీలోని కెల్లాగ్ స్కూల్ ఆఫ్ మేనేజ్ మెంట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ డైరెక్టర్ శ్వేత మేడపాటి లేఖలో విజ్ఞప్తిచేశారు. అమెరికాలోని ఇవాన్ స్టన్ లో 1908లో నెలకొల్పిన ఈ బిజినెస్ స్కూల్ ప్రపంచవ్యాప్తంగా బెస్ట్ బిజినెస్ ర్యాంకింగ్ లో రెండో స్థానంలో నిలిచిందని ఆమె తెలిపారు. ప్రస్తుతం భారత్ లోని పారిశ్రామిక రంగంలో కొత్త అవకాశాలు ఎలా ఉండబోతున్నాయి, క్షేత్రస్థాయిలో ఎలాంటి సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందనే అంశంపై చర్చించేందుకు ఇండస్ట్రీ లీడర్లను, వ్యాపారవేత్తలను, విధానాల రూపకల్పనలో అనుభవం కలిగిన నాయకులను ఒక్క తాటిపైకి తేవాలన్న ఆలోచనతోనే ఈ సదస్సును నిర్వహిస్తున్నట్టు శ్వేత మేడపాటి తెలిపారు. కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలను ప్రోత్సహించాలన్న ఆశయంతో యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇలాంటి ఎన్నో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్టు ఆమె పేర్కొన్నారు.

# నన్ను గెలిపించిండి..మీ గొంతుకనైతా

- వరంగల్ బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య



వరంగల్, మార్చి19 (జనంసాక్షి) : వరంగల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా తనను గెలిపించమని ప్రజలందరిని కోరుకుంటున్నట్లు ఎంపి అభ్యర్థి కడియం కావ్య కోరారు. తనను గెలిపిస్తే మీా అందరి గొంతుకగా నేను ఢిల్లీలో మాట్లాడుతాను అని ఎంపీ అభ్యర్థి కడియం కావ్య తెలిపారు. వరంగల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కడియం కావ్య మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏర్పడిన పార్టీ బీఆర్ఎస్. బీజేపీ కొత్తగా వచ్చిన పార్టీ కాదు.. పదేండ్ల నుంచి తెలంగాణకు అన్యాయం చేస్తూనే వస్తోంది. కాంగ్రెస్, బీజేపీకి చెందిన ఎంపీలు వారి నాయకత్వం ప్రకారం నడుచుకుంటారు. వారికి వేరే ప్రయోజనాలు ఉంటాయి. కానీ బీఆర్ఎస్ నాయకుడు కేసీఆర్‌కు మాత్రం వేరే ప్రయోజనాలు లేవు. ఆయన కేవలం రాష్ట్రం కోసం పోరాడారు. తెలంగాణను సాధించారని కడియం కావ్య తెలిపారు. బిఆర్ఎస్‌కు తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యమని అన్నారు. ఇది గమనించి తనను గెలిపించాలని ఆమె కోరారు.

# రైతులపైనున్న అక్రమ కేసులు ఎత్తివేయాలి

- కరీంనగర్ మాజీ ఎంపీ బోయిన్ పల్లి వినోద్ కుమార్
- అకాల వర్షానికి నష్టపోయిన రైతులను తక్షణం ఆదుకోవాలి



రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 19 (జనంసాక్షి) : రాజన్న సిరిసిల్ల జిల్లాలో రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కరీంనగర్ మాజీ ఎంపీ, బిఆర్ఎస్ నాయకులు బోయినపల్లి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల ప్రగతిభవన్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వినోద్ కుమార్ మాట్లాడుతూ సోమవారం కురిసిన అకాల వర్షాలకు రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంతో పాటు తంగళ్ళపల్లి మండలంలోని అనేకమంది రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ముస్తాబాద్ మండలం లోని కొన్ని గ్రామాలలో మానేరు వాగు నుండి అక్రమంగా నీటి తరలిస్తున్నారని రైతులపై అక్రమ కేసులు పెట్టడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కేసులను ఎత్తివేసి నష్టపోయిన పంటలకు ఎకరాకు పదివేలు చొప్పున పరిహారం అందించి ఆదుకోవా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గత పది సంవత్సరాలు కాలంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గత ముఖ్యమంత్రి కేసీఆర్ చూశారని అన్నారు. రైతుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోని కాళేశ్వరం మేడిగడ్డ వద్ద కాపర్ డ్యాం నిర్మించి తక్షణం రైతులకు నీటిని అందించే విధంగా ఆలోచించాలని అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో విద్యుత్ వైర్లు తెగిపడ మరణించిన రైతు కుటుంబాన్ని పది లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జడ్పీ చైర్మన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవిందర్ రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, తెలంగాణ టెక్స్ టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఐపిఎల్ క్రికెట్ పోటీల నిర్వహణకు పటిష్ట భద్రత

- క్రికెట్ అభిమానులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు..
- 27న ఉప్పల్ రాజీవ్ గాంధీ స్టేడియంలో సన్ రైజర్స్, ముంబై ఇండియన్స్ జట్ల మధ్య తొలి మ్యాచ్..
- రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి





మల్కాజిగిరి, మార్చి 19 (జనంసాక్షి) : ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో త్వరలో జరగనున్న 2024 ఐపిఎల్ క్రికెట్ పోటీల నిర్వహణకు అన్ని రకాల ప్రతిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి పేర్కొన్నారు.మంగళవారం నేరెడ్ మెట్ లోని రాచకొండ కమిషనర్ కార్యాలయంలో డీసీపీలు,ఏసిపిలు మరియు సన్ రైజర్స్ టీమ్ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు సలహాలు చేశారు.ఉప్పల్ స్టేడియంలో జరుగనున్న మ్యాచ్ ల నిర్వహణకు అవసరమైన అన్ని రకాల సెక్యూరిటీ పరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.టికెట్ల పంపిణీలో ఎటువంటి గందరగోళం లేకుండా చూడాలని ఐపీఎల్ నిర్వహణ బృందానికి సూచించారు.ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు అవసరమైన పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రధాన రహదారిపై సాధారణ వాహనదారుల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా, ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.స్టేడియం పరిసరాల్లో సీసీటీవీలను ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రతీ ఒక్కరి కదలికలూ సీసీటీవీ కెమెరాల్లో నిక్షిప్తం అవుతాయని పేర్కొన్నారు.నకిలీ టికెట్లు అమ్మేవారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని,టికెట్ల పంపిణీ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని, ఎటువంటి పుకార్లనూ నమ్మవద్దని తెలిపారు.ఈ సమావేశంలో మల్కాజిగిరి డిసిపి పద్మజ,ఎస్బి డీసీపీ కరుణాకర్,డీసీపీ ట్రాఫిక్ మనోహర్,ఎస్ఓటి అడిషనల్ డీసీపీ నరసింహ రెడ్డి,ఏసిపి శ్రీధర్ రెడ్డి, ఏసిపి నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై టీ-సాట్ వేదికగా

# ప్రత్యేక ప్రత్యక్ష ప్రసారం

- టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి



హైదరాబాద్, మార్చి 19 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసం టి-సాట్ ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి మంగళవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో తెలిపారు. టి-సాట్ నిపుణ ఛానల్ లో మార్చి 20వ తేదీ బుధవారం సాయంత్రం నాలుగు గంటల నుండి ఐదు గంటల వరకు గంట పాటు ప్రృతేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. భూ రికార్డులపై అవగాహన కలిగిన న్యాయ నిపుణులు భూమి సునీల్ కుమార్ చే ప్రత్యేక ముఖాముఖి లైవ్ చర్చా కార్యక్రమంలో పాల్గొని సమస్యలపై సలహాలు-సూచనలు అందచేస్తారని సీఈవో స్పష్టం చేశారు. భూ సమస్యలపై సలహాలు-సూచనల కోసం 040 23540326, 23450726 టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 4039 లకు కాల్ చేయాలని సీఈవో వేణుగోపాల్ రెడ్డి సూచించారు.

# పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలి

- బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
- మాజీ మంత్రి, ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్ఎస్పీ



హైదరాబాద్, మార్చి 19 (జనంసాక్షి) : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేసి,భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కోరారు. మంగళవారం రాత్రి కర్నూలులో భారాస ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నాగర్ కర్నూలు లోక్ సభ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేసి బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకోవాలని అన్నారు.ఈ సందర్భంగా డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ భారాసలో చేరడం పట్ల ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామి రెడ్డి అభినందనలు తెలియజేసి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు హైదరాబాదులో మాజీ మంత్రి, భారాస సీనియర్ నాయకులు నాగం జనార్ధన్ రెడ్డిని కలిసి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించేందుకు కృషి చేయాలని ఆయన కోరారు.



# ప్రవీణ్ రావు వ్యవహారంలో కూపీ లాగుతున్న పోలీసులు

హైదరాబాద్, మార్చి19 (జనంసాక్షి) : కొన్ని రోజులుగా తెలంగాణలో ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు ఫోన్ ట్యాపింగ్ కేసు సంచలనం సృష్టిస్తోంది. విచారణలో తవ్వే కొద్దీ విషయాలు బయటపడుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కీలక నేతల ఫోన్లు ట్యాపింగ్ చేసిన ప్రణీత్ రావు.. ఇప్పటికే హార్డ్ డిస్కులను ఎత్తుకెళ్లిన సంగతి తెలిసిందే.. ట్యాపింగ్ డివైస్ మొత్తాన్ని ప్రణీత్ రావు ధ్వంసం చేసినట్లు విచారణలో అధికారులు గుర్తించారు. డివైస్ ని ధ్వంసం చేసి అందులో హార్డ్ డిస్క్ మొత్తాన్ని పగలగొట్టినట్లు నిర్ధారించారు. అడవిలో పడేసిన పలు డివైజ్ లను స్వాధీనం చేసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు ప్రణీత్ రావు వెనకాల మీడియా సంస్థ యజమాని ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఒక మీడియా సంస్థ యజమాని ఇచ్చిన నెంబర్లను ప్రణీత్ రావు ట్యాప్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆ మీడియా సంస్థ యజమాని దగ్గర ఒక సర్వర్ పెట్టినట్లు అనుమానిస్తున్నారు. బిఆర్ఎస్ కీలక నేత ఆదేశాలతో వరంగల్, సిరిసిల్లలో సర్వర్లు ఏర్పాట్లు చేసినట్లు గుర్తించారు పోలీసులు.

# వీధికుక్కల బీభత్సం

- ఒకేరోజు ఏడుగురు చిన్నారులపై దాడి



నాగర్‌కర్నూలు, మార్చి19 (జనంసాక్షి) : రాష్ట్రంలో వీధికుక్కల స్వైర విహారం చేస్తున్నాయి. మనుషులు, పశువులపై దాడి చేస్తూ బీభత్సం సృష్టిస్తున్నాయి. తాజాగా నాగర్‌కర్నూలు జిల్లాలో వీధి కుక్కలు ఒక్క రోజే ఏడుగురు చిన్నారులపై దాడి చేశాయి. గాయపడిన చిన్నారులను హాస్పిటల్స్‌లో చేర్పించారు. కాగా, అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కలు ఎప్పుడు ఎవరిపైనా దాడి చేస్తాయోనని భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల కట్టడికి చర్యలు తీసుకుకోవాలని కోరుతున్నారు.

# కోదండరాంను కలిసిన డిప్యూటీ మేయర్

హైదరాబాద్, మార్చి 19 (జనంసాక్షి) : తెలంగాణ జన సమితి పార్టీ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్‌ని తార్నాకలోని వారి నివాసంలో గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, కార్మిక విభాగ రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు.



Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Sy.No. 210, Padmanagar, Chinthakunta, Karimnagar Dist, Telangana - 505462 Published at Janam Sakshi Office, Bawazeer Estate, Beside HUDA High School, Civil Hospital Road, Karimnagar - 505001, Telangana. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2002/12105